

పురాతనమైన సమస్తరోగాలకు

ఆయుర్వేద చికిత్స

మూల వ్యాధి, తెల్లమచ్చలు,పక్షవాతములతోపాటు అన్ని రకాల నొప్పులకు పసమూలికలతో వైద్యంచేయబడును.

శ్రీ దత్తత్రిలింగేశ్వరాశ్రమాలయము

నారాయణపేట రోడు,ఊట్కూర్‌మండలం

మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895



# వార్తా తరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar | సంపుటి :25 | సంచిక :74 సంపాదకులు: కోటకొండ ఎల్ల విజయరాజు | శుక్రవారం 24 జూలై 2026 | పేజీలు :12 | వెల రూ5 /-


## మెట్రో స్టేషన్ల బంద్ పై
# సుప్రీం సీరియస్




**న్యూఢిల్లీ, జూలై 23:**దేశ రాజధాని ఢిల్లీలో విద్యార్థుల నిరసనల కారణంగా పలు మెట్రో స్టేషన్లను మూసివేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారం గురువారం సుప్రీంకోర్టుకు చేరింది. స్టేషన్ల మూసివేతతో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందులను సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సీబీఏ) అధ్యక్షుడు వికాస్ సింగ్.. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన సీజేఐ, మధ్యాహ్న భోజన విరామ సమయానికి సమస్య పరిష్కారం - మిగతా3లో

## ప్రధాన్ రాజీనామాను బీఆర్ఎస్
# ఎందుకు డిమాండ్ చేయడం లేదు..?

**ఫిర్యాదు చేయాలని ముఖ్యమంత్రి డిమాండ్**

**తప్పుడు ఫిర్యాదు అయితే లోపల వేయిస్తానని హెచ్చరిక**

**ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు బీఆర్ఎస్ డిమాండ్ చేయడం లేదని విమర్శ**



తనకు రెండు చోట్ల ఓట్లు ఉన్నాయంటూ వస్తున్న ఆరోపణలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. హైదరాబాద్‌లో మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడిన ఆయన, తనపై వస్తున్న ఆరోపణలపై దమ్ముంటే ఫిర్యాదు చేయాలని సవాల్ విసిరారు. ఒకవేళ అది తప్పుడు ఫిర్యాదు అని తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.తన ఓటు బదిలీ కోసం నిబంధనల ప్రకారం ఇప్పటికే కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. గతంలో జీహెచ్‌ఎంసీ పరిధిలో ఆంధ్ర ప్రాంతానికి చెందిన ఓట్లను తొలగించారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, అప్పటి జీహెచ్‌ఎంసీ కమిషనర్‌పై కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో - మిగతా3లో

## ఫస్ట్...లాస్ట్...
# తెలంగాణనే



**హైదరాబాద్, జూలై 23:**కేంద్ర విద్యాశాఖ విడుదల చేసిన పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ **(PGI)** 2.0 నివేదికలో తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మిశ్రమ ఫలితాలను సాధించింది. ఓవరాల్ నేషనల్ ర్యాంకింగ్స్‌లో తెలంగాణ - మిగతా3లో

## యూపీఏ హయాంలో
# పేపర్లు లీక్..



**కాంగ్రెస్ నేతలు ఎందుకు రాజీనామా చేయలేదు: కిషన్ రెడ్డి**

**న్యూఢిల్లీ, జులై 23:** దేశ రాజధాని న్యూఢిల్లీలోని జంతర్ మంతర్‌తోపాటు రాష్ట్రాలలో జరుగుతున్న సంఘటనలు దురదృష్టకరమని కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ సంఘటనలు రాజకీయ ప్రేరేపితమైనవని అభివర్ణించారు. గురువారం న్యూఢిల్లీలో ఆయన మాట్లాడుతూ.. గతంలో షాహిన్‌బాగ్‌లో ఆందోళనలు చేసిన నిరసనకారులు దీని వెనుక ఉన్నట్లు అనిపిస్తుందని అన్నారు. నీట్ పేపర్ లీక్ చేసిన వారిని అరెస్ట్ చేసి కేంద్ర ప్రభుత్వం జైలులో పెట్టిందని తెలిపారు. విద్యార్థులకు నష్టం జరగ వద్దని మరోసారి నీట్ పరీక్షను నిర్వహించామని వివరించారు. పేపర్ లీక్‌పై 2024 చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. జంతర్ మంతర్‌లో జరుగుతున్న విద్యార్థుల ఆందోళనలు పట్టుకుని కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీల నేతలు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నుకున్న ప్రభుత్వాలను కూల్చాలని చూస్తున్నారంటూ ప్రతిపక్ష పార్టీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పేపర్లు లీక్ అయినప్పుడు కాంగ్రెస్‌లోని నేతలు ఏ రోజైన రాజీనామా చేశారా? అని ఆ పార్టీ నేతలను నిలదీశారు. యూపీఏ హయాంలో ప్రశ్న పత్రాలు లీక్ అయ్యాయనే విషయాన్ని గుర్తు ఉంచుకోవాలని ఆ పార్టీ నేతలకు కేంద్ర మంత్రి ఈ సందర్భంగా సూచించారు. కేంద్రాన్ని ప్రశ్నించే హక్కు రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఉందా? అని బల్లగుద్దీ ప్రశ్నించారు. ఏ ముఖం పెట్టుకొని ప్రధాని ఇంటి ముందు ధర్నా చేస్తున్నారంటూ కాంగ్రెస్ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. ఫాస్ట్ ట్రాక్ ద్వారా చట్టాన్ని మరింత కఠినం చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పదో తరగతి పేపర్ లీక్ అయిందని అన్నారు. మరి ముఖ్యమంత్రి పదవికి రేవంత్ రెడ్డి రాజీనామా ఎందుకు చేయలేదని ఆ పార్టీ నేతలను ఆయన నిలదీశారు. చలో రాజ్ భవన్ కార్యక్రమం నిర్వహించే సత్తా మీకు ఎక్కడిదంటూ తెలంగాణలోని అధికార పార్టీ నేతల తీరును ఆయన ఎండగట్టారు. విద్యార్థులపై ప్రేమ లేదంటూ కాంగ్రెస్ పార్టీ నేతలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నిప్పులు చెరిగారు.

## భారత్‌ను భయంతో కాదు..
# ప్రజాస్వామ్యం, రాజ్యాంగంతో నడపాలి

**: మంత్రి ఉత్తమ్**



**హైదరాబాద్, జులై 23**: యువత గొంతు నొక్కితే బీజేపీ రాజకీయ పతనం తప్పదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. ఈరోజు(గురువారం) మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని భయపెట్టలేరని.. రాజ్యాంగాన్ని అణచలేరన్నారు. విద్యార్థుల ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా నిర్బంధాలు సరికాదని అన్నారు. ఉద్యోగాలు అడిగిన యువతకు లాఠీలు, కేసులే బీజేపీ సమాధానమనమంటూ విమర్శలు గుప్పించారు. ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కే అని చెప్పుకొచ్చారు. విద్యార్థుల స్వరాన్ని అణచివేయడం ప్రజాస్వామ్యానికి ముప్పని వ్యాఖ్యానించారు. యువత భవిష్యత్తుపై కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మంత్రి విమర్శించారు. విద్యార్థుల మధ్య నిలిచిన రాహుల్ గాంధీ నిజమైన ప్రజానాయకుడన్నారు. ప్రజల మధ్య ఉండే నాయకత్వానికే దేశం మద్దతిస్తుందని తెలిపారు. భయపెట్టి ప్రజల స్వరాన్ని శాశ్వతంగా అణచలేరని అన్నారు. విద్యార్థుల కలలను సంకెళ్లతో బంధించలేరని స్పష్టం చేశారు. యువత ఆశయాలను జైళ్ల గోడల మధ్య నిర్బంధించలేరన్నారు. రాజ్యాంగాన్ని ఎవరూ ఓడించలేరని.. రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్ చారిత్రక బాధ్యత అని వెల్లడించారు. 'యువత విద్వేషం కాదు... విశ్వాసం కోరుకుంటోంది. అహంకారం కాదు... జవాబుదారీతనం కోరుకుంటోంది. ప్రచారం కాదు... పారదర్శక పాలననే యువత కోరుకుంటోంది' అంటూ వ్యాఖ్యానించారు. 2029 ఎన్నికలు రాజ్యాంగ పరిరక్షణకు కీలకమని ఉత్తమ్ వెల్లడించారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ ప్రత్యామ్నాయం అందిస్తోందన్నారు. తెలంగాణలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన అందిస్తోందని తెలిపారు. ప్రజల గొంతు వినే ప్రభుత్వాలే చరిత్రలో నిలుస్తాయన్నారు. 'భారత్‌ను భయంతో కాదు.. ప్రజాస్వామ్యం, రాజ్యాంగంతో నడపాలి' అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు.

## తెలంగాణలో తీవ్ర
# వర్షాభావ పరిస్థితులు:పొన్నం

82 **హైదరాబాద్, జూలై 23:**ఎల్‌నినో ప్రభావం కారణంగా తెలంగాణ వ్యాప్తంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణంలో తలెత్తిన ఈ మార్పుల దృష్ట్యా ప్రజలకు, రైతులకు నీటి ఎద్దడి రాకుండా అధికారులు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని ఐఓసీ కార్యాలయంలో ఎల్‌నినో ప్రభావం, తాగునీటి పరిస్థితులపై మంత్రి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ భేటీకి సిద్దిపేట, కరీంనగర్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లతో పాటు హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు హాజరయ్యారు.సమీక్ష సందర్భంగా



మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో తాగునీటి కొరతతో పాటు పశువులకు గ్రాసం లభించక ఇబ్బందులు ఎదురయ్యే సూచనలు ఉన్నాయని అధికారులను హెచ్చరించారు. రాబోయే జూన్ నెల వరకు వర్షాలు పడే అవకాశం తక్కువగా ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారని వెల్లడించారు. ఈ కరవు పరిస్థితులను తట్టుకోవాలంటే రైతులు నీటి వినియోగం తక్కువగా ఉండే ఆరుతడి పంటలు వేసేలా అధికారులు వారికి పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని సూచించారు.మరోవైపు రాష్ట్రంలో రోజురోజుకూ పడిపోతున్న భూగర్భ జలమట్టాలను మళ్లీ పెంపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందడుగు వేయాలని పొన్నం తెలిపారు. 'వీబీజీ రాంజీ' ఉపాధి హామీ పథకాన్ని ఉపయోగించుకుని ప్రతి ఊరిలో పెద్ద ఎత్తున ఇంకుడు గుంతల తవ్వకాలు చేపట్టాలని, పడిన ప్రతి వర్షపు బొట్టునూ - మిగతా3లో

## రేవంత్ లీగల్
# నోటీసులు...




**హైదరాబాద్, జూలై 23:**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనపై చేసిన ఆరోపణలను వెంటనే ఉపసంహరించుకుని బహిరంగంగా క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ మేరకు తన లీగల్ టీమ్ త్వరలోనే ముఖ్యమంత్రికి నోటీసు పంపనుందని వెల్లడించారు.కొడంగల్‌లో జరిగిన సభలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు స్పందిస్తూ కేటీఆర్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. గ్లోబరీనా సంస్థతో బీఆర్ఎస్‌కు గానీ, తన కుటుంబానికి గానీ, తనకు గానీ ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. పేపర్ లీక్‌లాంటి సున్నితమైన అంశంపై ముఖ్యమంత్రి బాధ్యతారాహిత్యంగా తప్పుడు ఆరోపణలు చేయడం దురదృష్టకరమని విమర్శించారు.ముఖ్యమంత్రి హోదాలో ఉండి చౌకబారు రాజకీయాల కోసం అసత్యాలను ప్రచారం చేయడం తగదన్నారు. కనీసం ఒక్కసారైనా ముఖ్యమంత్రిలా వ్యవహరించాలని రేవంత్ రెడ్డికి సూచించారు.తనపై తరచూ అసభ్యకరమైన, అర్థంలేని ఆరోపణలు చేసినప్పటికీ ప్రతి సందర్భంలో స్పందించలేదని కేటీఆర్ పేర్కొన్నారు. తాను మౌనంగా ఉండడాన్ని ఆరోపణలను అంగీకరించినట్లు భావించవద్దన్నారు. "బురదలో కుస్తీ పట్టడం నాకు ఇష్టం ఉండదు. అందుకే చాలా సందర్భాల్లో స్పందించను" అని వ్యాఖ్యానించారు.

**నిరసనకు మద్దతు**

ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యలను - మిగతా3లో

## శాసనసభలో
# మరమత్తు పనులు

**పరిశీలించిన సీఎం రేవంత్**

**హైదరాబాద్:** చారిత్రక ప్రాధాన్యం కలిగిన తెలంగాణ శాసనసభ భవనంలో జరుగుతున్న మరమ్మతు, పునరుద్ధరణ పనులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పరిశీలించారు. ప్రాంగణమంతా తిరిగి పనుల పురోగతిపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకుని, పలు సూచనలు చేశారు.శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ విప్లు ఆది శ్రీనివాస్, అద్దంకి దయాకర్ , బల్మూర్ వెంకట్ , ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ , జైవీర్ రెడ్డి , ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## కొత్త పేర్లతో...
# దేశ వ్యతిరేక వేదికలను ఏర్పాటు

**యూపీఏ హయాంలోనే అత్యధిక జాతీయ పరీక్షల పేపర్లు లీక్:బీజేపీ రామచంద్రరావు**



**హైదరాబాద్:**దేశంలో అలజడులు సృష్టించి మోదీ ప్రభుత్వాన్ని బలహీనపర్చేందుకు కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు, విదేశీ విచ్ఛిన్నకర శక్తులు కుట్ర చేస్తున్నాయి. శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్ తరహా పరిస్థితులు భారత్లో సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచంద్రరావు అన్నారు. గురువారం అయన మీడియాతో మాట్లాడారు.రామచంద్రరావు మాట్లాడుతూ ఎస్ఎఫ్ ఐ, ఏఐఎస్ఎఫ్, ఏఎస్ఏ నేతలు కొత్త పేర్లతో దేశ వ్యతిరేక వేదికలను ఏర్పాటు చేస్తున్నారు. పూణే, - మిగతా3లో

# సంపాదకీయం

## విభజన చట్టం ప్రకారం
## సీట్లు పెంచాల్సిందే!

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించే డీలిమిటేషన్ చట్టం అమల్లోకి వస్తే కేవలం లోక్‌సభ స్థానాలే పెరుగుతాయా లేక రాష్ట్రాల శాసనసభ సీట్లు కూడా పెరుగుతాయా? అనేది ఇప్పుడు తెలుగు రాష్ట్రాల పొలిటికల్ సర్కిళ్లలో అత్యంత ఆసక్తికరమైన ప్రశ్నగా మారింది. డీలిమిటేషన్ అనేది నియోజకవర్గాల పునర్విభజన. జనాభా మార్పులకు అనుగుణంగా అసెంబ్లీ, లోక్‌సభ సీట్ల సంఖ్య, సరిహద్దులను మార్చడం. దీని ద్వారా అన్ని నియోజకవర్గాల్లో జనాభా దాదాపు సమానంగా ఉంటారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ సీట్లు కూడా జనాభా నిష్పత్తి ప్రకారం సర్దుబాటు చేస్తారు. ప్రస్తుతం ఉన్న నియోజకవర్గాలన్నీ.. 2011 జనాభా లెక్కల ఆధారంగా ఉన్నాయి. కానీ తెలుగు రాష్ట్రాల్లో విభజన సమయంలోనే సీట్ల పెంపు హామీ ఇచ్చారు. డీలిమిటేషన్ అనగానే చాలామంది కేవలం ఎంపీ సీట్ల పెంపు గురించే చర్చిస్తున్నప్పటికీ, రాజ్యాంగ నిబంధనలు , ప్రతిపాదిత 131వ రాజ్యాంగ సవరణల ప్రక్రియ ప్రకారం పార్లమెంట్ సీట్లతో పాటు రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలు కూడా ఖచ్చితంగా పెరుగుతాయి. రాజ్యాంగంలో లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు ప్రత్యేకమైన అధికరణలు ఉండటమే దీనికి ప్రధాన కారణం. భారత రాజ్యాంగం ప్రకారం లోక్‌సభ స్థానాల విభజన ఆర్టికల్ 81, 82ల ప్రకారం జరిగితే.. రాష్ట్ర శాసనసభ స్థానాల పునర్విభజన ఆర్టికల్ 170 పరిధిలోకి వస్తుంది. డీలిమిటేషన్ కోసం కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టినప్పుడు, రాజ్యాంగంలోని ఈ రెండింటికీ వేర్వేరుగా లేదా ఒకే రాజ్యాంగ సవరణ బిల్లు ద్వారా సవరణలు చేయాల్సి ఉంటుంది. ఆర్టికల్ 170 పై ఉన్న నిషేధాన్ని తొలగించకుండా కేవలం ఎంపీ సీట్లను పెంచడం సాధ్యపడదు. కాబట్టి డీలిమిటేషన్ ప్రక్రియ ప్రారంభమైతే లోక్‌సభతో పాటు ప్రతీ రాష్ట్ర శాసనసభ స్థానాల సంఖ్యను కూడా దామాషా పద్ధతిలో పెంచడానికి చట్టపరమైన ప్రాతిపదిక సిద్ధమవుతుంది. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు సంబంధించి ఒక ప్రత్యేకమైన చట్టపరమైన కోణం కూడా ఉంది. 2014లో రూపొందించిన ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం లోని సెక్షన్ 26 ప్రకారం.. విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఉన్న 175 అసెంబ్లీ సీట్లను 225కి, తెలంగాణలో ఉన్న 119 సీట్లను 153కి పెంచాలని స్పష్టంగా పేర్కొన్నారు. అయితే, రాజ్యాంగంలోని ఆర్టికల్ 170 ప్రకారం 2026 తర్వాత జరిగే తొలి జనాభా లెక్కల వరకూ సీట్ల పెంపుపై ఫ్రీజ్ ఉన్నందున, ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని ఆ నిబంధన అమలుకు నోచుకోలేదు. ఇప్పుడు డీలిమిటేషన్ బిల్లు ద్వారా ఆర్టికల్ 170 సవరణ జరిగి నియోజకవర్గాల సరిహద్దుల ఫ్రీజ్ తొలగిపోతే.. తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్ల పెంపుకు ఉన్న ఏకైక రాజ్యాంగ అడ్డంకి పూర్తిగా తొలగిపోతుంది. మరి ఏపీ, తెలంగాణల్లో సీట్లు పెరుగుతాయనడానికి ఖచ్చితమైన గ్యారంటీ ఉందా అంటే.. సమాధానం నూటికి నూరు శాతం గ్యారంటీ అనే చెప్పాలి. ఎందుకంటే, కేంద్రం ప్రతిపాదిస్తున్న సార్వత్రిక డీలిమిటేషన్ నమూనా 50 శాతం స్థానాల పెంపు ప్రాతిపదిక ప్రకారం లేదా ఏపీ విభజన చట్టం సెక్షన్ 26 ప్రకారం చూసినా సీట్ల సంఖ్య పెరగడం ఖాయం. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం.. డీలిమిటేషన్ అమల్లోకి వస్తే ఏపీలో ప్రస్తుతం ఉన్న 25 లోక్‌సభ స్థానాలు 38కి, తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాలు 26కి పెరుగుతాయి. లోక్‌సభ స్థానాలు పెరిగినప్పుడు, దానికి అనుగుణంగా ప్రతీ పార్లమెంట్ నియోజకవర్గంలో అసెంబ్లీ స్థానాల విస్తరణ జరగడం తప్పనిసరి. ప్రస్తుతం ఒక పార్లమెంట్ స్థానం పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తయ్యాక ఏపీ అసెంబ్లీ స్థానాల సంఖ్య 175 నుంచి కనీసం 225 లేదా అంతకంటే ఎక్కువకి , తెలంగాణ అసెంబ్లీ స్థానాల సంఖ్య 119 నుంచి 153 లేదా 160కి పైగా పెరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు కావడం, అది ప్రకటన విడుదల చేయడం ద్వారా మాత్రమే కొత్త నియోజకవర్గాల సరిహద్దులు, ఎస్సీ/ఎస్టీ రిజర్వుడు స్థానాల వర్గీకరణ ఖరారవుతాయి. దీనికోసం ప్రత్యేకంగా రాష్ట్ర అసెంబ్లీలు మళ్లీ తీర్మానాలు చేయాల్సిన అవసరం లేదు. కేంద్ర పార్లమెంట్ ఆమోదించే డీలిమిటేషన్ చట్టమే రాష్ట్ర స్థానాల పెంపునకు నేరుగా వర్తిస్తుంది. ఈ సీట్ల పెంపు ప్రక్రియ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో తీవ్రమైన రాజకీయ సంచలనాలకు, సమీకరణలకు దారితీయనుంది. ప్రతి నియోజకవర్గంలో ద్వితీయ శ్రేణి నాయకులకు, యువ నాయకులకు కొత్తగా ఎమ్మెల్యేగా పోటీ చేసే సువర్ణావకాశం లభిస్తుంది. అంతేకాకుండా, గ్రేటర్ హైదరాబాద్ వంటి పట్టణ ప్రాంతాల్లోనూ, అమరావతి పరిసర ప్రాంతాల్లోనూ జనాభా ప్రాతిపదికన మరిన్ని కొత్త నియోజకవర్గాలు ఏర్పడే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఏపీలో 175, తెలంగాణలో 119 అసెంబ్లీ సీట్లతోనే ఎన్నికలు జరుగుతాయి. 2028 చివర్లో తెలంగాణ, 2029లో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు పాత నియోజకవర్గాల ప్రాతిపదికనే జరగవచ్చు. ఇది ప్రజలకు కొత్త సమస్యలు తెస్తుంది. జనాభా పెరిగిన ప్రాంతాల్లో ఒక ఎమ్మెల్యేకి ఎక్కువ ఓటర్లు, అసమాన ప్రాతినిధ్యం ఉంటుంది. ఉదాహరణకు హైదరాబాద్, విజయవాడ, విశాఖ పట్టణ ప్రాంతాల్లో జనాభా ఎక్కువ కాబట్టి వారి సమస్యలు సరిగా ప్రతిబింబించకపోవచ్చు. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో సీట్లు తగ్గినట్టు అనిపించవచ్చు. డీలిమిటేషన్ పార్లమెంట్‌కే పరిమితం కాదు, అది రాష్ట్రాల శాసనసభలను కూడా సమాంతరంగా పునర్వ్యవస్థీకరిస్తుంది. రాజ్యాంగ సవరణ బిల్లులు చట్ట రూపం దాల్చిన మరుక్షణమే డీలిమిటేషన్ కమిషన్ రంగంలోకి దిగుతుంది. అందువల్ల ఏపీ , తెలంగాణ అసెంబ్లీలలో స్థానాలు పెరగడం అనేది కేవలం ఒక రాజకీయ అంచనా మాత్రమే కాదు, రాజ్యాంగపరంగా, చట్టపరంగా జరగబోయే ఒక అనివార్యమైన పరిణామం!

## బెంగాల్ లో ఊపిరిపోసుకుంటున్న
# లెఫ్ట్ పార్టీలు...

**కోల్ కత్తా, జూలై 23:**పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఒకప్పుడు తిరుగులేని శక్తిగా వెలిగిన తృణమూల్ కాంగ్రెస్ నేడు తీవ్ర అంతర్గత సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన రాజకీయ వారసుడిగా మేనల్లుడు అభిషేక్ బెనర్జీని నిలబెట్టేందుకు పడుతున్న ఆరాటం, సీనియర్ నేతల్లో తీవ్ర తీవ్ర అసంతృప్తికి దారితీస్తోంది. అధికారం పోవడంతో పార్టీ ముఖ్యనేతలందా గుడ్ బై చెప్పేశారు. ప్రతిపక్ష రాజకీయ శూన్యత స్పష్టంగా కనిపిస్తోంది. ఇది సీపీఎంకు ఓ మంచి అవకాశంగా కనిపిస్తోంది. ఈ రాజకీయ పరిణామం సుదీర్ఘకాలం 34 ఏళు రాష్ట్రాన్ని ఏకఛత్రాధిపత్యంగా ఏలిన మార్క్సిస్ట్ కమ్యూనిస్ట్ పార్టీ CPI–వీ కి, లెఫ్ట్ ఫ్రంట్‌కు చారిత్రాత్మక అవకాశాన్ని తలుపు తడుతోంది. 2011లో మమతా తుఫాన్‌లో అధికారం కోల్పోయిన తర్వాత, సురక్షిత స్థావరం కోసం సీపీఎం కేడర్ పెద్ద ఎత్తున బిజెపి, టిఎంసి వైపు వలస వెళ్లారు. అయితే, గ్రామీణ బెంగాల్‌లో సీపీఎం నిశ్శబ్ద మూలాలు, సైద్ధాంతిక బలగాలు నేటికీ చెక్కుచెదరలేదు. తమ ఉనికిని కాపాడుకోవడానికి తాత్కాలికంగా ఇతర జెండాలు పట్టిన శ్రేణులు, ఇప్పుడు బీజేపీ అధికారంలోకి రావడం, మమతా పార్టీ నిర్వీర్యం అవుతున్న సూచనలు కనిపిస్తూండటోంత మళ్లీ ఎర్రజెండా వైపు చూస్తున్న సూచనలు కనిపిస్తున్నాయి.



ప్రస్తుతం పశ్చిమ బెంగాల్ లెఫ్ట్ నేతలు పాత పద్ధతులను విడనాడి, కొత్త వ్యూహాలతో శ్రేణులను జాగృతం చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. మీనాక్షి ముఖర్జీ వంటి అత్యంత ప్రజాదరణ పొందిన యువనాయకులను ముందుంచి, కార్మికులు–రైతులు–యువత అజెండాతో బెంగాల్‌ను కాపాడుకుందాం పేరిట విస్తృత పాదయాత్రలు, ర్యాలీలు నిర్వహిస్తున్నారు. మత–కులాతీత రాజకీయాల ప్రాముఖ్యతను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. ముఖ్యంగా యువతను ఆకట్టుకోవడానికి డిజిటల్ మీడియా, సోషల్ మీడియా వేదికల ద్వారా సీపీఎం విస్తృత ప్రచారం నిర్వహిస్తోందిఅయితే, సైద్ధాంతికంగా సానుకూల వాతావరణం ఉన్నప్పటికీ, ఆచరణలో సీపీఎం ముందు కొండంత సవాళ్లు నిలిచాయి. దశాబ్దకాలంగా అమానుష దాడులకు గురై దెబ్బతిన్న గ్రామస్థాయి కార్యకర్తలకు మాస్ ప్రొటెక్షన్ కల్పించడంలో పార్టీ అగ్రనాయకత్వం ఇంకా సంపూర్ణ విశ్వాసాన్ని నింపలేకపోతోంది. పైగా, కాంగ్రెస్ పార్టీతో చేసుకుంటున్న తాత్కాలిక పొత్తులు క్షేత్రస్థాయిలో ఓటర్లలో కొంత అయోమయాన్ని సృష్టిస్తున్నాయి. తమ పూర్వపు ఓటు బ్యాంకును ఆకర్షించడంలో లెఫ్ట్ ఫ్రంట్ వేస్తున్న అడుగులు ఆశాజనకంగా ఉన్నప్పటికీ ఇంకా చాలా పోరాటం చేయాల్సిఉంది. తృణమూల్ ఎంత బలహీనపడితే సీపీఎంకు అంత మేలు జరుగుతుంది. పశ్చిమ బెంగాల్‌లో స్థానిక సమస్యలపై పోరాడే అసలైన ప్రతిపక్షంగా అవతరించే అర్హత, సైద్ధాంతిక పునాది సీపీఎంకి మాత్రమే ఉన్నాయి. బీజేపీ వైపు వెళ్లిన తమ పాత ఓటర్లను ఇంటికి రప్పించడంలోనూ, యువతలో ఉపాధి రాజకీయాల పట్ల నమ్మకం కలిగించడంలోనూ సీపీఎం నేతలు ఎంతవరకు సఫలమవుతారో అనే దానిపైనే బెంగాల్‌లో ఎర్ర సూర్యుడి పునరాగమనం ఆధారపడి ఉంటుంది.

# హ్యాట్రిక్ కోసం యోగీ వ్యూహాలు

**లక్నో జూలై 23:**ఉత్తరప్రదేశ్‌లో అధికారం చేజిక్కించుకోవడం దేశవ్యాప్తంగా పాలనా అధికారం కోసం పోటీపడే ఏ పార్టీకైనా అత్యంత కీలకమైన మెట్టు. ఈ రాష్ట్రం 80 లోక్‌సభ స్థానాలతో దేశంలోనే అత్యధిక ప్రాతినిధ్యం కలిగి ఉంది. పశ్చిమ భారతదేశం మొత్తం కలిపినా ఇంతకంటే తక్కువ స్థానాలు ఉంటాయి. తూర్పు భారతదేశం సీట్ల సంఖ్యతో యూపీ సమానంగా నిలుస్తుంది. ఈ నేపథ్యంలో 2027 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మూడోసారి అధికారం నిలబెట్టుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. యోగి ఆదిత్యనాథ్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేయాలనే ప్రయత్నంలో పార్టీ ఇప్పటి నుంచే గ్రాస్‌రూట్స్ స్థాయిలో వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది. 2019లో బీజేపీ యూపీలో 62 సీట్లు గెలవగా, 2024లో కేవలం 33 సీట్లకు పరిమితమైంది. ఈ భారీ పతనం పార్టీని ఆత్మపరిశీలనకు దారితీసింది. 400 సీట్ల టార్గెట్‌ను చేరుకోలేకపోవడం వెనుక యూపీలోని నష్టాలు ప్రధాన కారణం. ఇకపై కులం, మతం ఆధారంగా కాకుండా పనితీరు, పాలనా ఫలితాల ఆధారంగా ఓటర్లను ఆకర్షించాలని బీజేపీ నిర్ణయించింది. ఈ మార్పు యోగి ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, అభివద్ధి పనులు, చట్టవ్యవస్థ బలోపేతం వంటి అంశాలను ప్రజల ముందు పెట్టడం ద్వారా విశ్వాసం పెంచే దిశగా ఉంది. బీజేపీ 18 జిల్లాల్లోని 64 అసెంబ్లీ స్థానాలను 'స్వింగ్ సీట్లు'గా గుర్తించి, వాటిపై ప్రత్యేక వ్యూహం రూపొందించింది. ఇక్కడ 2014, 2019, 2024 ఎన్నికల్లో ఓట్ల శాతం, ఇతర పార్టీల పనితీరు వివరంగా విశ్లేషించబడుతోంది. ఈ సీట్లలో బీజేపీ 10 వేల ఓట్లలోపు మెజారిటీతో ఓడిపోయినట్లు గుర్తించింది. ఇవి త్వరగా తిరిగి సాధించగల స్థానాలుగా భావిస్తోంది. పార్టీ అధ్యక్షుడు పంకజ్ చౌదరి, సంఘటన మంత్రి ధరమ్‌పాల్ సింగ్ ఈ 64 సీట్లను నేరుగా పర్యవేక్షిస్తున్నారు. క్లస్టర్ ఇన్‌చార్జ్‌లను నియమించి, వారిని ఎన్నికల వరకు అక్కడే ఉంచి క్షేత్రస్థాయి పని చేయించే ప్రణాళిక సిద్ధం చేసింది. ఇది వనరులను సమర్థవంతంగా వినియోగించి, లక్ష్య సాధనకు సహాయపడే విధానం. హరియాణా, ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ అమలు చేసిన వ్యూహాల నుంచి యూపీకి పాఠాలు నేర్చుకుంది. బెంగాల్‌లో మమతా బెనర్జీ పాలనలో కూడా బీజేపీ 14 దళాలతో సంస్థాగతంగా బలపడింది. 44 ముస్లిం మెజారిటీ నియోజకవర్గాల్లోనూ, మిగతా ప్రాంతాల్లోనూ చిన్న చిన్న సమావేశాలు నిర్వహించి, వాలంటీర్లను నియమించి గ్రాస్‌రూట్స్ స్థాయిలో పని చేసింది. ఇదే తరహా విధానాన్ని యూపీలో కూడా అమలు చేస్తోంది. ఇప్పటికే యూపీలో 15 వేల గ్రూపులు ఏర్పాటు చేసి, ఒక్కో గ్రూపు రోజుకు 30 సమావేశాలు నిర్వహించేలా ప్రణాళిక వేసింది. ఎన్నికల నాటికి ఐదు లక్షల సమావేశాలు జరిపి, ప్రజాభిప్రాయాన్ని తన వైపుకు మళ్లించాలని లక్ష్యం. ఈ సమావేశాల ద్వారా పార్టీ పాలనా ఫలితాలు, యోగి ప్రభుత్వం చేసిన పనులు నేరుగా ఓటర్లకు చేరవేయడం, అనుమానాలు నివృత్తి చేయడం సాధ్యమవుతుంది. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే 40 లక్షల కుటుంబాలను వ్యక్తిగతంగా కలిసి, వారి సమస్యలు విని, పార్టీ, ఎమ్మెల్యేలపై ఉన్న అసంతృప్తిని తొలగించే ప్రయత్నం జరుగుతోంది. ఇది కేవలం ప్రచారం కాదు, నిజమైన అభిప్రాయ సేకరణ మరియు సమస్య పరిష్కార విధానం. 64 స్వింగ్ సీట్ల పరిధిలోని అసెంబ్లీ స్థానాల్లో ఈ పని మరింత తీవ్రంగా జరగనుంది. ఈ విధానం ద్వారా బీజేపీ 'పాలనా పనితీరు'ను ప్రధాన అంశంగా




ముందుకు తెచ్చి, సాంప్రదాయకంగా జరిగే ఓటు బ్యాంకు రాజకీయాలను అధిగమించాలని చూస్తోంది. బీజేపీ వ్యూహం రెండు ముఖ్యమైన అంశాలపై ఆధారపడి ఉంది. ఒకటి -- లక్ష్య సాధన. 64 స్వింగ్ సీట్లపై దృష్టి పెట్టడం వల్ల వనరులు వృథా కాకుండా, ఫలితాలు త్వరగా రావచ్చు. రెండు -- గ్రాస్‌రూట్స్ సంస్థాగతీకరణ. ఇతర రాష్ట్రాల్లో విజయవంతమైన మోడల్‌ను అనుసరించడం వల్ల అనుభవం ఉంది. అయితే సవాళ్లు కూడా ఉన్నాయి. సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్‌లు బీజేపీని ఆపడానికి కలిసి పని చేయవచ్చు. యోగి ప్రభుత్వం చేసిన పనులను ఓటర్లు ఎంతవరకు గుర్తిస్తారు, స్థానిక అసంతృప్తులు ఎంతవరకు తొలగుతాయి అనేది నిజమైన పరీక్ష. మొత్తంమీద బీజేపీ ఇప్పటి నుంచే సమగ్రమైన, క్షేత్రస్థాయి కేంద్రిత వ్యూహంతో ముందుకు సాగుతోంది. 2027లో యోగి ఆదిత్యనాథ్ మూడోసారి సీఎంగా రావాలంటే ఈ స్వింగ్ సీట్లు, గ్రాస్‌రూట్స్ కార్యక్రమాలు నిర్ణయాత్మకంగా మారే అవకాశం ఉంది.

# ఆందోళనలతో ఢిల్లీ...

**న్యూఢిల్లీ, జూలై 23:**ఢిల్లీ నగరం ఆందోళనలతో అట్టుడికి పోతుంది. గతంలో కేంద్రం వ్యవసాయ చట్టాలను తీసుకువచ్చింది. అప్పుడు హర్యానా, పంజాబ్ రాష్ట్రాలకు సంబంధించిన కొంతమంది రైతులు అందులో పాల్గొన్నారు. ఇదే అదునుగా ఖలీస్థానీ వేర్పాటు వాదులు అందులోకి ప్రవేశించారు. సరిగ్గా గణతంత్ర దినోత్సవం జరిగిన తర్వాత ఎర్రకోట మీద ఖలీస్థానీ జెండా ఎగరవేశా. దీంతో ఈ రైతు ఉద్యమం వెనుక ఉన్న అజెండా ఏమిటో అందరికీ అర్థమైంది. ఇదే సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వెంటనే ఆ చట్టాలను ఉపసంహరించుకున్నట్టు ప్రకటించారు. తద్వారా యూపీ ఎన్నికల్లో విపక్ష పార్టీలు ఊహించని విధంగా స్కెచ్ వేశారు. దీంతో ఆ ఎన్నికల్లో బిజెపి విజయం సాధించింది. మనదేశంలో ఉద్యమాల వెనుక ఉన్న శక్తులు ఎలాంటి కుట్రలకు పాల్పడుతున్నాయో నాడు ఈ సంఘటన బయటకు తెలిసేలా చేసింది. ఇప్పుడు ఢిల్లీలో కొంతమంది ఉద్యమాలు చేస్తున్నారు. నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. నీటి పేపర్ లీకేజీ.. విద్యార్థుల ఆత్మహత్యలు వంటిఘటనలను ప్రధానంగా ప్రస్తావిస్తూ ఇటీవల సోనం వాంగ్ చుక్ నిరధిక నిరాహార దీక్షకు దిగారు. ఆ తర్వాత ఆయన దీక్షను ప్రభుత్వం



విరమింపజేసింది. ఆయన ఢిల్లీలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సరిగా నిన్న ఢిల్లీలో విద్యార్థులు నిరసనలు చేపట్టారు. చలో పార్లమెంట్ నినాదంతో ఢిల్లీ నగరంలో హడావిడి చేశారు. పోలీసులు తమ లాఠీలకు పని చెప్పడంతో అక్కడ హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఢిల్లీలో కిసాన్ ఘాట్ వద్ద రైతులు నిరసన తెలపడం మొదలుపెట్టారు. వేల సంఖ్యలో ఢిల్లీకి చేరుకున్నారు. భారత్ -- అమెరికా వాణిజప్పంలో భాగంగా తక్కువ ధరకు.. రాయితీతో కూడిన అమెరికా వ్యవసాయ ఉత్పత్తులకు భారత మార్కెట్లను తెరవడాన్ని రైతులు వ్యతిరేకిస్తున్నారు. అందువల్లే శంభు బార్డర్ (పంజాబ్, హర్యానా సరిహద్దు) వద్దకు రైతులు భారీగా చేరుకున్నారు. అయితే పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేసి రైతులను అడ్డుకున్నారు. అటు బొద్దింకలు.. ఇటు రైతులు ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో మరోసారి బిజెపికి విపత్కర పరిస్థితి తప్పదా అంటూ విశ్లేషకులు వ్యాఖ్యలు చేస్తున్నారు. గతంలో కూడా రైతుల ఉద్యమం ముసుగులో చాలామంది ఢిల్లీలో తిష్ట వేసుకున్నారు. హింసాత్మక ఘటనలకు పాల్పడేందుకు ప్రణాళిక రూపొందించారు. అయితే పోలీసులు సమర్థవంతంగా అడ్డుకోవడంతో వారి పాచికలు పారలేదు. ఇప్పుడు మళ్లీ నీట్.. అమెరికా ఒప్పందం వంటి వాటిని ప్రధానంగా ప్రస్తావిస్తూ ఉద్యమాలు చేస్తున్నారు. అయితే దీని వెనక కూడా విదేశీ శక్తులు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. అందువల్లే ఈ ఉద్యమాలను ఉక్కుపాదంతో తొక్కి వేస్తున్నాయి.

## రామవరం మాతా-శిశు ఆరోగ్య కేంద్రాన్నితనిఖీ చేసిన కలెక్టర్

**భద్రాచలం:**మాతా–శిశు ఆరోగ్య సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా గర్భిణీలు, బాలింతలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ వైద్య అధికారులను ఆదేశించారు. రామవరం మాతా–శిశు ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేసి ఆసుపత్రి ఆవరణ, ఓపీ విభాగం, ప్రసూతి వార్డులు, లేబర్ రూమ్, శిశు వార్డు, ఔషధ నిల్వ గది తదితర విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలు, రోగులకు అందుతున్న చికిత్సపై వైద్యులతో సమీక్షించారు. చికిత్స పొందుతున్న గర్భిణీలు, బాలింతల ఆరోగ్య పరిస్థితి, వైద్య పరీక్షలు, మందుల పంపిణీ, పోషకాహార సదుపాయాలు, ప్రసవాల సంఖ్యపై వివరాలు తెలుసుకున్న జిల్లా కలెక్టర్, ప్రభుత్వం అందిస్తున్న అన్ని సేవలు లబ్ధిదారులకు సకాలంలో చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తరువాత రోగుల నమోదు వివరాలు, ప్రసవాల రికార్డులు, ఔషధ నిల్వలు, విధి నిర్వహణ రిజిస్టర్లు, సిబ్బంది హాజరు నమోదును క్షుణ్ణంగా పరిశీలించి, ప్రతి ఉద్యోగి



సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగిని ఆప్యాయంగా పలకరించి, అవసరమైన వైద్య సేవలను ఎలాంటి ఆలస్యం లేకుండా అందించాలని, గర్భిణీలు, బాలింతలు, నవజాత శిశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా వైద్య సేవలు అందుబాటులో ఉండాలని వైద్యులు, నర్సింగ్ సిబ్బందికి సూచించారు.

వార్తాతరంగాలు

శుక్రవారం 24 జూలై 2026

# నాలుగు రాష్ట్రాల్లో ఐదు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు

## నీట్ పేపర్ లీకేజీలో కేంద్రం దిద్దుబాటు చర్యలు....

**న్యూఢిల్లీ, జూలై 23:** నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో విద్యార్థులను శాంతిపజేసేందుకు కేంద్రం దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. ఉదయం ప్రధాని మోదీ చెప్పినట్టుగానే నాలుగు రాష్ట్రాల్లో ఐదు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నట్టు ఆదేశాలు జారీ చేసింది. బాంబే హైకోర్టు బెంచ్ పరిధిలో రెండు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు పని చేయనున్నాయి. ప్రతి రోజూ విచారణ జరిపి త్వరితగతిన తీర్పు వచ్చేలా ఈ కోర్టులను ఏర్పాటు చేస్తున్నట్టు కేంద్రం ప్రకటించింది. నీట్ పేపర్ లీకేజీపై దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలపై ప్రధానమంత్రి మోదీ స్పందించాల్సి వచ్చింది. సోషల్ మీడియా వేదికగా కీలక ప్రకటన చేశారు. తమకు యువత సంక్షేమం, భవిష్యత్తే ముఖ్యమని వెల్లడించారు. వారి శ్రేయస్సు,భవిష్యత్ కంటే ఏదీ ముఖ్యం కాదని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ప్రధానమంత్రి మోదీ గురువారం (జూలై 23) సోషల్ మీడియా వేదిక అయిన ఎక్స్‌లో ఈ పోస్టు పెట్టారు. అందులో ఇలా రాసుకొచ్చారు "పరీక్ష పేపర్ లీక్‌లో భాగమైన వారికి త్వరోలనే కఠినమైన శిక్ష పడేలా పడుతుంది. దీని కోసం ఒక ఫాస్ట్-ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నాం" అని తెలిపారు. ఈ విషయంలో అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు మోదీ పేర్కొన్నారు. పేపర్ లీక్‌కు బాధ్యులైన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. విద్యార్థుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు తీసుకుంటున్న చర్యల్లో ఇది కూడా భాగమని పేర్కొన్నారు. యువత భవిష్యత్తుకు హాని తలపెట్టే వారిని ఎవరినీ వదిలిపెట్టబోమని ప్రధాని మోదీ హెచ్చరించారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారం సైలెంట్ అయినట్టే ఒక్కసారిగా తీవ్ర రూపం దాల్చింది. పార్లమెంట్ సమావేశాల టైంలో దీని తీవ్ర ప్రభుత్వానికి తెలిసింది. ఇది జరిగి నెలలు గడిచింది. అప్పటి నుంచి కాక్రోజ్ జనతా పార్టీ లాంటి వాళ్లు నిరసనలు చేస్తూన్న, వాంగ్‌చుక్ దీక్ష చేసినా ప్రభుత్వం పెద్దగా పట్టించుకోలేదు. అయితే అసలైన ఒత్తిడి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైన రోజు నుంచే మొదలైంది. ఓవైపు సభలో ప్రతిపక్షాలు కార్యకలాపాలను అడ్డుకుంటున్నారు. జంతర్ మంతర్ వేదికగా నిరసనలు కంటిన్యూ అవుతున్నాయి. రోజు రోజుకు అక్కడ విద్యార్థి సంఘాల రాక ఎక్కువైంది. మరోవైపు కాంగ్రెస్ నాయకులు ప్రధాని నివాసాన్ని ముట్టడించారు. జులై 20న కూడా పార్లమెంట్ ముట్టడి గందరగోళానికి దారి తీసింది. విద్యార్థులపై పోలీసులు దమనకాండకు దిగారు. విద్యార్థులకు గాయాలు అయ్యారు. అటు పోలీసులు కూడా గాయపడ్డారు. దీంతో దేశవ్యాప్తంగా ఆందోళలను మిన్నంటాయి. అన్నివైపు నుంచి తీవ్రంగా ఒత్తిడి రావడం ఇప్పుడు ప్రధాని స్పందించాల్సి వచ్చింది. ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ భేటీలో కూడా ఇదే అంశంపై మోదీ స్పందించారు. పేపర్ లీక్ అనేది చాలా ఘోరమైన పాపమని అన్నారు. ఇలాంటివి భవిష్యత్‌లో జరగకూడదని అన్నారు. దీనికి కేంద్రంతోపాటు రాష్ట్రాలు బాధ్యత తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. ఫాస్ట్-ట్రాక్ కోర్టు ఏర్పాటు చేస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన ప్రకటనపై కాక్రోచ్ జనతా పార్టీ తీవ్రంగా స్పందించింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. అంటే ప్రధాని మోదీ ప్రకటనతో నిరసనకారులు సంతృప్తి చెందలేదనేది అర్థమవుతోంది. కేంద్రమంత్రి రాజీనామా చేసే వరకు నిరసనకారులు జంతర్ మంతర్‌ను విడిచిపెట్టే పరిస్థితి కనిపించడం లేదు.

# హైదరాబాద్‌లో మరో ఫ్లైఓవర్..

## రూ.345 కోట్లతో 6 లేన్లు.. మరింత వేగంగా ఎయిర్‌పోర్టుకు ప్రయాణం

**హైదరాబాద్, జూలై 23:** హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు జీహెచ్‌ఎంసీ మరో ఫ్లైఓవర్ నిర్మించేందుకు రెడీ అయింది. రూ.345 కోట్లతో మైలార్‌దేవ్‌పల్లి నుంచి కాటేదాన్, శంషాబాద్ రోడ్ వరకు 6 లేన్ల ఫ్లైఓవర్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే పాతబస్తీ, ఎల్‌బీ నగర్, కంచన్‌బాగ్, హయత్‌నగర్ ప్రాంతాల నుంచి ఎయిర్‌పోర్టుకు మరింత వేగంగా ప్రయాణం సాగనుంది. ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు ప్రయాణ సమయం, ఇంధన వ్యయం కూడా ఆదా కానుంది. ఈ ప్రాజెక్టు భూసేకరణ ప్రక్రియను జీహెచ్‌ఎంసీ వేగవంతం చేస్తోంది. హైదరాబాద్‌లో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) మరో కీలక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. పాతబస్తీ నుంచి శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు వెళ్లే వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గించే లక్ష్యంతో కీలక ప్రాంతంలో ఫ్లైఓవర్ నిర్మించేందుకు సిద్ధమైంది. మైలార్‌దేవ్‌పల్లి నుంచి కాటేదాన్, శంషాబాద్ రోడ్ వరకు ఆరు లేన్ల గ్రేడ్ సెపరేటర్ ఫ్లైఓవర్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించింది.



సుమారు రూ.345 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ ఫ్లైఓవర్‌కు పరిపాలనా అనుమతులు వచ్చిన వెంటనే టెండర్ల ప్రక్రియ ప్రారంభించి పనులు చేపట్టేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు సిద్ధంగా ఉన్నారు. అధికారిక ఆమోదం కోసం ఎదురుచూస్తూనే ప్రాజెక్టు ఆలస్యం కాకుండా అవసరమైన ముందస్తు ఏర్పాట్లు కూడా వేగంగా కొనసాగుతున్నాయి. ఈ ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయితే మైలార్‌దేవ్‌పల్లి, కాటేదాన్, శంషాబాద్ రోడ్ ప్రాంతాల్లో నిత్యం ట్రాఫిక్ రద్దీతో నరకం అనుభవించే వాహనదారులకు భారీ ఉపశమనం లభించనుంది.ముఖ్యంగా పాతబస్తీ, కంచన్‌బాగ్, ఎల్‌బీనగర్, హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం వంటి ప్రాంతాల నుంచి ఎయిర్‌పోర్టుకు వెళ్లే ప్రయాణికులు ట్రాఫిక్ జామ్‌లలో చిక్కుకోకుండా వేగంగా గమ్యస్థానానికి చేరుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఓవైసీ ఫ్లైఓవర్, చాంద్రాయణగుట్ట ఫ్లైఓవర్ దాటిన తర్వాత మైలార్‌దేవ్‌పల్లి జంక్షన్ వద్ద భారీ ట్రాఫిక్ కారణంగా ఆ మార్గంలో ఎయిర్‌పోర్టుకు వేళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్త ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే ఈ సమస్యకు పరిష్కారం లభించడంతో పాటు ప్రయాణ సమయం, ఇంధన వ్యయం కూడా గణనీయంగా తగ్గే అవకాశం ఉంది.ఈ ప్రాజెక్టు అమలులో భాగంగా అవసరమైన భూసేకరణ ప్రక్రియపై కూడా జీహెచ్‌ఎంసీ ప్రత్యేక దృష్టి పెట్టింది. భూమి యజమానులకు ట్రాన్స్‌ఫర్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) ఇవ్వడం లేదా అవసరమైతే నష్టపరిహారం చెల్లించడం ద్వారా భూసేకరణను వేగవంతం చేయాలని అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే నగర దక్షిణ భాగంలో ట్రాఫిక్ నిర్వహణ మరింత మెరుగుపడి.. ఎయిర్‌పోర్టు కనెక్టివిటీకి కొత్త ఊపు రానుంది.

# సెలవు పెట్టిందని ఉద్యోగం తసేశారు

**హైదరాబాద్, జూలై 23:** మేడ్చల్ జిల్లా దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బహదూర్ పల్లిలో ఉన్న టెక్ మహీంద్రా ఐటీ కార్యాలయం ఎదుట గురువారం ఉదయం ఓ ఉద్యోగిని ధర్నాకు దిగారు. భావన అనే మహిళా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, యాజమాన్యం తనను అకారణంగా ఉద్యోగం నుంచి తొలగించిందంటూ కంపెనీ ప్రధాన ద్వారం వద్ద ధర్నాకు దిగారు. తీవ్రమైన ఒత్తిడి, వేధింపులకు గురిచేస్తూ ఇష్టారీతిన ఐటీ ఉద్యోగులను తొలగిస్తున్నారంటూ ఆమె చేపట్టిన ఈ నిరసన, ఐటీ వర్గాల్లోనూ, ఐటీ కారిడార్ పరిసరాల్లోనూ పెద్ద ఎత్తున చర్చనీయాంశంగా మారింది.బాధితురాలు భావన తెలిపిన వివరాల ప్రకారం, తన కుమార్తె తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆమె ఐటీ కంపెనీ నిబంధనల ప్రకారమే మూడు రోజుల పాటు సెలవు కావాలని యాజమాన్యానికి ముందస్తుగా సమాచారం ఇచ్చి అనుమతి కోరినట్లు వెల్లడించారు. చిన్నారి ఆరోగ్యం బాగోలేదనే కనీస మానవతా కోణాన్ని కూడా పరిగణనలోకి తీసుకోని మేనేజ్‌మెంట్, సెలవు మంజూరు చేయకపోగా ఆమెపై ఉద్దేశపూర్వకంగా వేధింపులకు దిగిందని ఆరోపించారు. ఆ తర్వాత ఏకపక్షంగా ఆమెను విధుల్లోంచి తొలగిస్తున్నట్లు ఈ-మెయిల్ ద్వారా సమాచారం పంపి షాక్‌కు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశార.కంపెనీలో ఉద్యోగులపై యాజమాన్యం తీవ్రమైన మానసిక ఒత్తిడిని తెస్తోందని, నిబంధనల పేరుతో కనీస ప్రాథమిక హక్కులను కూడా కాలరాస్తోందని భావన సంచలన ఆరోపణలు చేశారు. పనివేళల్లో వాష్‌రూమ్‌కు వెళ్లాలన్నా ముందస్తు అనుమతి తీసుకోవాల్సిన అత్యంత దారుణమైన వాతావరణం అక్కడ నెలకొందని ఆరోపించారు. వ్యక్తిగత అనారోగ్య సమస్యలు , టుంబ అత్యవసర పరిస్థితులు ఉన్నప్పటికీ బలవంతంగా విధులకు హాజరు కావాలని ఒత్తిడి తెచ్చారని, సిక్ లీవ్‌లకు వేతనం చెల్లించకపోయినా సరే పనికి రావాలని ఈ-మెయిల్స్ ద్వారా వేధించారని ఆమె వాపోయారు. కంపెనీ యాజమాన్యం అనుసరిస్తున్న ఈ అన్యాయమైన వైఖరిపై బాధితురాలు భావన ఇప్పటికే స్థానిక దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా ఫిర్యాదు చేశారు. తనను అకారణంగా తొలగిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని టెక్ మహీంద్రా యాజమాన్యం తక్షణమే ఉపసంహరించుకోవాలని, తనకు పూర్తి న్యాయం జరిగే వరకు న్యాయపోరాటంతో పాటు నిరసనను కొనసాగిస్తానని ఆమె స్పష్టం చేశారు. మాతృత్వపు హక్కులను, ఉద్యోగుల ఆరోగ్య హక్కులను కాలరాస్తున్న సంస్థ తీరుపై ఐటీ ఉద్యోగ సంఘాలు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. టెక్ మహీంద్రా కార్యాలయం ఎదుట మహిళా ఉద్యోగి ధర్నా చేపట్టడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బాధితురాలి నుంచి వివరాలు సేకరించిన పోలీసులు, చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మరోవైపు ఈ వేధింపుల ఆరోపణలు, ఉద్యోగి తొలగింపు వ్యవహారంపై టెక్ మహీంద్రా కంపెనీ యాజమాన్యం నుంచి అధికారిక వివరణ రావాల్సి ఉంది. ఐటీ రంగంలో పెరుగుతున్న జాబ్ సెక్యూరిటీ సమస్యలు, ఒత్తిడి వాతావరణానికి ఈ ఘటన మళ్లీ అద్దం పట్టింది.

# రేవంత్ లీగల్ నోటీసులు...

- మొదటి పేజీ తరువాయి

నిరసిస్తూ శుక్రవారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్వీ నిరసన చేపట్టనుంది. దీంట్లో తాను స్వయంగా పాల్గొంటానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును అణచివేయలేరని అన్నారు.ఈ మేరకు గురువారం ఎక్స్‌లో పోస్టు చేసిన కేటీఆర్.. ఉదయం 10 గంటలకు ఇందిరాపార్క్‌లో జరిగే బీఆర్ఎస్వీ ఆందోళనలో పాల్గొంటానని తెలిపారు. ఢిల్లీలో విద్యార్థులు, యువతపై జరిగిన పోలీసు చర్యలకు నిరసనగా ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నానని పేర్కొన్నారు.దేశ యువత గొంతును బలవంతంగా అణచివేయడం సాధ్యం కాదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే విద్యార్థులు, యువతతో పాటు ప్రతి ఒక్కరూ ఈ నిరసనలో పాల్గొని మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.నీట్ పేపర్ లీక్, పరీక్షల నిర్వహణలో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల ఐక్యవేదిక శుక్రవారం తెలంగాణవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే.

**సీసీఐ వైఖరి చెప్పండి**

అదిలాబాద్ సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ప్లాంట్ పునరుద్ధరణపై తెలంగాణ ప్రభుత్వం తన అధికారిక వైఖరిని తక్షణమే స్పష్టం చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి ఆయన బుధవారం ఒక బహిరంగ లేఖ రాశారు. ఆదిలాబాద్ జిల్లా పారిశ్రామిక భవిష్యత్తుకు, వేలాది కుటుంబాల ఉపాధికి కీలకమైన ఈ ప్లాంట్‌ను పునఃప్రారంభించే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధి ప్రదర్శించడం లేదని ఆయన ఆరోపించారు.జులై 15న బీఆర్ఎస్ ప్రతినిధి బృందం, సీసీఐ సాధన సమితి సభ్యులతో కలిసి కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామిని కలిసిన విషయాన్ని కేటీఆర్ తన లేఖలో గుర్తుచేశారు. ప్లాంట్ పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని, అయితే రాష్ట్ర ప్రభుత్వం రూ. 250 కోట్లు కేటాయించి, అవసరమైన ప్రోత్సాహకాలు అందిస్తేనే ఇది సాధ్యమవుతుందని కేంద్ర మంత్రి స్పష్టం చేసినట్లు కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రతిపాదన లేకపోవడమే పునరుద్ధరణకు ప్రధాన అడ్డంకిగా మారిందని ఆయన తెలిపారు.ఎన్నికల సమయంలో ఆదిలాబాద్‌లో సీసీఐని తెరిపిస్తామని హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదని కేటీఆర్ విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి కేసీఆర్ సహా తాను కేంద్రానికి పలుమార్లు లేఖలు రాసినట్లు గుర్తుచేశారు. టీఎస్-ఐపాస్ ద్వారా ప్రోత్సాహకాలు, కేంద్ర-రాష్ట్ర భాగస్వామ్యంతో జాయింట్ వెంచర్ లేదా పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే ప్లాంట్‌ను నడిపేందుకు సిద్ధమని ప్రతిపాదించినట్లు వివరించారు. ఈ నేపథ్యంలో, సీసీఐ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి, తన వైఖరిని ప్రజలకు వెల్లడించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## ప్రధాన్ రాజీనామాను బీఆర్ఎస్ ఎందుకు డిమాండ్ చేయడం లేదు..?

- మొదటి పేజీ తరువాయి

ఇప్పటి వరకు 70 శాతం ఓటర్ల జాబితా సవరణ పూర్తయిందని, ప్రక్షాళన నెపంతో ఓట్లు గల్లంతు కాకుండా ఉండేందుకు బీఎల్ఓలను నియమించినట్లు వివరించారు. ఓట్లు లేకపోతే ప్రజలకు ప్రభుత్వ పథకాలు ఎలా అందుతాయని ఆయన ప్రశ్నించారు. హైడ్రా పనితీరుపై ముఖ్యమంత్రి ప్రశంసలు కురిపించారు. ఈ సంస్థ ఇప్పటికే అనేక అక్రమ ఆస్తులను స్వాధీనం చేసుకుందని వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పూర్తిగా గాలికొదిలేశారని విమర్శించారు. ఆ ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతి కారణంగానే కేసీఆర్ గతంలో హరీశ్ రావును కొంతకాలం మంత్రి పదవికి దూరంగా ఉంచారని ఆరోపించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇంటర్‌మీడియట్ ఫలితాల వెల్లడిలో జరిగిన తప్పిదాల వల్ల 27 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గ్లోబరీనా సంస్థ వ్యవహారంలో కేటీఆర్ తన నిజాయతీని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల మరణాలకు కారణమైన కేటీఆర్, ఇప్పటికైనా బహిరంగ క్షమాపణ చెప్పాలని అన్నారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను బీఆర్ఎస్ ఎందుకు డిమాండ్ చేయడం లేదని ఆయన నిలదీశారు.

## మెట్రో స్టేషన్ల బంద్ పై సుప్రీం సీరియస్

- మొదటి పేజీ తరువాయి

కాకపోతే తానే స్వయంగా జోక్యం చేసుకుంటానని హామీ ఇచ్చారు.కాక్రోచ్ జనతా పార్టీ' అనే సోషల్ మీడియా వేదిక ఆధ్వర్యంలో జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న ఆందోళనలు తీవ్రరూపం దాల్చడంతో గత కొన్ని రోజులుగా సెంట్రల్ ఢిల్లీలోని పలు మెట్రో స్టేషన్లను అధికారులు మూసివేస్తున్నారు. ఇవాళ కూడా సుప్రీంకోర్టు మెట్రో స్టేషన్‌తో సహా మొత్తం 16 స్టేషన్లలో సేవలను నిలిపివేశారు.ఈ అంశాన్ని సీజేఐ ముందు ప్రస్తావిస్తూ వికాస్ సింగ్ మాట్లాడారు. "సుప్రీంకోర్టు పరిసర ప్రాంతాల్లోని కీలక మెట్రో స్టేషన్లను మూసివేయడంతో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది సమయానికి కోర్టుకు చేరుకోలేకపోతున్నారు. సుప్రీంకోర్టుకు సంబంధించిన సరైన గుర్తింపు కార్డులు ఉన్నవారిని, రిజిస్ట్రీ సిబ్బందిని సుప్రీంకోర్టు మెట్రో స్టేషన్‌లో దిగేందుకు అనుమతించాలి. రైలు దిగిన తర్వాత ఎగ్జిట్ పాయింట్ వద్ద వారిని తనిఖీ చేసి బయటకు పంపవచ్చు" అని వికాస్ సింగ్ సూచించారు.ఈ ఆందోళనపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ, ఈ విషయంపై మెట్రో అధికారులతో మాట్లాడాలని సుప్రీంకోర్టు యంత్రాంగాన్ని ఇప్పటికే ఆదేశించినట్లు తెలిపారు. "ఒకవేళ మధ్యాహ్న భోజన సమయానికి మెట్రో స్టేషన్ తెరవకపోతే, నేనే స్వయంగా జోక్యం చేసుకుంటాను. ఈరోజు న్యాయవాదులు కోర్టుకు హాజరు కాలేకపోయిన కేసుల్లో ఎలాంటి ప్రతికూల ఉత్తర్వులు జారీ చేయవద్దని కూడా ఆదేశించాం" అని సీజేఐ భరోసా ఇచ్చారు. మరోవైపు తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు 16 మెట్రో స్టేషన్లు మూసి ఉంటాయని ఢిల్లీ మెట్రో ప్రకటించడంతో ప్రయాణికుల ఇబ్బందులు కొనసాగుతున్నాయి.

## ఫస్ట్...లాస్ట్... తెలంగాణనే

- మొదటి పేజీ తరువాయి

గణనీయమైన పురోగతిని సాధించి, గతంలో ఉన్న స్థానం నుంచి ఏకంగా 18వ స్థానానికి చేరింది. మొత్తం 1000 పాయింట్లకు గాను 599.7 స్కోరు సాధించి ప్రచేష్ట-3 బ్యాండ్‌లో నిలిచింది. స్కూళ్లకు విద్యార్థుల రాక , అడ్మిషన్ల ప్రక్రియలో సాధించిన ప్రగతి వల్లనే రాష్ట్రం ఓవరాల్ ర్యాంకింగ్‌లో పైకి ఎగబాకినట్లు ఈ నివేదిక స్పష్టం చేస్తోంది.అయితే ర్యాంక్ మెరుగైనప్పటికీ అసలైన చదువుల నాణ్యతలో మాత్రం తెలంగాణ ఘోరంగా విఫలమైంది. విద్యార్థుల సామర్థ్యం, అధ్యయన ఫలితాలు.. అంటే లెర్నింగ్ ఔట్ కమ్ విభాగంలో రాష్ట్రం అత్యంత పేలవ ప్రదర్శన కనబరిచింది. ఈ విభాగానికి కేటాయించిన 240 మార్కులకు గాను తెలంగాణ కేవలం 69 మార్కులు (28.8%) మాత్రమే సాధించి, జాతీయ స్థాయిలో 26వ స్థానంలో నిలిచింది. తరగతి గదిలో బోధన, విద్యార్థుల్లో కనీస అక్షరాస్యత మరియు సంఖ్యా శాస్త్ర సామర్థ్యాలు ఇంకా తీవ్ర ఆందోళనకరంగానే ఉన్నాయని ఈ అంకెలు తేటతెల్లం చేస్తున్నాయి.మరోవైపు పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరత కూడా విద్యాశాఖను వేధిస్తోంది. ఇన్ఫ్రాస్ట్రక్చర్ విభాగంలో కేటాయించిన 190 మార్కులకు 91.9 మార్కులు సాధించి రాష్ట్రం 20వ స్థానంలో నిలిచింది. పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికీ తాగునీరు, సరైన శౌచాలయాలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, లైబ్రరీల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో కేవలం ఓవరాల్ ర్యాంకింగ్‌పై మాత్రమే దృష్టి పెట్టకుండా, నాణ్యమైన విద్యనందించడంతో పాటు టీచర్ల శిక్షణ, మౌలిక వసతుల కల్పనపై విద్యాశాఖ తక్షణమే ప్రత్యేక శ్రద్ధ వహించాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

## తెలంగాణలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు:పొన్నం

- మొదటి పేజీ తరువాయి

వృథా కాకుండా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అధికారులు ఎలాంటి ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా, పారదర్శకంగా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళుతూ నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వరి సాగు తగ్గించి, ప్రత్యామ్నాయ పంటలు వేయాలని రైతులకు సూచన ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది తెలంగాణలో వర్షపాతం గణనీయంగా తగ్గడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. వర్షపాతం, భూగర్భ జలాల లభ్యత, అందుబాటులో ఉన్న సాగునీటి వనరులను నిరంతరం విశ్లేషిస్తూ, పంటల సరళిలో మార్పుల కోసం ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తోంది. ఇందులో భాగంగానే రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు దిశగా ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టింది.ఈ సీజన్‌లో వరి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గే అవకాశం ఉన్నందున, రైతులు ప్రత్యామ్నాయంగా పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాలు, కూరగాయల వంటి తక్కువ నీటితో పండే పంటలను ఎంచుకోవాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి సూచించారు. గతేడాదితో పోలిస్తే రాష్ట్రంలో భూగర్భ జలమట్టం సుమారు ఒక మీటర్ మేర క్షీణించిందని ఆయన తెలిపారు. రైతుల ప్రయోజనార్థం జిల్లా స్థాయి ప్రత్యేక సలహాలను, పంటల యాజమాన్య వ్యూహాలను సిద్ధం చేస్తున్నట్లు వివరించారు.వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం 27 మంది సభ్యులతో ఒక ఉన్నతస్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి అధ్యక్షతన బుధవారం ప్రజా భవన్‌లో ఈ కమిటీ తొలిసారిగా సమావేశమైంది. భారత వాతావరణ విభాగం, ఇక్రిశాట్, ఇకార్-క్రిడా, నాబార్డ్, వ్యవసాయ, ఉద్యానవన విశ్వవిద్యాలయాలతో పాటు పలు ప్రముఖ సంస్థల నిపుణులు ఇందులో సభ్యులుగా ఉన్నారు.ఈ సమావేశంలో వాతావరణ మార్పులను తట్టుకునే వ్యవసాయ విధానాలు, పంటల మార్పిడి, కరవును తట్టుకునే చిరుధాన్యాల సాగు, సమర్థవంతమైన నీటి యాజమాన్యం, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు వంటి కీలక అంశాలపై నిపుణులు సుదీర్ఘంగా చర్చించారు.

## కొత్త పేర్లతో... దేశ వ్యతిరేక వేదికలను ఏర్పాటు

- మొదటి పేజీ తరువాయి

ముంబై, హైదరాబాద్, ఢిల్లీలో జరిగిన కార్యక్రమాల వెనుక విదేశీ శక్తుల హస్తం ఉంది. ఖలిస్తానీ, కతార్, కెనడా, పాకిస్తాన్, బంగ్లాదేశ్ నుంచి ఈ ఉద్యమాలకు మద్దతు అందుతున్నట్లు ఆధారాలు బయటకు వస్తున్నాయి. ఇందిరా గాంధీ హత్యకు కారణమైన ఖలిస్తానీ శక్తులతో రాహుల్ గాంధీ జతకట్టడం సిగ్గుచేటని అన్నారు.నీట్ లీక్ వెలుగులోకి రాగానే మోదీ ప్రభుత్వం వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకుంది. లీక్ కేసులో 31 మందిని అరెస్ట్ చేసి నిందితులపై చర్యలు చేపట్టింది. విద్యార్థులకు అన్యాయం జరగకుండా అవసరమైన చోట రీ-ఎగ్జామ్స్ నిర్వహించింది. పరీక్షల్లో అక్రమాలను అరికట్టేందుకు మోదీ ప్రభుత్వం 2024లో కఠిన చట్టాన్ని తీసుకొచ్చింది.ఎన్ టీ యే లో సంస్కరణల ద్వారా పరీక్షల వ్యవస్థను మరింత బలోపేతం చేసింది.2014కు ముందు యూపీఏ హయాంలోనే అత్యధిక జాతీయ పరీక్షల పేపర్లు లీక్ అయ్యాయి. అప్పట్లో ఒక్క విద్యాశాఖ మంత్రి కూడా నైతిక బాధ్యత తీసుకుని రాజీనామా చేయలేదు. కాంగ్రెస్ ఇప్పుడు రాజీనామాలు డిమాండ్ చేయడం రాజకీయ ద్వంద్వ వైఖరి.

వార్తాతరంగాలు

శుక్రవారం 24 జూలై 2026

# ఖాళీగా కనిపిస్తున్న జలాశయాలు..

**హైదరాబాద్, జూలై 23:**ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు పూర్తయ్యాయి. కానీ, ప్రధాన నదులపై ఉన్న జలాశయాలకు ఇప్పటివరకు నీటి ప్రవాహం రాలేదు. శ్రీశైలం జలాశయానికి కేవలం 5.9 టీఎంసీల నీరు మాత్రమే చేరింది, అది కూడా స్థానిక వర్షాల వల్ల. సాధారణంగా జూన్‌లో నీటి ప్రవాహం తక్కువగా ఉన్నప్పటికీ, జులైలో కనీసం 200 టీఎంసీల వరద వచ్చే అవకాశం ఉంటుంది. కానీ ఈసారి పరిస్థితులు మారాయి. గత 25 సంవత్సరాలలో, ఖరీఫ్‌లో జూన్ మరియు జులైలో శ్రీశైలానికి 10 టీఎంసీల కంటే తక్కువ నీటి ప్రవాహం వచ్చిన సంవత్సరాలు 6 ఉన్నాయి. ఈ ఏడాది కూడా అలాంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయి, ఇది రైతులకు తీవ్ర ఆందోళన కలిగిస్తుంది. కర్ణాటకలోని ఆల్మట్టిలో ప్రస్తుతం 47 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది, కానీ ఆల్మట్టికి నిండటానికి ఇంకా 28 టీఎంసీల నీరు అవసరం నారాయణపూర్‌కు 12 టీఎంసీల నీరు కావాలి. జులైలో ఆల్మట్టిలో పూర్తి స్థాయి నీటి నిల్వ జరగకూడదు. అయితే, ఎల్‌నినో ప్రభావం వల్ల వచ్చిన నీటిని నిల్వ చేస్తున్నారు, దీనిని హైడ్రో ఎలక్ట్రిసిటీ ఉత్పత్తి కోసం మరియు కాలువల కింద సాగుకు ఉపయోగిస్తున్నారు. ఈ నెలలో జూరాలకు నీటిని విడుదల చేయడం కష్టమవుతుంది, ఎందుకంటే ప్రవాహం పెరగకపోతే, నాగార్జునసాగర్ మరియు శ్రీశైలం జలాశయాలపై ప్రభావం ఉంటుంది. గోదావరి నదిలో కూడా పరిస్థితి అంతే. ప్రాణహిత నదిలో కూడా ఈ ఏడాది తక్కువ వరద ఉంది. మేడిగడ్డ వద్ద 16,500 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది, ఇది మంగళవారం 16,620 క్యూసెక్కులుగా ఉంది. రాష్ట్రానికి గోదావరి నదిపై ఎగువన ఉన్న శ్రీరామసాగర్‌కు 2,199 క్యూసెక్కుల నీరు వస్తోంది. కానీ దిగువన ఎల్లంపల్లిలోకి కేవలం 963 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో అసాధారణ వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో, వ్యవసాయ శాఖ అత్యవసర ప్రత్యామ్నాయ పంటల సాగు ప్రణాళికను అమలు చేయడానికి సిద్ధమవుతోంది. జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ ఏడాది జిల్లాలవారీగా సాగుకు అనువైన పంటల గురించి సమాచారాన్ని అందించనుంది.




## మెట్టుగూడలో కాంగ్రెస్ ధర్నా

**హైదరాబాద్:**ఢిల్లీలో విద్యార్థుల పక్షాన పోరాడుతున్న కాంగ్రెస్ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీని బిజెపి ప్రభుత్వం అరెస్టు చేయడాన్నీ ఖండిస్తూ మెట్టుగూడలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర సికింద్రాబాద్ జిల్లా అధికార ప్రతినిధి కే.ఎస్ శిల్పాచారి ఆధ్వర్యంలో ప్లకార్డులు పట్టుకొని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శిల్ప చారి మాట్లాడుతూ పేపర్ లీకులకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే ఆయన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీల వల్ల ఎన్నో కోట్ల మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్య గోచరంగా మారే పరిస్థితి ఏర్పడింది అన్నారు. పేపర్ లీకేజీలు అరికట్టకపోగా విద్యార్థులకు న్యాయం చేయాలని రాహుల్ గాంధీ నిరసనలో పాల్గొంటే పోలీసులు అన్యాయంగా అరెస్టు చేశారని మండిపడ్డారు. బిజెపి పార్టీ అధికారంలోకి వచ్చిన అప్పటినుంచి ఇప్పటివరకు దాదాపు 152 పేపర్ లీకేజీలు అయ్యాయని ధ్వజమెత్తారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు తప్పకుండా బిజెపి పార్టీకి తగిన గుణపాఠం చెప్పి కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇస్తారని అన్నారు.

## తెలంగాణ డీజీపీ కార్యాలయంలో కానిస్టేబుల్ ఆత్మహత్య

తెల్లవారుజామున తుపాకీతో కాల్చుకుని కానిస్టేబుల్ స్వామి ఆత్మహత్య

తన భార్య, పిల్లలు చాలా మంచివాళ్లు అంటూ సూసైడ్ నోట్

కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు

హైదరాబాద్‌లోని తెలంగాణ డీజీపీ కార్యాలయంలో ఈ ఉదయం తీవ్ర విషాదకర సంఘటన చోటుచేసుకుంది. డీజీపీ ఆఫీసులో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న స్వామి అనే కానిస్టేబుల్ తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడటం తీవ్ర కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాత్రి పూట విధుల్లో ఉన్న స్వామి, ఉదయం దాదాపు 5.30 గంటల సమయంలో వాష్‌రూమ్‌లోకి వెళ్లి తన వద్ద ఉన్న సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకున్నాడు. తీవ్ర గాయంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఘటనా స్థలానికి చేరుకున్న ఉన్నతాధికారులు కేసు నమోదు చేసుకుని ప్రాథమిక దర్యాప్తు చేపట్టారు. కానిస్టేబుల్ స్వామి రాసిన సూసైడ్ నోట్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. "నేను ఆత్మహత్య చేసుకుంటున్నాను. నా భార్య, పిల్లలను ఎవరూ ఏమీ అనొద్దు.. వాళ్లు చాలా మంచివాళ్లు. నేను చనిపోయిన తర్వాత దెయ్యంగా మారైనా సరే నా కుటుంబాన్ని, పిల్లలను జాగ్రత్తగా కాపాడుకుంటాను" అని ఆయన తన డైరీలో రాసుకున్న ఆఖరి మాటలు అందరినీ తీవ్రంగా కలిచివేస్తున్నాయి. ఈ ఘటనపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరుపుతున్నారు.



## జేఎన్టీయూ లో విద్యార్థుల ధర్నా

**హైదరాబాద్:**జేఎన్టీయూ యూనివర్సిటీ మెయిన్ గేట్ ముందు ఆర్ 22 విద్యార్థులు ధర్నాకు దిగారు. ప్రస్తుతం అమలు చేస్తున్న గ్రేస్ మార్క్స్ 0.15 శాతాన్ని వెంటనే 0.50 శాతానికి పెంచాలి అని డిమాండ్ చేస్తున్నారు. యూనివర్సిటీ అఫ్లియేటెడ్ కళాశాలలకు చెందిన విద్యార్థులకు ఇబ్బందులు కలిగేలా యూనివర్సిటీ అధికారులు గ్రేస్ మార్కులు తగ్గించి ఉద్యోగాలు కోల్పోయేలా చేస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే గ్రేస్ మార్కులను పెంచడం తో పాటు ఒక్క సబ్జెక్టు మినహాయింపు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. గేటు ముందు ధర్నా చేస్తున్న విద్యార్థులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కి తరలించారు పోలీసులు. ఎటువంటి ఘటనలు జరగకుండా కేబీహెచ్బీ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు

## తెలంగాణ యువకుడి సంచలన ఆరోపణ!

తన ఆత్మహత్యకు మోదీనే కారణం అంటూ సూసైడ్ నోట్!

**కరీంనగర్, జూలై 23:**తెలంగాణలోని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామానికి చెందిన కుర్రాడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అతను సర్ ఫామ్‌పై రాసిన లేఖ ఇప్పుడు సంచలనంగా మారుతోంది. అందులో మోదీ పేరు రాసి చనిపోవడంతో ఆ లేఖ వైరల్ అవుతోంది. రాచర్ల గొల్లపల్లికి చెందిన వంశీ అనే కుర్రాడు బుధవారం రాత్రి సూసైడ్ చేసుకున్నాడు. సూసైడ్ చేసుకోవడానికి ముందు తన చావుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కారణం అంటూ రాసుకున్నాడు. ఇదే తన చావు లేఖ అంటూ సర్ ఫామ్‌లోనే వాంగ్మూలం ఇచ్చాడు. సర్ ఫామ్‌పై ఇంకా ఏం రాశాడంటే" ఇది నా చావు లేఖ. గౌరవనీయులైన పోలీసు వారికి నమస్కారాలు. తమరు నా ఆందోళన అర్థం చేసుకుంటారని అనుకుంటున్నాను. నా పేరు వంశీ, నేను చనిపోవడానికి కారణం పీఎం నరేంద్ర మోదీ. అంతే కానీ నా చావుకు నా ఫ్యామిలీ మాత్రం కారణం కాదు. దయచేసి ఎవర్నీ ఇబ్బంది పెట్టకుండా, నా దహనసంస్కారాలు ఆనవాయితీగా జరిపించాలని పోలీసు వారికి కోరుకుంటున్నాను." అని రాశాడు. చివరిలో ఇట్లు భారతీయ పౌరుడు వంశీ రాయల్ అని సంతకం చేశాడు.

# ఎడ్యుకేషన్ హబ్ గా హైదరాబాద్

**హైదరాబాద్, జూలై 23:**తెలంగాణలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి (ట్రైసిటీస్) జిల్లాలు దేశంలోనే ఉన్నత విద్యకు ప్రధాన కేంద్రాలుగా సరికొత్త చరిత్ర సృష్టిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ నివేదిక ప్రకారం, అత్యధిక సంఖ్యలో కాలేజీలు కలిగిన జిల్లాల జాబితాలో ఈ మూడు జిల్లాలు జాతీయ స్థాయిలో అగ్రస్థానంలో నిలిచాయి. ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, ఆధునిక సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్ కోర్సులు, వేగంగా విస్తరిస్తున్న ఐటీ రంగంతో పాటు మహిళల భాగస్వామ్యం ఊహించని స్థాయిలో పెరగడం తెలంగాణ విద్యా రంగానికి కొత్త ఊపిరి పోసింది. తెలంగాణ రాజధాని హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలు దేశంలోనే ఉన్నత విద్యకు ప్రధాన కేంద్రాలుగా మరింత బలపడుతున్నాయి. కేంద్ర విద్యాశాఖ విడుదల చేసిన ఆల్ ఇండియా సర్వే ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్ తాజా నివేదికలో ఈ మూడు జిల్లాలు దేశంలో అత్యధిక కాలేజీలు ఉన్న జిల్లాల జాబితాలో అగ్రస్థానాల్లో నిలిచాయి. విస్తృతంగా పెరిగిన విద్యాసంస్థలు, ఆధునిక కోర్సులు, మెరుగైన మౌలిక వసతులు, ఐటీ రంగం విస్తరణ, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రూపొందుతున్న విద్యా విధానాలు ట్రైసిటీస్‌ను దేశంలోనే ప్రముఖ విద్యా కేంద్రంగా నిలబెట్టాయని నివేదిక స్పష్టం చేసింది. హైదరాబాద్ జిల్లాలో 480కు పైగా, రంగారెడ్డి జిల్లాలో 390కు పైగా, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 310కు పైగా ఉన్నత విద్యాసంస్థలు ఉన్నాయి. సంప్రదాయ డిగ్రీ కళాశాలలతో పాటు వైద్య, న్యాయ, ఇంజినీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్, సైన్స్ వంటి విభిన్న రంగాల్లో విద్యను అందించే సంస్థలు అధిక సంఖ్యలో ఉండటం వల్ల దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది విద్యార్థులు ఇక్కడ చదువుకోవడానికి వస్తున్నారు. జాతీయ సగటుతో పోలిస్తే ప్రతి లక్ష జనాభాకు లభిస్తున్న కాలేజీల సంఖ్య కూడా ఈ జిల్లాల్లో ఎక్కువగా ఉండటం మరో ప్రత్యేకతగా నివేదిక పేర్కొంది. గత కొన్నేళ్లుగా హైదరాబాద్ ఐటీ, ఔషధ, స్టార్టప్ రంగాలకు కేంద్రంగా ఎదగడం ఉన్నత విద్యపై కూడా ప్రత్యక్ష ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో ఏఐ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతిక కోర్సులకు భారీగా డిమాండ్ పెరిగింది. నివేదిక ప్రకారం ఈ రెండు జిల్లాల్లో 45 శాతానికి పైగా విద్యార్థులు (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్) కోర్సుల్లోనే చేరుతున్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులు ప్రవేశపెట్టడం వల్ల విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతున్నాయి. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూ, ట్రిపుల్ ఐటీ, కేంద్రీయ విశ్వవిద్యాలయంతో పాటు అనుబంధ కళాశాలల్లో సీట్ల భర్తీ రేటు గతంతో పోలిస్తే మెరుగుపడిందని సర్వే తెలిపింది. క్యాంపస్ ప్లేస్‌మెంట్లు పెరగడం, పరిశ్రమలతో విద్యాసంస్థల భాగస్వామ్యం బలపడటం, ఇంటర్న్‌షిప్ అవకాశాలు అధికంగా లభించడం వల్ల విద్యార్థులు ఈ ప్రాంతంలోని కాలేజీల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని పేర్కొంది. మహిళల ఉన్నత విద్యలో పాల్గొనడంలో కూడా ట్రైసిటీస్ విశేష పురోగతి సాధించాయి. ఒకప్పుడు ఆర్ట్స్, కామర్స్ కోర్సులకే పరిమితమైన మహిళలు ఇప్పుడు ఇంజినీరింగ్, టెక్నాలజీ, పరిశోధన, సైన్స్ రంగాల్లో కూడా పెద్ద సంఖ్యలో చేరుతున్నారు. హైదరాబాద్ జిల్లాలో ఉన్నత విద్యలో అమ్మాయిల నమోదు అబ్బాయిల కంటే ఎక్కువగా నమోదైంది. పీజీ, పీహెచ్‌డీ వంటి ఉన్నత స్థాయి పరిశోధన కోర్సుల్లో మహిళల నమోదు జాతీయ సగటును మించి ఉండటం మహిళా సాధికారతకు నిదర్శనంగా నివేదిక పేర్కొంది. ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టల్ సదుపాయాలు, భద్రతా ప్రమాణాల మెరుగుదల కూడా ఇందుకు కారణాలుగా గుర్తించింది. మౌలిక వసతుల పరంగా కూడా హైదరాబాద్ ట్రైసిటీస్ దేశంలోని ఇతర విద్యా కేంద్రాలకు పోటీ ఇస్తున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లోని 90 శాతానికి పైగా కాలేజీల్లో వైఫై, స్మార్ట్ క్లాస్‌రూమ్స్, డిజిటల్ లైబ్రరీలు, ఆధునిక ప్రయోగశాలలు అందుబాటులో ఉన్నాయని సర్వే తెలిపింది. జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా ప్రయోగాత్మక బోధనకు ప్రాధాన్యం పెరగడంతో ల్యాబ్‌ల ఆధునీకరణ కూడా వేగంగా జరుగుతోందని పేర్కొంది. కౌన్సెలింగ్ కేంద్రాలు, పరిశోధన ఇంక్యుబేషన్ సెంటర్లు, క్రీడా వసతుల కల్పనలో కూడా ఈ జిల్లాలు ముందంజలో ఉన్నాయని వెల్లడించింది. అయితే విద్యార్థుల సంఖ్య వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో కొన్ని ప్రభుత్వ కళాశాలల్లో హాస్టల్ సదుపాయాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని నివేదిక సూచించింది. అధ్యాపకుల ఖాళీల భర్తీ, పరిశ్రమలతో మరింత అనుసంధానం, పరిశోధనకు ప్రాధాన్యం పెంచడం వంటి చర్యలు చేపడితే హైదరాబాద్ ట్రైసిటీస్ దేశానికే కాదు, అంతర్జాతీయ స్థాయిలో కూడా ప్రముఖ నాలెడ్జ్ హబ్‌గా ఎదిగే అవకాశాలు ఉన్నాయని కేంద్ర విద్యాశాఖ నివేదిక అభిప్రాయపడింది.




# హరీష్ ఇంపాక్ట్ ...పాదయాత్రలో తగ్గని క్రేజ్

**మెదక్, జూలై 23:**తెలంగాణ రాజకీయాల్లో ట్రబుల్ షూటర్ గా, గ్రౌండ్ లెవల్ మాస్ లీడర్‌గా చెరగని ముద్ర వేసుకున్న మాజీ మంత్రి హరీష్ రావు వైఖరి ఇప్పుడు గులాబీ శ్రేణుల్లోనే కాకుండా, ప్రత్యర్థి వర్గాల్లోనూ తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. సిద్దిపేట జిల్లా మండల స్థాయిలో హరీష్ రావు చేపట్టిన 15 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్రకు రైతులు, ప్రజల నుంచి ఊహించని స్థాయిలో అపూర్వ స్పందన లభించింది. కాళేశ్వరం పంపులను వెంటనే ప్రారంభించి, గోదావరి జలాలతో రంగనాయక సాగర్‌ను నింపాలని డిమాండ్ చేస్తూ ఆయన నిర్వహించిన ఈ యాత్ర.. కేవలం ఒక మండల స్థాయి నిరసనలా కాకుండా, ఒక రాష్ట్ర స్థాయి ప్రజా ఉద్యమాన్ని తలపించేలా జనసందోహాన్ని ఆకర్షించింది. కేవలం ఒక మండల స్థాయిలోనే హరీష్ పిలుపునకు ఈ స్థాయిలో జనం తరలివస్తే.. ఒకవేళ ఇదే పాదయాత్రను ఆయన నియోజకవర్గ స్థాయికో లేక రాష్ట్ర స్థాయికో విస్తరిస్తే ఉండే మాస్ ఇంపాక్ట్ ఎలా ఉంటుందనే చర్చ పొలిటికల్ సర్కిళ్లలో గట్టిగా నడుస్తోంది. సోషల్ మీడియా బిల్డప్‌లు, పెయిడ్ ప్రచారాల కంటే క్షేత్రస్థాయిలో ప్రజలతో ఉండే లైవ్ కనెక్టివిటీయే నాయకుడి అసలైన బలం అని హరీష్ రావు మరొకసారి నిరూపించారు. బీఆర్ఎస్ ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత చాలామంది కీలక నేతలు వ్యూహాత్మక మౌనం దాల్చినా , సోషల్ మీడియా వేదికలకే పరిమితమైనా.. హరీష్ రావు మాత్రం రోడ్డెక్కి రైతు సమస్యలపై, ప్రభుత్వ వైఫల్యాలపై క్షేత్రస్థాయి పోరాటానికే ప్రాధాన్యత ఇస్తున్నారుఅయితే, హరీష్ రావు ఏం చేసినా సరే ఆయన చుట్టూ రకరకాల రాజకీయ ఊహాగానాలు, అంతర్గత సమీకరణల ప్రచారాలు ముసురుకోవడం పరిపాటిగా మారింది. ప్రజాక్షేత్రంలో ఆయన చురుగ్గా ఉంటూ భారీగా జనాన్ని సమీకరిస్తే.. పార్టీతో సంబంధం లేకుండా సొంత ఇమేజ్, పర్సనల్ బ్రాండ్ పెంచుకోవడానికి యత్నిస్తున్నారు అని సొంత పార్టీలోని కొందరు వ్యతిరేక వర్గీయులు ముద్రవేసే యత్నం చేస్తారు. అదే సమయానికి ఆయన కొద్దిరోజులు సైలెంట్‌గా ఉంటే.. పార్టీ నాయకత్వంపై అలిగారు, విముఖతతో ఉన్నారు అంటూ ప్రత్యర్థులు ప్రచారం మొదలుపెడతారు. ఈ రెండింటి మధ్య హరీష్ రావు సమన్వయం పాటిస్తూ, తన పని తాను చేసుకుపోతుండటం ఆయన పరిణతికి నిదర్శనంహరీష్ రావు అంతర్గత వ్యూహాలు ఎప్పుడూ అంత సులభంగా బోధపడవు. ఒకవేళ హరీష్ రావు ఆలోచన ధోరణిలో చిన్నపాటి మార్పు వచ్చినా లేదా ఆయన వేరే రాజకీయ ఆలోచనల్లో ఉన్నారనే అనుమానం బీఆర్ఎస్ హైకమాండ్‌కు వస్తే.. అది కేవలం ఆ పార్టీలోనే కాక మొత్తం తెలంగాణ రాజకీయ యవనికపైనే ఒక భారీ పొలిటికల్ పెను భూకంపం సృష్టిస్తుందనడంలో సందేహం లేదు. గులాబీ దళంలో అత్యంత కేడర్ బేస్, మాస్ అప్పీల్ ఉన్న నేత కావడంతో.. ఆయన ప్రతి కదలికపై ప్రగతి భవన్ నుంచి ఫామ్‌హౌస్ వరకు, గజ్వేల్ నుంచి సిద్దిపేట వరకు నిరంతరం నిఘా మరియు చర్చ నడుస్తూనే ఉంటాయి. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో రైతుల్లో వ్యక్తమవుతున్న అసంతృప్తిని, నీటి పారుదల ప్రాజెక్టుల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను ఆయుధంగా మలుచుకోవడంలో హరీష్ రావు సక్సెస్ అవుతున్నారు. పార్టీ పదవుల హోదా కంటే, ప్రజల్లో తనకున్న అసలైన గ్రౌండ్ పవర్ ఏంటో నిరూపించుకోవడానికే ఆయన ప్రాధాన్యత ఇస్తున్నారు. సిద్దిపేట పాదయాత్ర ద్వారా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వానికే కాదు, సొంత పార్టీలోని తన వ్యతిరేకులకు కూడా స్పష్టమైన సంకేతాలు పంపారని భావించవచ్చు. మాస్ లీడర్‌షిప్‌కు ప్రత్యామ్నాయం లేదని ఆయన క్షేత్రస్థాయి ఫలితాల ద్వారా చాటిచెబుతున్నారు. వూహాగానాలు, రాజకీయ విమర్శలను ఏమాత్రం పట్టించుకోకుండా హరీష్ రావు తన సొంత శైలిలోనే రైతు పోరాట బాట పట్టారు. రాబోయే రోజుల్లో ఈ పాదయాత్రలను ఇతర నియోజకవర్గాలకు విస్తరిస్తే, అది బీఆర్ఎస్ పార్టీకి ప్రధాన పునరుత్తేజంగా మారే అవకాశం ఉంది. అయితే, ఈ ప్రజాదరణను పార్టీ నాయకత్వం ఎలా స్వీకరిస్తుంది, హరీష్‌ను ఏ రకంగా ముందుకు నడిపిస్తుంది అనేదానిపైనే బీఆర్ఎస్ భవిష్యత్ రాజకీయ వ్యూహాలు , తెలంగాణ రాజకీయ సమీకరణలు ఆధారపడి ఉన్నాయి.



# సొంత పార్టీపై విమర్శలు

**హైదరాబాద్, జూలై 23:**బీజేపీకి ఆయన బద్ధుడైన నాయకుడే. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలవడం అంటే ఆషామాషీ వ్యవహారం కానే కాదు. కానీ గెలిచి చూపించిన రాజకీయ మొనగాడు రాజాసింగ్. గోషామహల్ ఎమ్మెల్యేగా 2014 నుంచి వరుసగా బీజేపీ గుర్తుతో గెలిచి వస్తున్న రాజా సింగ్ ని పార్టీ 2023 ఎన్నికల తరువాత సస్పెండ్ చేసింది. ఆయన కొన్ని విషయాల్లో సొంత పార్టీ మీదనే విమర్శలు చస్తున్నారు అన్న కారణంతో పక్కన పెట్టారు. అయితే ఏదో నాటికి ఆయన బీజేపీ గూటికి చేరుతారు అన్న ప్రచారం ఒక వైపు ఉండగానే రాజా సింగ్ ఏ మాత్రం తగ్గడం లేదు. తన అభిప్రాయాలను ఆయన కుండబద్దలు కొడుతున్నారు. ఆయన బీజేపీకి నిర్మాణాత్మకమైన సూచనలు ఇస్తున్నట్లుగానే అవి ఉంటున్నా అదే సమయంలో ఘాటైన విమర్శలుగా కూడా కనిపిస్తున్నాయి బీజేపీ తెలంగాణాలో అధికారంలోకి వస్తుందా అని రాజా సింగ్ ప్రశ్నించారు. ఆ ఇద్దరు నేతలు కలిస్తే ఏమి జరుగుతుందని ఆయన కీలక ప్రశ్నను సంధించారు. ఆ ఇద్దరు నేతలు ఎవరో కాదు కేంద్ర మంత్రి బండి సంజయ్ అలాగే మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్. ఈ ఇద్దరు నాయకులను తెలంగాణా బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి అభయ్ సింగ్ పిలిపించి చేతులు కలిపారు. విభేదాలు మరచి కలసికట్టుగా పనిచేయాలని సూచించారు. దీంతో బీజేపీ తెలంగాణాలో తన వ్యూహాత్మకమైన అడుగులతో ముందుకు సాగుతోంది అన్న సంకేతాన్ని ఇచ్చినట్లు అయింది. ఇపుడు దానిని రాజా సింగ్ తప్పు పడుతున్నారు. ఇద్దరు నేతలు చేతులు కలిపితే బీజేపీ అధికారంలోకి వస్తుందా అని ఆయన నిలదీస్తున్నారు బీజేపీలో ఎంతో మంది సీనియర్ నాయకులు అలాగే కార్యకర్తలు ఉన్నారని ఆయన గుర్తు చేశారు. వారి సంగతి ఏమిటి అని కూడా ప్రశ్నించారు. అంటే పార్టీలో నాయకులందరినీ బీజేపీ ఇంకా కలుపుకొని పోవడం లేదన్న విమర్శ ఆయన మాటలలో కనిపిస్తోంది. అదే సమయంలో కార్యకర్తలకు ఉత్సాహం కలిగించేలా యాక్షన్ ప్లాన్ లేదని కూడా ఆయన చెబుతున్నట్లుగా ఉంది. నిజానికి బీజేపీలో ఇద్దరు కీలక నేతలు షేక్ హ్యాండ్స్ ఇచ్చుకున్నారు. విభేదాలు తగ్గాయి. ఇది మంచి సంకేతాలను ఇస్తుందని కమలనాథులు ఒక వైపు పొంగుతున్నారు. దాని మీద రాజా సింగ్ తన ఘాటు విమర్శలతో నీళ్ళు జల్లేశరు అని అంటున్నారు. .కమలం పార్టీ తెలంగాణాలో కదనోత్సాహంతో ఉంది. మూడు కార్పోరేషన్ల మేయర్ పదవులు గెలుచుకోవాలని పట్టుదలగా ఉంది. అలా తన సత్తా చాటాలని చూస్తోంది. అయితే బీజేపీ ఉత్సాహానికి గాలి తీసేశారు రాజాసింగ్ అంటున్నారు. మూడు కార్పోరేషన్ల మేయర్లు గెలవడం కాదు ముందు ఒక్క కార్పోరేషన్ లో అయినా సగం సీట్లు గెలిచి చూపించండి చాలు అని సవాల్ చేసేలా మాట్లాడారు. అంటే బీజేపీకి ఒక్క కార్పొరేషన్ గెలిచే అవకాశాలు లేవని రాజా సింగ్ తన ముందస్తు అంచనాను ఇలా బయటపెట్టారా అని చర్చ సాగుతోంది. అంతే కాదు ఆయన బీజేపీ ప్రస్తుత అధ్యక్షుడు రామచంద్రరావు మీద మీద కూడా కామెంట్స్ చేశారు. ఆయన చేతులు కట్టేశారని మరి ఎలా పనిచేస్తారు అని ప్రశ్నించారు ఒక వ్యక్తి కోసమే అధినాయకత్వం ఆలోచించే విధానాలు వద్దు అని హితవు పలికారు. మొత్తానికి దూరంగా ఉంటూనే కమలానికి కఠినమైన తీరులోనే సలహాలు సూచనలతో పాటు దిశా నిర్దేశం చేశారు రాజాసింగ్. దీనిని బీజేపీ అధినాయకత్వం ఏ విధంగా చూస్తుంది అన్నదే ఇపుడు చర్చ మరి.



## రైలు పట్టాల పైనే ఆగిపోయిన లారీ...

**పెద్దపల్లి:**రైల్వే లెవెల్ క్రాసింగ్ మధ్యంలో ఒక లారీ ఇంజన్ లోపంతో ఆగిపోయింది. గేట్ మ్యాన్ గమనించి అధికారులను అప్రమత్తం చేసారు. దాంతో రైల్వే అదికారులు అరగంట పాటు లైన్లో రైళ్ల రాకపోకలను నిలిపేసారు. సాంకేతిక సమస్యతో ఇంజన్ స్టార్ట్ కాకపోవడంతో లారీని నెట్టుతూ స్థానికులు బయటకు తీసారు. ఘటన కూనారం రైల్వే గేట్ వద్ద చోటు చేసుకుంది.

## నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న టీఆర్ఎస్ విద్యార్థి నాయకులు




**హైదరాబాద్:**డిల్లీలో నీట్ పరీక్ష పేపర్ లీకేజీని నిరసిస్తూ పార్లమెంట్ ముట్టడికి వెళ్తున్న విద్యార్థులపై పోలీసుల దమనకాండను నిరసిస్తూ ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ఎదుట తెలంగాణ రక్షణ సేన విద్యార్థి నాయకులు నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. దీక్ష చేస్తున్న విద్యార్థి నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ కు తరలించారు. అరెస్టు అయిన వారు ఠాణాలో దీక్ష కొనసాగించారు. మరోవైపు, కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీలో కుడా తెలంగాణ రక్షణ సేన విద్యార్థి నాయకుల నిరవధిక నిరాహార దీక్ష కొనసాగింది.

# లక్ష్యసాధనకు శిక్షణ ఎంతో కీలకం







**స్టేడియం నిర్మాణానికి స్థల పరిశీలన.**
**ప్రతిభను ప్రోత్సహించడం సమాజం బాధ్యత.**
**ఘనంగా రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి జన్మదిన వేడుకలు.**
**ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి.**

**నాగర్ కర్నూల్ జులై 23( స్కై న్యూస్)** అనుకున్న లక్ష్యాన్ని చేదించేందుకు శిక్షణ ఎంతో కీలకంగా మారుతుందని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి అన్నారు గురువారం ఉదయం జిల్లా కేంద్రంలో ఉదయ్ ఆర్మీ అకాడమీని సందర్శించారు ఈ సందర్భంగా ఆయన శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడుతూ శిక్షణ విధానం శిక్షణ ద్వారా కలిగే ప్రయోజనాలను తెలుసుకొని వారితో కలిసి పరుగు పందెంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిక్షణ నిర్వాహకులు ప్రత్యేకమైన మైదానం అవసరమని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మార్నింగ్ వాకింగ్ చేసే వారి కోసం మరియు వివిధ శిక్షణలు తీసుకునే వారికి అన్ని విధాలుగా అందుబాటులో ఉండే విధంగా స్టేడియం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయడం తో పాటు అనుమతులను మంజూరు చేయించడం జరిగిందని ప్రస్తుతం స్థల పరిశీలన చేస్తున్నామని త్వరలోనే స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన చేసి పూర్తి చేస్తామని అన్నారు. అకాడమీలో శిక్షణ పొందిన 39 మంది విద్యార్థులలో 37 మంది విద్యార్థులు భారత ఆర్మీలో ఎంపికైనట్లు ప్రస్తుతం 100 మంది విద్యార్థులకు కఠిన శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ ద్వారా మెలకువలను నేర్చుకొని దేశసేవే లక్ష్యంగా సైన్యంలో చేరాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్ కౌన్సిలర్ మాధవి రాజు పాల్గొన్నారు అనంతరం జిల్లా కేంద్రంలోని సిఎన్ఆర్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించి మొదటి ద్వితీయ తృతీయ ర్యాంకులు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆయన ల్యాప్ టాప్ లను అందించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులను ప్రోత్సహించడం సమాజం బాధ్యత అని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని వాటిని సాధించి తల్లిదండ్రులకు పాఠశాలలకు గ్రామాలకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్ వైస్ చైర్మన్ బాదం రమేష్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జక్కా రాజకుమార్ రెడ్డి కౌన్సిలర్లు నిజాముద్దీన్ పద్మమ్మ ఖాజా ఖాన్ పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రకళ తోపాటు నిర్వాహకులు వెంకటేశ్వరరావు ఉపాధ్యాయ బృందం విద్యార్థులు వారి తల్లిదండ్రులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో ఏఐసీసీ నాయకురాలు రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ జన్మదినాన్ని పురస్కరించుకొని కేకు కట్ చేసి వేడుకలలో పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణతో నిస్వార్థంగా పనిచేసే నాయకులకు పార్టీ అండగా నిలుస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వైఫల్యాలను వెంటపడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సందర్భంగా కోరారు ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ సునేంద్ర కుమార్ వైస్ చైర్మన్ బాదం రమేష్ పట్టణ అధ్యక్షుడు జక్కా రాజ్ కుమార్ రెడ్డి కౌన్సిలర్లు నిజాముద్దీన్ పద్మమ్మ కాజాఖాన్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు వంకేశ్వరం నిరంజన్ డిసిసి కార్యదర్శి కొత్త శ్రీనివాసులు తో పాటు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# నీట్ పేపర్ లీక్‌పై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలి

**కేశంపేట మాజీ జెడ్పీటీసీ తాంద్ర విశాల శ్రావణ్ రెడ్డి**



**రంగారెడ్డి జిల్లా జులై 23 (స్కై న్యూస్):** నీట్ పేపర్ లీక్ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేశంపేట మాజీ జెడ్పీటీసీ తాంద్ర విశాల శ్రావణ్ రెడ్డి డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ అగ్రనేతల అరెస్టులు, విద్యార్థులపై లాఠీచార్జ్‌ను నిరసిస్తూ కేశంపేటలో మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అనుమగల్ల రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తాంద్ర విశాల శ్రావణ్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ పేపర్ లీక్ ఘటనలో బాధ్యులపై



చర్యలు తీసుకోవడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. తమ హక్కుల కోసం శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసిన విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడం అమానుషమని పేర్కొన్నారు. విద్యార్థులకు మద్దతుగా నిలిచిన రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆరోపించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై స్వతంత్ర సంస్థతో సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులను కఠినంగా శిక్షించాలని కోరారు. అలాగే విద్యార్థులపై లాఠీచార్జ్‌కు ఆదేశించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, కాంగ్రెస్ నాయకులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పారదర్శకమైన పరీక్షా విధానాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని నాయకులు స్పష్టం చేశారు.

# విద్యార్థుల బకాయిలను వెంటనే విడుదల చేయాలి

**సంక్షేమానికి 20 శాతం నిధులు కేటాయించాలి**



**నాగర్ కర్నూల్ జులై 23 (స్కై న్యూస్)** ప్రభుత్వం విద్యార్థులకు బకాయిలో ఉన్న స్కాలర్షిప్లు మరియు ఫీజు రియంబర్స్మెంట్ నిధులను వెంటనే విడుదల చేసి పేద విద్యార్థులకు ఉన్నత విద్యా అందేలా అన్ని చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బలముల ప్రేమ్ కుమార్ డిమాండ్ చేశారు గురువారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కార్యాలయ పరిపాలన అధికారికి అందించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నెంబర్ 7 మరియు 8 మరియు 9 లను రద్దుచేసి పాత పద్ధతిలోనే బకాయిలను చెల్లించాలని ప్రభుత్వ పాఠశాలల మరియు కళాశాలల బలోపేతానికి బడ్జెట్లో విద్యకు 20 శాతం నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో లక్షలాది మంది విద్యార్థులు విద్యా బకాయిల కోసం ఎదురుచూస్తున్నారని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు చేస్తున్న ఒత్తిడికి అయోమయంలో పడి ఉన్నత విద్యను అభ్యసించలేని దుస్థితిలో ఉన్నారని అన్నారు. అర్హత కలిగిన ప్రతి విద్యార్థికి ఫీజు రియంబర్స్మెంట్ మరియు స్కాలర్షిప్లు చెల్లించాలని కోరారు ప్రభుత్వ విద్యాసంస్థల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని ప్రభుత్వం విద్యారంగ సంస్థలలో కనీస సౌకర్యాలు కూడా లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇక్కడ ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ప్రభుత్వ విద్యారంగ సంస్థలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులను భర్తీ చేయాలని నాణ్యమైన విద్యను అందించేందుకు వెంటనే నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు బడ్జెట్లో 20 శాతం నిధులు విద్యకు కేటాయించాలని విద్యా ద్వారానే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు గురుకులాలు సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో నాణ్యమైన భోజనం స్వచ్ఛమైన త్రాగునీరు వైద్య సేవలు భద్రత పరిశు భ్రతతో పాటు మౌలిక వసతులు కల్పించాలని చట్టాలను అమలు చేసి విద్య హక్కు చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రి లేకపోవడం వల్ల అనేక సమస్యలు పెండింగ్లో ఉన్నాయని సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టేందుకు విద్యా శాఖకు ప్రత్యేకంగా మంత్రి నియమించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో నాయకులు ఫన్నీ అర్జున్ చరణ్ యశ్వంత్ అనిల్ రవీందర్ ప్రవీణ్ లక్ష్మణ్ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు

# కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

**బీఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు మరియు జోగులాంబ గద్వాల జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య**
**జోగులాంబ గద్వాల జిల్లా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ**



**జోగులాంబ గద్వాల, జూలై 23(స్కై న్యూస్):** గద్వాల జిల్లా కేంద్రంలో జరిగిన నిరసన ర్యాలీ పాత బస్టాండ్ నుంచి ప్రారంభమై అంబేద్కర్ చౌక్ వరకు మరియు అంబేద్కర్ చౌక్ నుంచి పాత బస్టాండ్ వరకు.జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో విద్యార్థి సంఘాలు బి ఆర్ ఎస్ వి, పిడిఎస్యు, ఏఐఎస్ఎఫ్, యు ఎస్ ఎఫ్ ఐ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ జరిగింది.ఈ సందర్భంగా బీఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు కురువ పల్లయ్య మాట్లాడుతూ

ప్రధాన డిమాండ్స్ :-

కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి.నీట్ లీకేజీ లో పాల్పంచుకున్న వారిపైన కఠినమైన చర్యలు తీసుకోవాలి. చనిపోయిన నీట్ విద్యార్థికి ప్రతి ఒక్కరికి కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలి.జంతర్ మంతర్ దగ్గర విద్యార్థుల పైన లాఠీ చార్జ్ జరిపిన పోలీసుల పైన ఎంక్వయిరీ చేసి చర్యలు తీసుకోవాలి. ప్రతి సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలను భర్తీ హామీని అమలు చేయాలి. పర్యావరణ శాస్త్రవేత్త సామాజిక ఉద్యమకారుడు ఎడ్యుకేటర్ రీఫార్మర్ సోనం వాంగ్ చూక్ ను కాపాడాలి.ఈ భారీ నిరసన ర్యాలీలో జిల్లాలోని అన్ని విద్యార్థి సంఘాల నాయకులు, నిరుద్యోగులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


# కార్యకర్త పాడేమోసిన యువ నేత



**నాగర్ కర్నూల్ జిల్లా 23 (స్కై న్యూస్)** జిల్లా కేంద్రంలోని 13వ వార్డుకు చెందిన మాజీ వార్డు సభ్యుడు మాజీ మంత్రి నాగం జనార్ధన్ రెడ్డి అనుచరులు బోనాసి మల్లయ్య గురువారం అనారోగ్యంతో మృతి చెందడంతో బిఆర్ఎస్ యువనేత డాక్టర్ నాగం శశిధర్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించడంతోపాటు అంత్యక్రియలలో పాడేమోసి కన్నీటి పర్వతమయ్యారు. మల్లయ్య మృతి పార్టీకి తీరని లోటని ఆయన కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని అన్నారు ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు అర్థం రవి కౌన్సిలర్లు అర్జునయ్య తిమ్మాజీపేట పాండు కొత్త గంగాధర్ నాయకులు యుగంధర్ రెడ్డి సుభాష్ భీమయ్య దామోదర్ రెడ్డి లక్ష్మయ్య వెంకటేష్ భీముడు సత్యం విష్ణు చారి అహ్మద్ పాషా తదితరులు పాల్గొన్నారు

# ఆర్.సురేందర్ రెడ్డిని ప్రభుత్వ సలహాదారుడిగా నియమించాలి

**ముఖ్యమంత్రికి మైనారిట్స్ సెక్యులర్ ఫ్రంట్ విజ్ఞప్తి**



**హైద్రాబాద్ జులై 23;** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే ఆర్ సురేందర్ రెడ్డి ని రాష్ట్ర ప్రభుత్వం సలహాదారులుగా నియమించాలని మైనార్టీస్ సెక్యులర్ ఫ్రంట్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేసింది. గురువారం ఎన్ఎస్ఎస్ లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఫ్రంట్ కన్వీనర్ కమల్ కొందుమెరిమాట్లాడుతూ సురేందర్ రెడ్డి ఎంపీగా ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవలు చేశారని ఆయన పేర్కొన్నారు అంతేకాకుండా రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ఆయన చేసిన కృషి అమోఘమైనదని ఆయన పేర్కొన్నారు ఇట్టి విషయమై రాష్ట్ర ప్రభుత్వానికి అనేకమార్లు వినతి పత్రాలు కూడా సమర్పించినట్లు ఆయన తెలిపారు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సురేందర్ రెడ్డి సేవలను గుర్తించి ఆయనను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులుగా నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఫ్రంటు ఉపాధ్యక్షులు షఫీ అకి ఖాన్, ప్రధాన కార్యదర్శి మజార్ పాష తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పేపర్ లీకేజీపై విద్యార్థుల ఉద్యమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మద్దతు






**రంగారెడ్డి జిల్లా, జూలై 23 (స్కై న్యూస్):** నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై షాద్‌నగర్ పట్టణ కూడలిలో విద్యార్థులు చేపట్టిన ధర్నాకు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ తీరును విమర్శిస్తూ విద్యార్థుల న్యాయమైన డిమాండ్లకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, నీట్ పేపర్ లీకేజీ కారణంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. విద్యార్థులకు మద్దతుగా నిలిచిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై చర్యలు తీసుకోవడాన్ని కూడా ఆయన ఖండించారు. నీట్ పేపర్ లీకేజీ అంశంపై పార్లమెంటులో చర్చ జరపాలని కాంగ్రెస్ పార్టీ కోరుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై స్వతంత్ర సంస్థతో సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని, ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జ్‌ను తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం, గిరిజన ఆదివాసీ రాష్ట్ర కోఆర్డినేటర్ రఘు నాయక్, చెంది తిరుపతి రెడ్డి, మహ్మద్ ఇబ్రహీం, వివిధ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బాల గంగాధర్ తిలక్ స్ఫూర్తితో సమైక్యత సామాజిక బాధ్యతకు కృషి...




**నాగర్ కర్నూల్ జులై 23 (స్కై న్యూస్)** స్వరాజ్యం నా జన్మ సిద్ధహక్కు అని ప్రతిజ్ఞ తీసుకొని మహోన్నత నినాదంతో దేశ స్వాతంత్ర ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన లోకమాన్య బాల గంగాధర్ తిలక్ స్ఫూర్తితో యువత జాతీయ సమైక్యత సామాజిక బాధ్యత పట్ల అంకితభావంతో ముందుకు సాగాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగారు బాబు కోరారు గురువారం ఆయన 107 వ జయంతిని పురస్కరించుకొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశభక్తి స్వదేశీ భావన జాతీయ విద్య ప్రజలలో చైతన్యం కలిగించడంలో బాలగంగాధర్ తిలక్ సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. భారతీయులలో స్వాతంత్ర స్ఫూర్తిని రగిలించి దేశ సేవే పరమావధని బోధించిన జాతీయవాది అని అన్నారు ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి ప్రసాద్ సంయుక్త కార్యదర్శి శివ నాయకులు మార్కండేయ తదితరులు పాల్గొన్నారు

# డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆనాథ విద్యార్థు లకు నోట్‌బుక్స్ పంపిణీ



**హైదరాబాద్, (ఎల్‌బీ నగర్) జులై 23;** ది డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నేడు ఎల్‌బీ నగర్‌లోని ఆనాథ విద్యార్థి గృహంలో విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటుగా 5,000 నోట్‌బుక్స్‌ను ఉచితంగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించి, వారి చదువుకు ప్రోత్సాహం కల్పించారు. విద్య ప్రతి చిన్నారి హక్కు అనే భావనతో సమాజంలోని ఆర్థికంగా వెనుకబడిన మరియు అనాథ విద్యార్థులకు చేయూత అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా ది డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులు మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు బంగారుమయం కావాలంటే సమాజం మొత్తం కలిసి వారికి అండగా నిలవాలని, విద్య, ఆరోగ్యం మరియు సామాజిక సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా విస్తృతంగా కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన ఆనాథ విద్యార్థి గృహం యాజమాన్యానికి, దాతలకు, వాలంటీర్లకు మరియు సొసైటీ సభ్యులకు సొసైటీ ఎక్సగ్యుటీ డైరెక్టర్ జి.మాధవి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# షాద్‌నగర్ చౌరస్తా విస్తరణకు రంగం సిద్ధం




**రంగారెడ్డి జిల్లా, జూలై 23 (స్కై న్యూస్):** షాద్‌నగర్ ప్రధాన చౌరస్తా రోడ్డు విస్తరణ పనులకు అధికారులు వేగం పెంచారు. రోడ్డుపై ఉన్న దుకాణాలు, డబ్బాలు, ఇతర తాత్కాలిక నిర్మాణాలను యజమానులు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని మున్సిపాలిటీ, ఆర్‌అండ్‌బీ అధికారులు సూచించారు. ఆటోలో మైకింగ్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు, స్వచ్ఛందంగా తొలగించని పక్షంలో సోమవారం నుంచి సంయుక్తంగా ఆక్రమణల తొలగింపు చర్యలు చేపడతామని హెచ్చరించారు. రోడ్డు విస్తరణ పనులకు ప్రజలు, వ్యాపారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థులపై లాఠీచార్జ్‌ను ఖండించిన ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీను నాయక్



**రంగారెడ్డి జిల్లా, జూలై 23 (స్కై న్యూస్):** ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై ఆందోళన చేపట్టిన విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌ను ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీను నాయక్ ఖండించారు. ఆయన మాట్లాడుతూ, నీట్ పేపర్ లీకేజీ ఘటనపై కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు న్యాయం చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఆధునిక సాంకేతికత ఉన్న ఈ కాలంలో నీట్ ప్రశ్నాపత్రం ఎలా లీక్ అయిందని ప్రశ్నించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొంటూ, నీట్ పేపర్ లీకేజీపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ప్రజాస్వామ్య విలువలను పరిరక్షిస్తూ విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ 'చలో కలెక్టరేట్'




**రంగారెడ్డి జిల్లా, జూలై 23 (స్కై న్యూస్):** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ఒకేసారి విడుదల చేయాలని, విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ వద్ద 'చలో కలెక్టరేట్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్ చౌహాన్, జిల్లా కార్యదర్శి సామిడి వంశీ వర్ధన్ రెడ్డి



మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్-టీచింగ్, ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు, విద్యార్థి సంఘ ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్క సర్ ఫామ్ ను నింపి ఓటర్ గా పేరును నమోదు చేసుకోండి

**బి.ఆర్.ఎస్ పార్టీ నాయకుడు అందె లక్ష్మణ్ రావు**



**రంగారెడ్డి(మణికొండ)జూలై 23;**ఓటర్ జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) జరుగుతున్న విధి విధానాలకు గత కొన్ని రోజులుగా భారత రాష్ట్ర సమితి పార్టీ మణికొండ, నెక్నంపూర్ డివిజన్ నాయకుల ప్రయత్నానికి, మద్దత్తుకు మణికొండ శివపురి కాలనీ అధ్యక్షుడు మధు, సావిత్రి, హన్మంతు సాగర్, శ్రీనివాస్, తిరుపతి తదితర స్థానిక నివాసులు గురువారం రోజున హర్షం ప్రకటిస్తు ఇట్టి విషయమై స్థానికులు తమ వద్ద ప్రస్తుతం ఓటర్ కార్డు ఉన్నది కావున తాము మళ్లీ ఈ ఫారమ్ లు నింప వలసిన అవసరం లేదనె అభిప్రాయంతో వుంటిమనీ, అందుకు సంబంధించిన వివరాలను విఫలంగా విడమర్చి చెబుతూ ఇట్టి ప్రక్రియలో బూతులెవల్ అధికారుల పాత్ర ఎంత కీలకమో – ప్రజల పాత్ర కూడా అంతే కీలకం అని, ప్రతి క్రియగా నివాసిత కుటుంబ సభ్యులు, ప్రతి ఒక్క ఓటర్ తమ ఓటును 2002 లోని తమ ఓటు లేదా తమ పెద్దల ఓటుతో జత కలుపడం (మ్యాపింగ్ చేయడం) తప్పని సరి అని అప్పుడే తమ ఓటు హక్కు ఉంటుందని లేనిచో ఓటు గల్లంతగునని బి.ఆర్.ఎస్ పార్టీ నాయకుడు అందె లక్ష్మణ్ రావు వివరించారు.

## ఫరీద్‌పూర్ గ్రామ అభివృద్ధికి కీలక హామీలు...

**: ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి**



**చిన్న చింతకుంట జులై 23 (స్కై న్యూస్);** చిన్నచింతకుంట మండలం సర్పంచ్‌ల సమస్యలపై ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం గ్రామ సర్పంచ్ తెలుగు శివకుమార్ తో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫరీద్‌పూర్ గ్రామానికి సంబంధించిన సీసీ రోడ్లు, డ్రైనేజీలు, రెండు బస్ షెల్టర్లు, పాఠశాల కాంపౌండ్ వాల్, ట్రాన్స్‌ఫార్మర్లు, కరెంట్ స్తంభాలు, కొత్త గ్రామ పంచాయతీ కార్యాలయం మంజూరు చేయనున్నట్లు హామీ ఇచ్చారు. అలాగే అంబేద్కర్ భవన్ నిర్మాణానికి కూడా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. గ్రామంలో తరచూ ఏర్పడుతున్న విద్యుత్ కోతలు, లో వోల్టేజ్ సమస్యల వల్ల గ్రామ పంచాయతీ మోటార్లు సరిగా పనిచేయక తాగునీటి సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతోందని గ్రామ సర్పంచ్ తెలుగు శివకుమార్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, శాశ్వత పరిష్కారం కోసం ఏమి చేయాలి అని అడిగారు. అప్పుడు ఫరీద్‌పూర్ గ్రామానికి ఒక మినీ సబ్‌స్టేషన్ అవసరమని కోరగా, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే తమ పి ఏ కి ఫరీద్‌పూర్ గ్రామానికి మినీ సబ్‌స్టేషన్ ప్రతిపాదన సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. త్వరలోనే ఫరీద్‌పూర్ గ్రామానికి మినీ సబ్‌స్టేషన్ మంజూరు కానుంది అన్నారు. గ్రామానికి సంబంధించిన మరిన్ని సమస్యలను కూడా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, వాటన్నింటికీ ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

# కులవృత్తుల చేయూత ప్రభుత్వ ప్రధాన లక్ష్యం...

**ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఓటు కీలకమే**

**ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి**





**బిజినపల్లి జూలై 23(స్కై న్యూస్)** కాంగ్రెస్ ప్రభుత్వం కులవృత్తులను ఆదుకొని వారిని ఆర్థిక ప్రయోజకులుగా మార్చడమే ప్రధాన ఎజెండాగా పనిచేస్తుందని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి అన్నారు గురువారం మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన మత్స్యకారుల చేపల విక్రయ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు అనంతరం ఆయన మాట్లాడుతూ సబ్బండ కులాలను అక్కున చేర్చుకుని వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తూ అన్ని కులవృత్తులను ప్రోత్సహిస్తుందని అన్నారు. మత్స్యకారులు కొనుగోలుదారులకు పరిశుభ్రమైన నాణ్యమైన చేపలను అందుబాటులో ఉంచి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. మత్స్యకారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం చెరువులను పునరుద్ధరించడంతోపాటు అనేక సంస్కరణలు తీసుకురావడం జరిగిందని మెరుగైన మౌలిక వసతులను కల్పించడంతోపాటు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన బిఎల్ఎ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటు కీలకమేనని బిఎల్వోలు అర్హత కలిగిన ప్రతి ఒక్క ఓటరు పేరును నమోదు చేసి వారికి ఓటు కల్పించే బాధ్యత స్వీకరించాలన్నారు ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని కొత్తగా అర్హత పొందిన వారి పేర్లను నమోదు చేయడంతో పాటు లోపాలను సరిచేయాలని సూచించారు. ఓటు హక్కు పొందడమే కాకుండా ప్రతి పౌరుడు దానిని వినియోగించుకొని ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని కోరారు ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు బిఎల్వోలు మత్స్యకారుల సంఘం నాయకులు పాల్గొన్నారు

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**ప్రభుత్వ ఆసుపత్రికి మౌలిక సదుపాయల కొరకు 50 లక్షలు మంజూరు**

**ఆసుపత్రి పరిసరాలు శుభ్రంగా లేకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం**

**మరమ్మత్తుల పనులను వెంటనే చేపట్టాలని ఆదేశించిన కలెక్టర్**

**జిల్లా జనరల్ హాస్పిటల్ ను ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్**



**జోగులాంబ గద్వాల, జూలై 23(స్కై న్యూస్):**ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ డాక్టర్లను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఐసీయూ, ఇతర వార్డులను సందర్శించి రోగులతో మాట్లాడారు. రోగుల ఆరోగ్య సమస్యలను తెలుసుకొని వారికి అందుతున్న వైద్య సేవలపై వాకబు చేశారు. గద్వాల ఆసుపత్రికి మంజూరైన వివిధ వైద్య, ఇతర సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్న వాటిని పూర్తిస్థాయిలో భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చి నిబంధనల ప్రకారం ముందుకెళ్లాలన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పరిసరాలను పరిశీలించగా పొదలు పెరగడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వినియోగించని పాత మంచాలు, ఇతర వైద్య సామాగ్రిని ఎక్కడపడితే అక్కడ పడేయడం సరికాదని ఇలాంటి స్క్రాప్ ను వేలంపాట నిర్వహించి విక్రయించాలన్నారు. ఎగ్జామినేషన్ ట్రీట్మెంట్ విభాగంలో మానిటర్ యంత్రం పనిచేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఆసుపత్రి కి అవసరమైన నిత్య అవసరాల పరికరాలు, మందులకు కావాల్సిన ప్రాతిపదానాలను అందజేస్తే వెంటనే మంజూరు చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఆపరేషన్ థియేటర్లో చేయాల్సిన వివిధ పనులపై తగు సూచనలు చేశారు. ఆసుపత్రిలో పలు మరమ్మత్తులు, విద్యుత్, ఇతర పనులకై రూ.50 లక్షల నిధులను కేటాయించినప్పటికీ సకాలంలో పనులు ప్రారంభించకపోవడంపై సంబంధిత అధికారులపై మండిపడ్డారు. అవసరమైన విద్యుత్, రూఫ్ లైకేజీలు, కిటికులు తలుపులు, వెహికల్ పార్కింగ్ షెడ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆసుపత్రి పైన అంతస్తులో ఉన్న 50 మంచాల జనరల్ వార్డుకు వెళ్లేందుకు ఉన్న ర్యాంపుకు పైకప్పును యుద్ధ ప్రాతిపదికన నిర్మించాలనీ గుత్తేదారును ఆదేశించారు. రోగుల సహాయకులు వేచి ఉండేందుకు ఆసుపత్రి ఆవరణలో షెడ్ నిర్మాణం చేపట్టాలన్నారు. వివిధ పనులకై ఇదివరకు కేటాయించిన నిధులు సరిపోకుంటే అదనపు నిధులను మంజూరు చేస్తామని, ఆసుపత్రిలో ఎలాంటి సమస్యలు లేకుండా రోగులకు పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఆసుపత్రి పర్యవేక్షకుల చాంబర్ లో కలెక్టర్ వైద్యాధికారులతో సమావేశమై మాట్లాడారు. ఈ సందర్భంగా వైద్యులు, ఇతర సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్లు, వివిధ రికార్డులను తనిఖీ చేశారు. చాలా రోజులుగా విధులకు హాజరుకాని వైద్యులను సరెండర్ చేయాలన్నారు. ఏజెన్సీ ద్వారా అవుట్సోర్సింగ్ విధానంలో సెక్యూరిటీ, శానిటేషన్ కోసం పెద్ద ఎత్తున సిబ్బందిని నియమించారని, వారి సేవలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని పర్యవేక్షకురాలు ఝాన్సీ లక్ష్మికి సూచించారు. నిబంధనల ప్రకారం అదనపు సిబ్బందిని నియమించాలని ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. అలాగే ఆసుపత్రి ఆవరణలో దివ్యాంగుల సదరం శిబిరం నిర్వహణకు నూతనంగా నిర్మించిన భవనాన్ని, రేడియోలజీ, మైత్రి ట్రాన్స్ క్లినిక్, తదితర విభాగాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఆసుపత్రి సమీపంలో నిరుపయోగంగా ఉన్న వివిధ వైద్య సిబ్బంది క్వార్టర్స్ ను సద్వినియోగం చేసుకునేందుకు ప్రణాళికలు రూపొందించాలని పేర్కొన్నారు. ఆసుపత్రికి విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం ఉండకుండా వైద్యాధికారులు విద్యుత్ శాఖ అధికారులను సమన్వయం చేసుకుంటూ తగు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, పంచాయతీరాజ్ శాఖ ఈఈ ప్రభాకర్, వైద్యశాఖ ఏఈ రహీం, వైద్యాధికారులు, తదితరులున్నారు.

# వయోవృద్ధులు... జాగ్రత్త...!

**రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి**



**వికారాబాద్ జులై 23 ;:** పెద్ద వయసు వారిలో "పడిపోవడం" పెద్ద సమస్య! మెట్ల మీద, స్నానాల గదిలో నునుపుగా ఉండే బండల మీద ఇలా ఎక్కడో చోట వృద్ధులు జారి పడిపోవడం, ఎముకలు విరగటం ముఖ్యంగా తుంటి కీలు విరిగి వారి జీవితం ఉన్నట్టుండి సమస్యల వలయముగా మారిపోవటం తరచూ చూస్తుంటాము. పైగా ఈ వయసుకు వచ్చేసరికి చాలామందికి ఎముకలు బోలుగా తయారై (ఆస్తియోపోరోసిస్) అవి తేలికగా కొద్దిపాటి ఒత్తిడికే విరిగిపోతుంటాయి. తర్వాత త్వరగా అతుకవు కూడా! దీనివల్ల కొన్నిసార్లు మంచానికే పరిమితం అవ్వాల్సిన పరిస్థితులు కూడాతలెత్తుతుంటాయి. వీటన్నిటికీ కారణం గా మలి వయసులో జారిపడటం, తుంటి ఎముక విరగటం అన్నది అతి పెద్ద వృద్ధాప్య సమస్యల తయారవుతుంది. కాబట్టి అసలీ విపత్తు తలెత్తకుండా చూసుకోవటమే మేలు. ఇంట్లో వృద్ధులు ఉన్నప్పుడు కొన్ని రకాల జాగ్రత్తలు అవసరమని వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి సొసైటీ పేర్కొన్నారు. ఆ జాగ్రత్తలేమిటో సాయి చౌదరి మాటలలోనే తెలుసుకుందాం ఇంట్లో ఎక్కడ పడితే అక్కడ వైర్లు, తాళ్లు, బట్టలు వంటివి పడేసి ఉంటే అవి కాళ్లకు అడ్డుపడి వృద్ధులు పడిపోయే అవకాశాలు ఎక్కువ. కాబట్టి వైర్లు, తాళ్ళ వంటి వాటిని అన్నింటినీ నిర్లక్ష్యముగా నేల మీద వదిలేయకుండా జాగ్రత్తగా ఒక చోట చుట్టి పెట్టటం ముఖ్యం. స్నానాల గదిలో "నాన్ స్కిడ్ టైల్స్" ని వాడాలి. దీని వల్ల అక్కడ పాకుడు పట్టడం, జారిపోవడం వంటి సమస్యలు ఉండవు. చాలామంది ఇంట్లో సాక్స్ లు ధరించి నడుస్తుంటారు. కానీ అది మంచి పద్ధతి కాదు. నునుపైనా నేల మీద అవి తేలిగ్గా జారిపోతుంటాయి. రబ్బరు సోలు ఉన్న పాదరక్షలు ధరించడం మంచిది. అవి అంతగా జారిపోయే అవకాశం ఉండదు. చాలాసార్లు పక్క మీంచి లేచేటప్పుడు దుప్పట్లు కాళ్లకు చుట్టుకుని పడిపోతుంటారు. కాబట్టి హడావుడిగా లేవకుండా... దుప్పట్లును జాగ్రత్తగా తీసి పక్కన పెట్టి అప్పుడు నిదానంగా లేచి కూర్చుని, అప్పుడు నిలబడటం అలవాటు చేసుకోవాలి. వృద్ధులు తరచూ ఉపయోగించే మందుల వంటి వాటిని ఎక్కడో అందనంత ఎత్తులో పెట్టుకోవద్దు. స్టూలు వేసుకుని వాటిని అందుకునే క్రమంలో వాళ్లు పైనుంచి పడిపోవచ్చు. ఒకవేళ పొరపాటున నీళ్ల లాంటివి ఇంట్లో నేల మీద ఉనికి పోతే అవే ఆరిపోతాయి లే అనే నిర్లక్ష్యము పనికిరాదు. మార్బుల్స్, గచ్చు మీద జారీ పడితే గాయాలు తీవ్రంగా ఉండే ప్రమాదముంది చాలా ఇళ్లల్లో మెట్ల ప్రాంతము చీకటిగా ఉంటుంది. గదుల్లో తప్పించి మెట్ల దగ్గర ప్రత్యేకించి లైట్లేమి ఉండవు. ఇలాంటి పరిస్థితుల్లో చాలా మంది పెద్దవాళ్లు రాత్రి పూట నిద్రమత్తులో పొరపాటున ఒకచోట అడుగు వేయబోయి మరోచోట వేస్తుంటారు. దీంతో జారిపడే గాయాల పాలవుతుంటారు. కాబట్టి మెట్ల దగ్గర మంచి వెలుతురు ఉండేలా చూసుకోవాలి. బద్ధక్కించకుండా లైట్ వేసుకుని మెట్ల మీద నడవాలి. కొన్నిసార్లు మనం వాడే మందులు కూడా మగతకు కారణం అవుతాయి. అవి కూడా ఈ ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. కనుక వైద్యులు మగతగా ఉండని మందులు సిఫార్సు చేయమని కోరాలి. వృద్ధులు ఎప్పటికప్పుడు కంటి పరీక్షలు చేయించుకోవడం కూడా చాలా అవసరం. ఇంట్లో పెంపుడు కుక్కలు, పిల్లలు కూడా చాలాసార్లు దారిలో అడ్డంగా పడుకొని ఉంటాయి. పెద్దవాళ్ళు వీటిని చూడక కాలు తగిలి పడిపోతుంటారు. కాబట్టి పెంపుడు జంతువులకు ఇంట్లో ఏదో ఒక పక్కగా పడుకోవటం అలవాటు చేయాలి అని వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి తెలిపారు.

# బి ఎస్ పి నూతన కమిటీ నీ ఏకగ్రీవంగా ఎన్నిక



**దేవరకద్ర, అమరచింత జూలై 23 (స్కై న్యూస్);** అమరచింత మండల పరిధిలోని నాగల్ కడుమూరు గ్రామంలో బి ఎస్ పి పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రకాష్ మక్తల్ నియోజకవర్గ ఇన్చార్జి అశోక్ కుమార్ ఆత్మకూర్ మండల అధ్యక్షులు గుడిసె శ్రీనివాసులు గార్ల ఆధ్వర్యంలో గత కమిటీని పునరుద్ధరించి గురువారం నూతనంగా కమిటీ ఎన్నుకోవడం జరిగింది. బూత్ కమిటీ అధ్యక్షులుగా ముష్టిపల్లి కురుమన్న బండారి మధు,గౌరవ అధ్యక్షులుగా సప్లయ్ వెంకటేష్ చిట్టి లక్ష్మణ్. కార్యదర్శిగా సుతారి రాజును పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా బి ఎస్ పి పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రకాష్ మక్తల్ నియోజకవర్గ ఇన్చార్జి అశోక్ కుమార్ మాట్లాడుతూ పార్టీలో ఉన్న ప్రతి ఒక్కరు పార్టీ కోసం హార్నిశలు పనిచేయాలని అన్నారు. మక్తల్ నియోజకవర్గం లో బి ఎస్ పి పార్టీ కి పునర్ వైభవం తీసుకురావాలని, చుక్క చుక్క నీటి బొట్టు ఒక్క నదిగా మారను అనే తీరులో పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని అన్నారు.

# ప్రజల భద్రతకే నిఘా నేత్రాలు

**నాగర్ కర్నూల్ జులై 23 (స్కై న్యూస్)** సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు నిర్విరామంగా పోలీసు శాఖ కృషి చేస్తూనే నేరస్థులను గుర్తించి శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకోవడంలో నిఘా నేత్రాల పాత్ర ఎంతో కీలకమని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ అన్నారు గురువారం జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు వారు ప్రారంభించారు సందర్భంగా ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుతూ ఆధునిక సాంకేతికను వినియోగించుకొని పోలీసులు ఎప్పటికప్పుడు నేరస్తులపై నిఘాను ముమ్మరం చేయడంతో పాటు ప్రజలకు భద్రత కల్పించడం జరుగుతుందని అన్నారు. నేరాల నియంత్రణ ట్రాఫిక్ నియంత్రణ తో పాటు ప్రజల ప్రాణాలకు మరియు వారి




ఆస్తుల భద్రతకు పోలీసు శాఖ కృషి చేస్తుందని అన్నారు ఈ కార్యక్రమంలో డిఎస్పి బుర్రి శ్రీనివాస్ యాదవ్ సిఐ అశోక్ రెడ్డి ఎస్సై గోవర్ధన్ మునిసిపల్ చైర్మన్ సునేంద్ర కుమార్ వైస్



చైర్మన్ బాదం రమేష్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జక్కా రాజ్ కుమార్ రెడ్డి తో పాటు పోలీసు సిబ్బంది పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు

## శ్రీ కురుమూర్తి స్వామిని దర్శించుకున్న యూనియన్ బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వర్లు

**చిన్న చింతకుంట జులై 23 (స్కై న్యూస్);** కొలిచిన వారికి కొంగుబంగారమైన శ్రీ కురుమూర్తి స్వామి ని గురువారం చిన్నచింతకుంట మండలం యూనియన్ బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వర్లు శ్రీ కురుమూర్తి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వెంకటయ్య చారి, అర్షకులు మంత్రోచ్ఛరణలతో ఆశీర్వదించారు. యూనియన్ బ్యాంక్ మేనేజర్ ని శ్రీ కురుమూర్తి స్వామి పాలకమండలి చైర్మన్ బత్తుల బాలరాజ్, ఆలయ హర్షకులు ఆలయ ప్రాంగణం లో కూర్చోబెట్టి మంత్రోచ్చారణ చేసి, తీర్థ ప్రసాదములు అందజేసి శాలువాలతో సన్మానించారు. ఆలయ అర్షకులు, సిబ్బంది తోపాటు మేనేజర్ వింటా బ్యాంక్ సిబ్బంది ఉన్నారు.



## కొత్తకోట మండల సర్పంచులతో ముఖాముఖి సమావేశంలో ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి



**దేవరకద్ర, కొత్తకోట జులై 23 (స్కై న్యూస్);** చిన్న చింతకుంట మండలం, దమగ్నాపూర్ గ్రామంలోనీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం కొత్తకోట మండల సర్పంచులతో ముఖాముఖి సమావేశమై, సర్పంచులతో ఆయా గ్రామాల్లో సమస్యలు, ఇటీవల చేపట్టిన పనుల పురోగతిని అడిగి తెలుసుకుని, ప్రతి గ్రామానికి నూతనంగా పనులు మంజూరు చేసి, ప్రొసిడింగ్స్ అందజేసిన దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి. ఈ కార్యక్రమంలో కొత్తకోట మండల పరిధిలోని ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీపై దాడి ప్రజాస్వామ్యానికే ప్రమాదకరం

**మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు**

**వేములవాడలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన**

**రాహుల్ గాంధీపై జరిగిన దాడి ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా అభివర్ణన**

**వేములవాడ జులై 23 స్కై న్యూస్:**కేంద్ర ప్రభుత్వ ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి మద్దతుగా వేములవాడలోని తిప్పాపురం రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ... ఢిల్లీ నిరసన కార్యక్రమంలో రాహుల్ గాంధీపై జరిగిన దాడి రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా అభివర్ణించారు. ప్రజల తరపున ప్రశ్నించే నాయకుడి గొంతును అణిచివేయాలని కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రాహుల్ గాంధీకి పెరుగుతున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకే ఇటువంటి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. రాజ్యాంగం, లౌకిక విలువల పరిరక్షణకు కాంగ్రెస్ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మధు, మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగరం



వెంకటస్వామి, పలువురు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

## మక్తల్ లో గోమాతకు అంత్యక్రియలు నిర్వహించిన బజరంగ్ దళ్

**మక్తల్ జులై 23 ( స్కై న్యూస్ )** నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని శ్రీ మల్లికార్జున దేవాలయంలో అనారోగ్యంతో మృతి చెందిన గోవుకు బజరంగ్ దళ్ కార్యకర్తలు గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. విషయము తెలుసుకున్న కార్యకర్తలు ఆలయానికి చేరుకొని దేవాలయ అర్చకుడు తిప్పయ్య స్వామి ఆధర్యంలో గోమాతను సంప్రదాయ బద్ధంగా తీసుకెళ్లి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. అనంతరం గోమాత సమాధి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీ మల్లికార్జున దేవాలయ అర్చకుడు తిప్పయ్య స్వామి. నారాయణపేట జిల్లా బజరంగ్ దళ్ కో. కన్వీనర్ భీమేష్. ప్రఖండ సహా సయోజక్ మూర్తి. మండల గోరక్ష సంయోజక్ శ్రీను. మల్లయ్య స్వామి. అక్షయ్. నాగరాజు. చక్రి. రాజు. రాము తదితరులు బజరంగ్ దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.



## జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడికి ఘన సన్మానం...

**బాలకృష్ణ రెడ్డిని అభినందించిన ఉట్కూర్ కాంగ్రెస్ నాయకులు**

**ఉట్కూర్ జులై 23 ( స్కై న్యూస్)** నారాయణపేట జిల్లా ఉట్కూర్ మండల నాయకులు నారాయణపేట్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎంపికైన బి కే ఆర్ ఫౌండేషన్ అధినేత బాలకృష్ణారెడ్డిని గురువారం ఉట్కూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూర్య ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు . ఈ సందర్భంగా సూర్యప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ. రాష్ట్ర పాడి పరిశ్రమల. క్రీడలు. యువజన శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి సహకారంతో జిల్లాల్లో కబడ్డీ తో పాటు వివిధ క్రీడాలకు ప్రత్యేక అభివృద్ధి ప్రోత్సహం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బి కే ఆర్ బాలకృష్ణారెడ్డిని పూలమాల శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉట్కూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూర్య ప్రకాష్ రెడ్డి.మల్లెపల్లి సర్పంచ్ కథలప్ప. మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కోరం మహేష్ రెడ్డి. నాయకులు జగదీష్ గౌడ్. భీమా కవి రెడ్డి. తదితరులు పాల్గొన్నారు.



## మొయినాబాద్‌లో కాంగ్రెస్ భారీ నిరసన ధర్నా

**రంగారెడ్డి జిల్లా, జూలై 23 (స్కై న్యూస్):** నీట్ పేపర్ లీకేజీ ఘటనపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ మొయినాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మొయినాబాద్ చౌరస్తా వద్ద భారీ నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, నీట్ పేపర్ లీకేజీ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ, విద్యార్థుల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు.



# ప్రభుత్వ కార్యాలయాలకు ఉర్దూ బోర్డులు ఏర్పాటు చేయాలి

**ఎంపీడీవో ఎస్ఐలకు ఎంఐఎం నాయకుల వినతి పత్రం**

**ఉట్కూరు జూలై 23 ( స్కై న్యూస్ )** నారాయణపేట జిల్లా ఉట్కూర్ ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై తెలుగుతో పాటు ఉర్దూ భాషలో కూడా నమ్మపలకాలు బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతూ ఎంఐఎం మండల అధ్యక్షుడు అబ్దుల్ రెహ్మాన్. పట్టణ అధ్యక్షుడు ఎండి ఇస్మాయిల్ ఆధ్వర్యంలో గురువారం నారాయణపేట జిల్లా ఉట్కూరు మండలం ఎంపీడీవో పావని. ఎస్సై రమేష్ కు వేరువేరుగా వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎంఐఎం నాయకులు మాట్లాడుతూ ఉర్దూ రాష్ట్రంలో గుర్తింపు పొందిన భాషలో ఒకటని. ఉర్దూ మాట్లాడే ప్రజలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఉర్దూ బోర్డులు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు కార్యాలయాలను సులభంగా గుర్తించి ప్రభుత్వ సేవలను మరింత సౌకర్యవంతంగా



పొందగలరని అన్నారు. పోలీస్ స్టేషన్ మండల పరిషత్ కార్యాలయం ప్రభుత్వ ఆసుపత్రి తదితర ప్రభుత్వ భవనాలపై తెలుగు ఆంగ్లభాషలతో పాటు ఉర్దూ భాషలో కూడా నామఫలకాలు ఏర్పాటు చేయాలని వారు కోరారు . భాష వైవిధ్యాన్ని గౌరవిస్తూ ప్రభుత్వం ఈ అంశంపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ వినతిపై ఎంపీడీవో పావని. ఎస్ఐ రమేష్ స్పందిస్తూ వినతి పత్రాన్ని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి సిసికెళ్ళి ప్రభుత్వ నిబంధనాల మేరకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్. పట్టణ అధ్యక్షుడు ఎండి ఇస్మాయిల్. ఎంఐఎం నాయకులు ముజాహిద్ రహిమతుల్లా. జాకీర్ ఖాన్. పారుక్. తదితరులు పాల్గొన్నారు.

# పోచమ్మ తల్లి దేవాలయాన్ని అద్భుతంగా నిర్మిస్తాం..

**: ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**

**పెద్దపల్లి జిల్లా గోదావరిఖని: జూలై 23(స్కై న్యూస్)**పట్టణంలోని మెయిన్ చౌరస్తాలోని పోచమ్మ తల్లి ఆలయాన్ని రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేవాదాయ శాఖ ద్వారా సుమారు రూ.40 లక్షల నిధులతో పోచమ్మ తల్లి దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా, భక్తుల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఆలయ నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, అవసరమైతే అదనపు నిధులు సమకూర్చి పనులను పూర్తి



చేస్తామని స్పష్టం చేశారు.'పోచమ్మ తల్లి ఆలయం ఈ ప్రాంత ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీక. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా ఆధునిక సదుపాయాలతో ఆలయాన్ని అద్భుతంగా నిర్మిస్తాం. నిర్మాణ వ్యయంలో ఎలాంటి వెనుకడుగు వేయం" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.అనంతరం పోచమ్మ తల్లి దేవాలయ నూతన నిర్మాణానికి సంబంధించిన నమూనా చిత్రాన్ని (మోడల్ డిజైన్) ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి, ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్, కార్పోరేషన్ అధ్యక్షుడు బొంతల రాజేష్, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ రాజోలి పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)

**జోగులాంబ గద్వాల, జూలై 23(స్కై న్యూస్):** విద్యార్థులకు మంచి విద్యతో పాటు వారు ఆరోగ్యకరంగా ఉండేందుకు పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. గురువారం రాజోలిలోని కేజీబీవీ పాఠశాలను అయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న విద్యా, వసతి, భోజన సౌకర్యాలను పరిశీలించారు. తరగతి గదులు, వసతి గృహాలు, వంటశాల,



భోజనశాల, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం తదితర అంశాలను సమీక్షించారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించాలని, ఆహార నాణ్యత, పరిశుభ్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యూనిఫామ్ ,బెడ్ షీట్స్ అందజేశారు.ఈ తనిఖీలో పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## శిథిలావస్థలో కిషన్‌నగర్ ప్రభుత్వ పాఠశాల భవనం

**రంగారెడ్డి జిల్లా, జూలై 23 (స్కై న్యూస్):** కిషన్‌నగర్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో విద్యార్థుల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. నూతన పాఠశాల భవనం నిర్మించాలని గ్రామస్తులు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో రూ.49 లక్షలు మంజూరైనప్పటికీ పనులు చేపట్టలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి విద్యార్థులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



# నకిలీ డి ఏ పి విక్రదారులపై పిడి యాక్ట్ నమోదు చేయాలి

ప్రజల పక్షమో చంద్రబాబు పక్షమా ఎమ్మెల్యేలు మంత్రులు తేల్చుకోవాలి.
రైతులపై రాజకీయం చేయొద్దు.
ద్రోహులను కాపాడడమే ప్రజాపాలననా.
కలెక్టర్ కార్యాలయం ఎదుట వంటావార్పు చేపడతాం.
మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి.




**నాగర్ కర్నూల్ జులై 23( స్కై న్యూస్)** కొరతను సృష్టించి అవినీతి అక్రమాలకు పాల్పడడమే కాంగ్రెస్ నైజం అని నియోజకవర్గంలో నకిలీ డి ఏ పి విక్రయించి రైతులను మోసం చేసిన వారిపై పిడి యాక్ట్ నమోదు చేయాలని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి డిమాండ్ చేశారు గురువారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాస గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల స్థానిక ఎమ్మెల్యే రైతులను మోసం చేస్తే సొంత పార్టీ వారైనా అరెస్టు చేయాలని ప్రకటించారు కానీ నిత్యం వారి వెంట ఉండే వారి అనుచరులు రైతులను మోసం చేసే విధంగా నకిలీ డి ఏ పి నీ తరలించి విక్రయించిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. ఎమ్మెల్యే ఎమ్మెల్సీలు దేశ్ ముక్ లని వారు చెప్పేది ఒకటి చేసేది ఒకటి అని మండిపడ్డారు. ఒక్క బస్తా పై 1400కు పైగా లాభాన్ని ఆర్జించి రైతులను మోసం చేశారని నకిలీ వ్యాపారులను ఎవరు కాపాడుతున్నారని ప్రశ్నించారు. సంఘటన వెలుగులోనికి వచ్చి కుమారు 25 రోజులు అవుతున్న ఎందుకు వారిపై చర్యలు తీసుకోవడం లేదని స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెల్సీలు పోలీసులపై ఒత్తిడి తీసుకురావడం వల్లే వారిని అరెస్టు చేయడం లేదని పిడి యాక్ట్ నమోదు కాలేదని ఆరోపించారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలలో కోట్లాది రూపాయలు అవినీతి జరిగిందని ఆధారాలతో సహా కలెక్టర్ మరియు ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసిన ఎందుకు వారిపై చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రతి గన్ని బ్యాగుకు 22 రూపాయలు చెల్లించాలని రైతుల నుండి మాత్రం 35 నుండి 50 రూపాయలు వసూలు చేశారని వాటిలో కూడా చాలామంది రైతులకు గన్ని బ్యాగుల డబ్బులు ఇవ్వలేదని అదేవిధంగా ట్రాన్స్ పోర్ట్ డబ్బులు కూడా రైతులకు చెల్లించలేదని హమాలి డబ్బులు కూడా రైతుల ఖాతాలో జమ చేయలేదని ఈ డబ్బులు ఎవరి ఖాతాలో జమ అయ్యాయో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు వీటిలో వ్యవసాయ అధికారులకు ఎంత ఎమ్మెల్యేకు ఎంత మార్కెట్ కమిటీ చైర్మన్ కు ఎంత ముట్టిందో అర్థం చేయాలని అన్నారు. రైతులతో రాజకీయం చేయొద్దని కోరారు ప్రస్తుత ఎమ్మెల్యేకు మూడు సంవత్సరాలు అవకాశం ఇచ్చామని ఆయన పాలనలో సమస్యలను పరిష్కరించడంతో పూర్తిగా విఫలం చెందారని వెంటనే తాను చేసిన ఆరోపణలను పరిష్కరించకపోతే కలెక్టర్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి వంటావార్పు చేపడతామని హెచ్చరించారు ద్రోహులను కాపాడడమే ప్రజా పాలననా అని నిలదీశారు. ప్రజాక్షేత్రంలో ఎమ్మెల్యే ఎమ్మెల్సీ క్షమాపణ చెప్పి రైతుల డబ్బులు వారికి ఇప్పించాలని కోరారు. కృష్ణ ట్రిబ్యునల్ ఆంధ్ర ప్రదేశ్ 80% నీటిని తెలంగాణ 20% నీటిని మాత్రమే వినియోగించుకున్నారని నివేదిక అందించారని మరి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నుండి గెలిచిన పదిమంది ఎమ్మెల్యేలు ఇద్దరు మంత్రులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రైతులకు న్యాయం చేసేందుకు మంత్రులు తమ పదవులకు రాజీనామా చేస్తే వచ్చే తమ ప్రభుత్వంలో వారికి మంత్రి పదవులు ఇప్పించే బాధ్యత తీసుకుంటానని అన్నారు. ఫిబ్రవరి మాసంలో శ్రీశైలంలో 100 టీఎంసీలకు పైగా నీరు నిల్వ ఉండదని అప్పుడే కల్వకుర్తి ఎత్తిపోతలకు మరియు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 50 టిఎంసీల నీటిని సరఫరా చేసుకున్న నేడు పంటలకు సాగునీరు అందలేదని ముందుచూపు లేకపోవడం వల్లే నేడు దుర్భర పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు ప్రజల పక్షమో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొమ్ముకాసే చంద్రబాబు పక్షమో తేల్చుకోవాలన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే సాగునీరు తాగునీరు వ్యవసాయం వైద్య రంగాలపై సమీక్ష చేయడం లేదని దీనివల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ హనుమంతరావు మాజీ జడ్పిటిసి శ్రీశైలం బిజినేపల్లి మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటయ్య నాయకులు మాధవరెడ్డి మన్యపు రెడ్డి పులేందర్ రెడ్డి తోపాటు పలువురు పాల్గొన్నారు

# ఓటు హక్కుపై సిపిఐ విస్తృత ప్రచారం

ఎస్ఐఆర్ ప్రక్రియపై గడపగడపకూ అవగాహన
ఓటర్ జాబితా సవరణపై సిపిఐ ఆటో ప్రచారం
ఎస్ఐఆర్ ఫారం అందించకుంటే జరిగే నష్టంపై అవగాహన
ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం : ఎస్ కె సాబీర్ పాషా




**కొత్తగూడెం జూలై 23( స్కై న్యూస్) :** ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి ఆధ్వర్యంలో విస్తృత ప్రచార కార్యక్రమం చేపట్టినట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా తెలిపారు. కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ప్రధాన బస్తీలు, గ్రామాల్లో ఐదు ప్రచార ఆటోల ద్వారా ఈ మైకు ప్రచారాన్ని రెండో రోజైన గురువారం అయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, ఓటర్ల నమోదు ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్తులో హక్కును కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఎన్యుమరేషన్ ఫారాలను సరైన వివరాలతో నింపి తిరిగి ఎన్నికల అధికారులకు అందించే బాధ్యతను ప్రతి పౌరుడు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఫారాలను సరిగా సమర్పించకుంటే ఎదురయ్యే నష్టాలను, ప్రక్రియ షెడ్యూల్ విశేషాలను మైకుల ద్వారా వీధి వీధినా ప్రజలకు వివరిస్తున్నట్లు తెలిపారు. ఓటు హక్కు పరిరక్షణే లక్ష్యంగా పార్టీ పనిచేస్తుందన్నారు. స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రాతినిధ్యంలో నియోజకవర్గంలో అన్ని రంగాల్లోనూ శీఘ్రగతిన అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. రోడ్లు, డ్రెయిన్లు, వంతెనల నిర్మాణం, సంక్షేమ పథకాలు, నిధుల సేకరణ ద్వారా నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి జరుగుతోందన్నారు. అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలంటే ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యం, ఓటు హక్కు నమోదు అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రత్యేక సవరణ ప్రక్రియ పూర్తయ్యే వరకు నియోజకవర్గ వ్యాప్తంగా తమ పార్టీ ప్రచారాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## ఏపీకే ఫైల్స్, తెలియని వెబ్సైట్లతో జాగ్రత్తగా ఉండాలి...




జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత

**నారాయణపేట జూలై 23: (స్కైన్యూస్)**ప్రస్తుత సమాజంలో సైబర్ నేరగాళ్లు నూతన పద్ధతులను ఉపయోగించి ప్రజలను మోసగిస్తున్న సందర్భంలోనారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ప్రజలందరికీ అవగాహన, అప్రమత్తతతోనే సైబర్ నేరాలను అడ్డుకోగలమని ఒక ప్రకటన తెలియజే శారు. ప్రస్తుతం సమాజంలో ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్లు, స్టాక్ మార్కెటింగ్ అంటూ లాభాలు చూపిస్తామంటూ ప్రైవేటు వ్యక్తులు చేస్తున్న మోసాలు సామాన్య ప్రజలకు తెలియాలని అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అదేవిధంగా వాట్సాప్ నందు టెలిగ్రామ్ నందు సోషల్ మీడియాలలో ఏపీకే ఫైల్స్ రావడం వాటి ద్వారా మొబైల్ కంట్రోల్ సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లడం లాంటి సంభవిస్తుందని వాటిని అడ్డుకోవడానికి అప్రమత్తత ప్రధానాస్త్రంగా ఉంటుందని తెలిపారు. ఒకవేళ మోసగాళ్ల చేత మోసపోయినట్లయితే వెంటనే (గోల్డెన్ హవర్) లో జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కి లేదా సైబర్ క్రైమ్ వెబ్సైట్ నందు ఫిర్యాదు చేయడం మొదటి కర్తవ్యం గా వ్యవహరిస్తుందని తెలిపారు. ముఖ్యంగా సైబర్ క్రైమ్ నేరస్తులు వినియోగిస్తున్న నూతన పద్ధతులు ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, లోన్ ఫ్రాడ్, యూపీఐ ఫ్రాడ్, ఏపీకే ఫైల్స్, నకిలీ వెబ్సైట్లు, స్టాక్ మార్కెట్ ఫ్రాడ్ లాంటిది జరుగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ ముఖ్యంగా యువత మాయమాటలకు నమ్మి మోసపోకుండా ఉండాలని తెలిపారు. సైబర్ క్రైమ్ నేరగాళ్లు వినియోగిస్తున్న పద్ధతిని తెలియజేస్తూ ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్లు ముఖ్యంగా డబ్బులను వారి సొంత వెబ్సైట్ ల నందు ఇన్వెస్ట్మెంట్ చేసిన దానికన్నా ఎక్కువగా చూపిస్తారని ఒకవేళ డబ్బులను తీయాలి అనుకుంటే రాకుండా ఉంటాయని తెలియచేశారు.జిల్లా పరిధిలో ప్రజలకు సైబర్ నేరాల పైన విస్తృతంగా అవగాహన కార్యక్రమలు నిర్వహించాలని పోలీసు అధికారులకు ఎస్పీ తెలిపారు.

# పాస్ ఒక లెక్క.. టికెట్ మరో లెక్క!

- జర్నలిస్టుల ప్రయాణ రాయితీలో గందరగోళం
- టిమ్ మిషన్లలో సాఫ్ట్వేర్ లోపాలతో అదనపు చార్జీలు
- ఎక్స్ప్రెస్, ఎలక్ట్రిక్ బస్సుల్లో మరింత భారం
- సమస్యను పరిష్కరించాలని ఆర్టీసీ అధికారులకు వినతి



**నారాయణపేట జులై 23(స్కైన్యూస్ ):**జర్నలిస్టులకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రయాణ రాయితీ అమలులో గందరగోళం నెలకొంటోందని టీయూడబ్ల్యూజే హెచ్--143 నాయకులు ఆరోపించారు. పాస్‌పై 1/3 రాయితీ ఉన్నప్పటికీ.. టికెట్ జారీ సమయంలో టిమ్ మిషన్లలో సక్రమంగా రాయితీ వర్తించకపోవడంతో అదనపు చార్జీలు చెల్లించాల్సి వస్తోందని టీయూడబ్ల్యూజే హెచ్--143 జిల్లా అధ్యక్షుడు కలాల్ ఆనంద్‌కుమార్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు వారధి నవీన్‌కుమార్, టెంజు జిల్లా అధ్యక్షుడు అవుటి రాజశేఖర్ అన్నారు. జర్నలిస్టులకు కల్పిస్తున్న 1/3 ప్రయాణ రాయితీని అన్ని బస్సు సర్వీసుల్లో సక్రమంగా అమలు చేయాలని -- టికెట్ మిషన్లలో సాఫ్ట్‌వేర్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ యూనియన్ ఆఫ్‌వర్కింగ్ జర్నలిస్ట్ హెచ్ 143 ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆర్టీసీ డిపోలో డిప్యూటీ ఆర్‌ఎం జగన్, డీఎం రాంమోహన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జర్నలిస్టు పాస్‌పై మూడో వంతు (1/3) ప్రయాణ రాయితీ ఉన్నప్పటికీ.. టికెట్ మిషన్లలో నమోదైన సాఫ్ట్‌వేర్ లెక్కల కారణంగా పూర్తి స్థాయిలో రాయితీ అమలు కావడం లేదని నాయకులు తెలిపారు. పాస్‌పై ఉన్న రాయితీకి, టికెట్‌పై వసూలు చేస్తున్న చార్జీకి వ్యత్యాసం ఉండటంతో జర్నలిస్టులపై అదనపు ఆర్థిక భారం పడుతోందన్నారు.

**కండక్టర్లకు.. సాఫ్ట్‌వేర్ సమస్య!**

రాయితీపై జర్నలిస్టులు ప్రశ్నిస్తే టిమ్ మిషన్‌లో సాఫ్ట్‌వేర్ ఎలా ఉంటే దాని ప్రకారమే టికెట్ జారీ చేయాల్సి వస్తోందని కండక్టర్లు చెబుతున్నారని పేర్కొన్నారు. దీంతో రాయితీ విషయంలో జర్నలిస్టులు, కండక్టర్ల మధ్య తరచూ వాగ్వాదాలు జరుగుతున్నాయని తెలిపారు.

**ఎక్స్‌ప్రెస్.. ఎలక్ట్రిక్ సర్వీసుల్లో భారం**

గ్రామీణ ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రాలు, పట్టణాలు, నగరాలకు వార్తల సేకరణ కోసం నిత్యం ప్రయాణించే జర్నలిస్టులకు ఎక్స్‌ప్రెస్, ఎలక్ట్రిక్ తదితర సర్వీసుల్లో అదనపు చార్జీలు మరింత భారంగా మారుతున్నాయని అన్నారు. అన్ని అర్హత కలిగిన బస్సు సర్వీసుల్లోనూ 1/3 ప్రయాణ రాయితీని నిబంధనల ప్రకారం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించాలి టిమ్ మిషన్లలోని సాఫ్ట్‌వేర్ లోపాలను వెంటనే సరిచేయడంతోపాటు.. జర్నలిస్టుల రాయితీపై కండక్టర్లకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం, ఆర్టీసీ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అనంతరాము, డి.నారాయణ, వినోద్, శ్రీధర్‌రావు, రమేష్‌గౌడ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా టీజేఏ 12వ వార్షికోత్సవ వేడుకలు..



**కల్వకుర్తి జులై 23 ( స్కై న్యూస్)** తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఎజేూ 12వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డా. శివరాం తో కలిసిరోగులకు పండ్లు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ జర్నలిస్టు ప్రహ్లాద్, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు దస్తగిరి హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.జర్నలిజం అనేది కేవలం వార్తలు రాయడం మాత్రమే కాదని సమాజానికి నిజాలను చేరవేయడం ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషించడం జర్నలిస్టుల బాధ్యత అని అన్నారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డులు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఇండ్ల స్థలాలు, వచ్చేవరకు టీ.జే.ఏ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టనున్నామని జర్నలిస్టుల సంక్షేమమే టీ.జే.ఏ ప్రధాన లక్ష్యం మన్నారు. అనంతరం సీనియర్ జర్నలిస్టు ప్రహ్లాద్, టీజేఏ జిల్లా నాయకులు అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు దస్తగిరికి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కంచర్ల శ్యాంసుందర్ శ్రీనివాస్ రెడ్డి విజయేందర్ రెడ్డి యూసఫ్ బాబా తస్లీమ్ హబీబ్ గణేష్ బాలరాజ్ ప్రసాద్ బాలచందర్ కె దామోదర్ గిరి బాలకృష్ణ హేమంత్ పాండు హుస్సేన్ మనీ తదితరులు పాల్గొన్నారు.




## పెండింగ్ డియోలు వెంటనే విడుదల చేయాలి



**ఉట్కూరు జులై 23( స్కై న్యూస్)** నారాయణపేట జిల్లా ఉట్కూర్ నియోజకవర్గం లో తపస్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వము వెంటనే పిఆర్సి ని ప్రకటించి పెండింగ్లో ఉన్న డి ఏ లను విడుదల చేయాలని తపస్ నాయకులు డిమాండ్ చేశారు. నారాయణపేట జిల్లా ఉట్కూరు మండలంలోని ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో గురువారం మధ్యాహ్నం భోజనం విరామ సమయంలో ఆగస్టు 1న హైదరాబాద్లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న రాష్ట్ర ధర్నా పోస్టర్ ను మండల విద్యాధికారి మాధవి. ప్రధానోపాధ్యాయులు కుసుమ. మండల గౌరవ అధ్యక్షుడు రామచంద్రయ్య. మండల అధ్యక్షుడు కృష్ణ. కార్యదర్శి గోపాల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తపస్ నాయకులు మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికైనా పిఆర్సిని ప్రకటించి. పెండింగ్ డిఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం ఆగస్టు 1న ఇందిరా పార్క్ వద్ద జరిగే రాష్ట్రస్థాయి ధర్నాకు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తపస్ నాయకులు జిల్లా మండల నాయకులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు విలేజ్ ఆర్గనైజేషన్ భవనాలు



**జోగులాంబ గద్వాల, జూలై 23(స్కై న్యూస్):**మహిళల ఆర్థిక సాధికారత, స్వయం సహాయక సంఘాల బలోపేతానికి విలేజ్ ఆర్గనైజేషన్ భవనాలు కీలకమని బి.నర్సింగ రావు అన్నారు. గురువారం వడ్డేపల్లి మండలంలోని బుడమర్సు గ్రామంలో నూతనంగా నిర్మాణం పూర్తయిన విలేజ్ ఆర్గనైజేషన్ భవనాన్ని అదనపు కలెక్టర్ పరిశీలించారు.జిల్లాలోనే మొట్టమొదటిగా పూర్తయిన భవనాన్ని సందర్శించిన ఆయన భవన నిర్మాణ నాణ్యత,మౌలిక వసతులు, సమావేశ మందిరం,ఇతర సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, స్వయం సహాయక మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని,గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబన, నాయకత్వ వికాసం, సంఘాల సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, పొదుపు--రుణాల నిర్వహణ, జీవనోపాధి కార్యకలాపాల ప్రణాళిక తదితర కార్యక్రమాలకు ఈ విలేజ్ ఆర్గనైజేషన్ భవనం కేంద్రంగా ఉపయోగపడాలని అన్నారు.భవనాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, సక్రమంగా నిర్వహిస్తూ ప్రభుత్వ ఆస్తిగా సంరక్షించాలని, మహిళా సంఘాల సభ్యులు భవనాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకొని గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు.భవన నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, గ్రామ పంచాయతీ ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల పరిరక్షణ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక...




**నాగర్ కర్నూల్ జులై 23( స్కై న్యూస్)** జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల గ్రౌండ్ ఆవరణలో బుధవారం నాడు జిల్లా అధ్యక్షులు నారం దాస్ శ్రీశైలం ఆధ్వర్యంలో నాగర్ కర్నూలు మండల దివ్యాంగుల పరిరక్షణ సమితి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల దివ్యాంగుల అధ్యక్షులుగా సేరి కాశన్న, ఉపాధ్యక్షులుగా డి.రామస్వామి, ప్రధాన కార్యదర్శిగాఏ. రామకృష్ణ, కోశాధికారిగా బోనాసి నాగరాజు, గౌరవ అధ్యక్షులుగా కేశముని కృష్ణయ్య, కార్యవర్గ సభ్యులుగా ఆంజనేయులు,అశోక్, జాంగిర్, బాల్ రాజు,సాదిక్,రాజు లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కమిటీ నాగర్కర్నూల్ మండలంలోని దివ్యాంగుల సమస్యలు పరిష్కార దిశగా పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ మంతటి శేఖర్, హనుమంతు, మల్లయ్య, కర్ణాకర్ రెడ్డి, భారతి తదితరులు పాల్గొన్నారు.

# చత్రపతి శివాజీ మహారాజ్ స్మృతి వనం నిర్మాణానికి నా వంతు కృషి చేస్తా

జిల్లా గ్రంథాలయ చైర్మన్ వార్ల విజయకుమార్



**నారాయణపేట జూలై 23 (స్కైన్యూస్)** నారాయణపేట జిల్లా చరిత్రలో నిలిచిపోయేలా జిల్లా కేంద్రంలోని ఎర్రగుట్ట వద్ద ఛత్రపతి శివాజీ మహారాజ్ స్మృతి వనం నిర్మాణానికి ఇక్కడి యువత... ఆయా సంఘాల పెద్దలు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు చత్రపతి శివాజీ మహారాజ్ చరిత్రను కనులకు కట్టేలా నిర్మాణ పనులు ప్రారంభించారు. కాగ గురువారం చత్రపతి శివాజీ మహారాజ్ స్మృతి వనం నిర్మాణ పనులను జిల్లా గ్రంథాలయ చైర్మన్ వార్ల విజయ్ కుమార్ నిర్మాణ కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. నిర్మాణానికి సంబంధించిన ప్లానింగ్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కౌన్సిలర్ యు. మహేష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు వెంకటేష్ గౌడ్, పళ్ళ రఘు, గోపి కృష్ణ, నవీన్ తదితరులు ఉన్నారు.

వార్తాతరంగాలు

శుక్రవారం 24 జూలై 2026

## శ్రీ కురుమూర్తి స్వామి తొలి ఏకాదశి, లక్ష పుష్పార్చన పై అర్చకులతో చైర్మన్ సమీక్ష



**చిన్న చింతకుంట జులై 23 (స్కై న్యూస్);** పేదల తిరుపతిగా విరజిల్లుతున్న శ్రీ కురుమూర్తి స్వామి చిన్న చింతకుంట మండల పరిధిలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలో ఏడుకొండల మధ్య కాంచన గుహలో స్వయంభుగా వెలసిన దేవస్థానంలో ఈనెల 25 జూలై 20 26 శనివారం రోజున ఉదయం స్వామివారి దేవాలయంలో తొలి ఏకాదశి సందర్భంగా స్వామివారికి లక్ష పుష్పార్చన జరుగుతుంది. ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి ఆదేశానుసారంగా గురువారం ఆలయ ప్రాంగణంలో ఆలయ ప్రధాన హార్షకులు వెంకటయ్య చారి, ఆలయ హార్షకులతో పూజా కార్యక్రమాల గురించి ఆలయ పాలకమండలి చైర్మన్ బత్తుల బాలరాజ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు. కాబట్టి ఆలయ సిబ్బంది, పాలకమండలి సభ్యులు, స్వామి భక్తులకు ఎవరికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగ్గ జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

## సింగరేణి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి....



**పెద్దపల్లి జిల్లా గోదావరిఖని జూలై 23(స్కై న్యూస్)**సింగరేణి అధికారులతో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సమీక్ష సమావేశం రామగుండం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం సింగరేణి అధికారులతో రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గోదావరిఖని చౌరస్తాలో సింగరేణి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం వర్షాకాలం కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి, సంబంధిత ప్రాంతాల్లో రహదారులను వెంటనే అభివృద్ధి చేయాలని ఆదేశించారు. అలాగే సింగరేణి ఖాళీ క్వార్టర్ల పరిసరాల్లో పెరిగిపోయిన చెట్లు, పొదలను తొలగించి పరిశుభ్రత చర్యలు చేపట్టాలని సూచించారు. ఖాళీ క్వార్టర్లు అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రాలుగా మారకుండా తగిన చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజలకు సురక్షితమైన వాతావరణం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ సింగరేణి పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్జీ-1 జనరల్ మేనేజర్ లలిత్ కుమార్ తో పాటు సింగరేణి వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులతో చర్చలకు కేంద్రం పిలుపు



**హైద్రాబాద్ జులై 23 ;**నీట్ లీకేజీపై ఢిల్లీలో ఆందోళనలు తీవ్రరూపం దాల్చుతున్న నేపథ్యంలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ కీలక ప్రకటన చేశారు. జబ్లీ నేతలు, విద్యార్థులను మరోసారి చర్చలకు ఆహ్వానించారు. 'మీకు అనుకూల సమయంలో చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇప్పటికే మేం 4 ప్రతిపాదనలు పంపాం. చర్చల్లో నేను, జీ నడ్డా పాల్గొంటాం' అని తెలిపారు. జంతర్మంతర్ లేదా మరో తటస్థ ప్రదేశంలో చర్చలకు రావాలని నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు.

## సీఎం సహాయనిది ద్వారా3 లక్షల ఎల్ఓసి బాలప్పకు అందజేసిన ఎమ్మెల్యే జి, మధుసూదన్ రెడ్డి



**చిన్న చింతకుంట జులై 23 (స్కై న్యూస్);** చిన్న చింతకుంట మండలం లాల్ కోట గ్రామానికి చెందిన కంద్రు బాలప్ప నిమ్స్ ఆస్పత్రిలో కిడ్నీ సంబంధిత చికిత్స పొందుతున్నారు. అతని వైద్యం నిమిత్తం గురువారం హైదరాబాద్ లో నిమ్స్ ఆస్పత్రికి సీఎం సహాయ నిధి ద్వారా 3,00,000 రూపాయల ఎల్ ఓ సి నీ ఆయన బంధువులకు అందజేసిన ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి.

## ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

కలెక్టర్ ప్రియాంక

**నారాయణపేట జూలై 23: (స్కైన్యూస్)**ఎల్ నినో వాతావరణ పరిస్థితులలో రైతులు వ్యవసాయ ప్రత్యామ్నాయ పంటల సాగు పై అవగా హన కలిగి ఉండాలని ఆమేరకు పంటలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక అన్నారు.గురువారం నారాయణపేట జిల్లా కేంద్రం స్కిల్ డెవల ప్మెంట్ సెంటర్ లో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఎల్ నినో వాతావరణ పరిస్థితులపై రైతులకు అవగాహన కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ ద్వారా తయారు చేయబడ్డ ఎల్ నినో నేపథ్యంలో పంటల ప్రణాళికలు పుస్తకాన్నీ ఆవిష్కరించడం జరిగింది. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం ఎల్ నినో ప్రభావం కారణంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం, అధిక ఉష్ణోగ్రతలు, వర్షాల పంపిణీలో అసమానతలు ఏర్పడే అవకాశం ఉందనీ. ఈ పరిస్థితుల్లో ప్రతి రైతు ముందస్తు ప్రణాళికతో వ్యవసాయం చేపట్టడం అవసరం అన్నారు.

**రైతులకు సూచనలు:**

వాతావరణ శాఖ విడుదల చేసే అంచనాలను ఎప్పటికప్పుడు గమనించి వ్యవసాయ పనులను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని తెలిపారు. ఆలస్యంగా వర్షాలు వచ్చినట్లయితే తక్కువ కాలవ్యవధి గల మరియు కరువు తట్టుకునే పంట రకాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలియచేయడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా కలెక్టర్ కి రైతులు తెలియచేయడం జరిగింది. వారి సమస్యలు విని, సమస్యలు పరిష్కరిస్తాం అని రైతులకు తెలియచేయడం జరిగింది.రైతు శాస్త్రవేత్త డాక్టర్ సత్య నారాయణ మాట్లాడుతూ వివిధ పంటలలో సస్య రక్షణ చర్యల గురించి, అలాగే ఎల్ నినో వాతావరణ పరిస్థితుల్లో రైతులు చెప్పల్సిన చర్యల గురించి, నానో యూరియా నానో డి ఏ పి వాడకం గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నారాయణపేట మార్కెట్ చైర్మన్ సదాశివరెడ్డి, , జిల్లా వ్యవసాయ అధికారి సక్రియా నాయక్, ఉద్యాన శాఖ అధికారి సాయిబాబా, శాస్త్రవేత్తలు ,గ్రోమోర్ అధికారి ఇతర అధికారులు, రైతులు మరియు గ్రోమోర్ కంపెనీ వారు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి..

హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు

**రంగారెడ్డి జిల్లా, జూలై 23 (స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా ఫరూక్నగర్ మండల ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీడీవో శ్రీకాంత్ అధ్యక్షతన వర్షాకాల అత్యవసర ప్రణాళికపై మండల సర్పంచులు, డిప్యూటీ సర్పంచులు, విలేజ్ సెక్రటరీలు, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు)తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు వర్షాకాలంలో ఆరోగ్య సంరక్షణ, పరిసరాల పరిశుభ్రత, పోషకాహారం, సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆయన సూచించారు. ఇంటి ముందు, వెనుక, పక్కన మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, నిల్వ నీటిలో దోమలు, ఈగలు పెరిగి మలేరియా, డెంగీ, చికున్గున్యా, ఫైలేరియా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా డెంగీ, మలేరియా తీవ్రరూపం దాల్చితే



ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు. వర్షాకాలంలో జలుబు, దగ్గు, జ్వరాలు రాకుండా ఉండేందుకు గోరువెచ్చని నీటిని తాగాలని, ఆహారంలో తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పాలు, పెరుగు, గుడ్లు వంటి పోషకాహారం తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. సమతుల్య పోషకాహారం తీసుకోవడం వల్ల



శరీరంలో వ్యాధి నిరోధక శక్తి పెరిగి సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని వివరించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శ్రీకాంత్, వ్యవసాయ అధికారి నిశాంత్ కుమార్, హెచ్ఓ, ఏపీఓ, డీఈ, ఏఈ, ఏపీఎం జంగయ్యతో పాటు ఫరూక్నగర్ మండల సర్పంచులు, డిప్యూటీ సర్పంచులు, విలేజ్ సెక్రటరీలు, ఏఈఓలు పాల్గొన్నారు.

## వర్షపు నీటి నిలువ పట్ల విద్యార్థులకు అవగాహన

**జడ్చర్ల, జులై 23(స్కైన్యూస్ ):**స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆధ్వర్యంలో గురువారం ఉదయ మెమోరియల్ హైస్కూల్లో వర్షపు నీరు స్టోరేజ్ గురించి విద్యార్థులకు ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కమిషనర్ వీ. గిరీష్ , మున్సిపల్ వార్డు ఆఫీసర్లు అశోక్ జుజు, కృష్ణయ్య. శివ శంకర్ శానిటేషన్ ఇన్స్పెక్టర్ పాఠశాల కరస్పాండెంట్ వీణ, శివకుమరూ, మున్సిపల్ సిబ్బంది పాల్గొనడం జరిగినది, వర్షం నీరు ప్రతి ఒక్కరం ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకొని నీటిని నిలువచేసే విధానాన్ని అందరం



పాటించాలని తెలియ చేయడం జరిగినదిలి





# నియంతృత్వానికి యువత అడ్డుకట్ట!

నీట్ పేపర్ లీక్కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని ఢిల్లీలో యువత సాగిస్తున్న ఆందోళనలపై పోలీసులు విరుచుకుపడి లాఠీచార్జి చేశారు. దీనికి సంబంధించి యూట్యూబ్ చానల్స్ చూస్తుంటే జంతర్ మంతర్ వద్ద 20 ఏండ్ల యువతి ఒక్క నిమిషం మాట్లాడిన మాటలు వింటే మనం ప్రజాస్వామ్య దేశంలోనే ఉన్నామా? అనిపించింది. కన్నీళ్లు ఉబికి వస్తుండడంతో ఆ యువతి మాటలు అస్పష్టంగా వచ్చాయి. 'పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాను. ఈ రోజు వీళ్లను పోలీసులు కొట్టడాన్ని చూశాక..నా నిర్ణయాన్ని మార్చుకున్నాను. నేను పోలీసునై ఉంటే వీళ్లలాగానే కొట్టాలి కదా? వీళ్లు చేసిన పాపం ఏమిటి? నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహించాలని కోరడమే పాపమా? అంతలా లాఠీలతో కొడతారా? అంటూ ఆ యువతి కన్నీళ్లు పెట్టుకున్నది. నీట్ పేపర్ పదే పదే లీకవుతున్నా కేంద్ర ప్రభుత్వానికి బాధ్యత లేదా? ప్రశ్నిస్తే నేరమా? ఇందిరాగాంధీ హయాంలో విధించిన 'ఎమర్జెన్సీ' గురించి పదే పదే ఉపన్యాసాలు ఇచ్చే కేంద్రంలోని బీజేపీ పాలకులు అంతకుమించిన నియంతృత్వంతో వ్యవహరిస్తున్నారు. ప్రజలకు పూచికపుల్ల కూడా విలువ ఇవ్వాల్సిన అవసరం లేదని భావిస్తున్నారు. మనకు ఏదైతే అందుబాటులో ఉంటుందో దాని విలువ మనకు తెలియదు. స్వేచ్ఛ కోల్పోయే వరకు స్వేచ్ఛ విలువ తెలియదు. దేశంలోని పలు రాష్ట్రాల్లో పరిస్థితులు చూస్తుంటే మెల్లగా నియంతృత్వానికి స్వాగతం పలుకుతున్నామని అనిపిస్తున్నది. నీట్ పేపర్ లీక్ను తట్టుకోలేక విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నా పాలకులకు పట్టడం లేదు. ఢిల్లీలో యువత మూడు వారాల నుంచి ఆందోళన చేస్తుంటే లాఠీఛార్జితోపాటు టియర్ గ్యాస్తో తీవ్రంగా హింసిస్తున్నారు. కానీ కోట్ల రూపాయల కుంభకోణం నీట్ లీకేజీకి బాధ్యత ఎవరూ తీసుకోవడం లేదు.

నీట్ పేపర్ లీకేజీ మొదటిసారి కాదు..ఇదొక ఆనవాయితీగా మారింది. ఇందులో కోట్లాది రూపాయలు చేతులు మారుతున్నాయి. కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేసినంత మాత్రాన నీట్ పేపర్ లీకేజీ ఆగిపోతుందని కాదు. కానీ లీకేజీకి అమాత్యవర్యులు బాధ్యత వహించాలి కదా!

దేశంలో మోదీ ఏకస్వామ్య పాలన సాగిస్తుంటే ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పాలకులు అదే మార్గంలో వెళ్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నీటిని వాడుకోవాలి, రైతులను ఆదుకోవాలి అని రిటైర్డ్ ఇంజినీర్లు చెప్పడమే పాపం.. వారిని జైలు పాల్జేస్తాను, బెల్ట్ చికిత్స చేస్తాను అని స్వయంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి అంటున్నారు. ఇలాంటి నియంతృత్వ వ్యాఖ్యలు గతంలో ఏ పాలకుడి నోటి నుంచి వినలేదు. తెలంగాణ సీఎంలా నోటిదురుసు ఆంధ్రా సీఎం చంద్రబాబుకు అస్సలు లేదు. కానీ మాట్లాడకుండానే ఆయన నియంతృత్వాన్ని అమలుచేస్తారు. ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడిన మాటలనే ఒక యూట్యూబర్ ఇమిటేట్ చేస్తూ మాట్లాడగా అతనిపై వందల్లో కేసులు పెట్టారు. నాలుగుసార్లు బెయిల్ లభిస్తే ఐదవసారి ఉప కేసు పెట్టి



మళ్లీ అరెస్ట్ చేశారు. మీడియా పార్టీల వారిగా బాధ్యతలు నిర్వహిస్తుంటే..యూట్యూబ్ చానల్స్తో పాలకులకు కంటగింపుగా మారింది. దానితో యూట్యూబ్ వారిని అరెస్టులు చేయిస్తూ అసంతృప్తి స్వరాలను అణచివేసే ప్రయత్నం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ ధోరణి చూసి రాష్ట్రాలు సైతం అదే మార్గంలో పయనిస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు ప్రజలకు బాధ్యత వహించాలి. కానీ మనం క్రమంగా నియంతృత్వానికి స్వాగతం పలుకుతున్నామని అనిపిస్తున్నది. ఒకసారి అధికారంలోకి వచ్చామంటే ఇక తాము ఎవరికీ సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్నట్టుగా కొందరు పాలకులు వ్యవహరిస్తున్నారు.

నీట్ పేపర్ లీకేజీపై ఢిల్లీలో యువత ఉద్యమిస్తుంటే 'చైనా కుట్ర' అని ప్రచారం చేసే స్థాయికి నాయకులు చేరారంటే నీట్ పేపర్ లీక్ చేసింది చైనానా? చైనా లీక్ చేస్తుంటే మన వ్యవస్థలు ఏం చేస్తున్నట్టు? ఎవరైనా ప్రభుత్వాన్ని తప్పుపడితే పాకిస్థాన్ ఏజెంట్ అంటున్నారు. ఉద్యమిస్తే చైనా కుట్రనట. రైలు ప్రమాదం జరిగితే పాకిస్థాన్ కుట్ర అంటూ వెంటనే ప్రచారం చేస్తారు. ఒకవేళ నిజంగానే పాకిస్థాన్ మన రైళ్లను ప్రమాదాలపాలు చేసి ఎంతోమంది ప్రాణాలు తీస్తే కేంద్ర ప్రభుత్వం ఏం చేస్తున్నట్టు? గతంలో రైలు ప్రమాదాలు జరిగితే రైల్వే మంత్రి రాజీనామా చేయాలనే డిమాండ్ వినిపించేది. ప్రభుత్వ ప్రతిష్ఠ దెబ్బతినేది. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ఇలాంటి వైఫల్యాలను కూడా పాకిస్థాన్ కుట్ర పేరుతో తనకు అనుకూలంగా మార్చుకుంటున్నది. పారిశ్రామిక అభివృద్ధి, నిరుద్యోగ నిర్మూలన, జీడీపీ వృద్ధి వంటి అంశాలను వదిలేసి, మతం ఆధారంగా మళ్లీ మళ్లీ అధికారం హస్తగతం చేసుకోవాలనేది బీజేపీ వ్యూహం. కానీ దేశంలో వినిపిస్తున్న యువత అసంతృప్తి స్వరాలు వింటుంటే రాజకీయాల్లో మార్పు సాధ్యమేమో అనిపిస్తున్నది. ఈ ఏడాది మే 15న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి 'నిరుద్యోగ బొద్దింకలు' కామెంట్ యువతలో కదలిక తీసుకువచ్చింది.


'కాక్రోచ్ జనతా పార్టీ' దేశంలోని అసంతృప్తి స్వరాలకు కేంద్రంగా మారింది. ఈ పార్టీ ఒక రాజకీయ పార్టీ కాదు, ఎన్నికల్లో పోటీ చేయదు, కానీ అధికారపక్షం అవకతవకలను జనంలోకి తీసుకువెళ్లడంలో, ప్రజల్లో చర్చను లేవనెత్తడంలో విజయం సాధించింది. 'నేను నియంతను' అని చెప్పకుండానే నియంతలా వ్యవహరిస్తున్న మోదీ ప్రభుత్వానికి ఈ పార్టీ కంటగింపుగా మారింది.

ప్రజాస్వామ్యాన్ని అమితంగా ప్రేమించిన నెహ్రూ కన్నా ఎక్కువ కాలం అధికారంలో మోదీ ఉన్నారని ఇటీవల గర్వంగా ప్రచారం చేసుకున్నారు. సంవత్సరాల లెక్క ప్రకారం ఎక్కువకాలం నిజమే. కానీ విలువల విషయంలోనూ పోలిక ఉండాలి కదా? నెహ్రూ తన మీద కార్టూన్లు వేస్తే కార్టూనిస్ట్కు ఫోన్ చేసి అభినందించేవారు. తన పాపులారిటీ రోజురోజుకూ పెరిగిపోతుండడంతో నియంతగా మారుతానేమోనని ఆయనకే అనుమానం వచ్చి తన ప్రభుత్వాన్నే తీవ్రంగా విమర్శిస్తూ మారుపేరుతో తానే వ్యాసాలు రాసుకున్నారు. అలాంటి నెహ్రూ కంటే ఎక్కువ కాలం అధికారంలో ఉన్న మోదీ మీడియా వాళ్లు అడిగే ప్రశ్నలకు 'నేను సమాధానం చెప్పడం ఏమిటి?' అన్నట్టు అధికారంలోకి వచ్చి 13 ఏండ్లు అవుతున్నా ఒక్కసారి కూడా మీడియా సమావేశంలో మాట్లాడలేదు. 'మౌనముని' అని మీడియా ఎగతాళి చేసినా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సైతం తరచూ మీడియా సమావేశాలు నిర్వహించి, వారు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పేవారు.

ప్రజాస్వామ్య దేశాల పాలకులు మీడియా వాళ్లు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్తారు. ఉత్తర కొరియా అధ్యక్షుడు, నియంత కిమ్ జాంగ్ ఉన్ 2019లో హనాయ్ సమ్మిట్లో విదేశీ జర్నలిస్టుల ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. కానీ మోదీ పాలనలో మన దేశ మీడియాకు అంతటి అదృష్టం కూడా లేదు. ఢిల్లీలో జరుగుతున్న యువత ఉద్యమం పాలకుల్లో తప్పకుండా కదలిక తీసుకువస్తుంది. నాయకులు వస్తుంటారు, పోతుంటారు. ఈ దేశంలో ప్రజాస్వామ్యం శాశ్వతం అని యువత నిరూపిస్తుంది.

# బిజినెస్

## ఎల్‌టీసీజీ పన్నును ఎత్తివేయం




**న్యూఢిల్లీ :** ఈక్విటీల్లో పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచడంలో భాగంగా దీర్ఘకాలిక మూలధన లాభాలపై పన్ను(ఎల్‌టీసీజీ)ను పూర్తిగా తొలగించాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్న ప్రస్తుత తరుణంలో కేంద్ర ప్రభుత్వం షాకిచ్చింది. ఎల్‌టీసీజీ ట్యాక్స్‌ను పూర్తిగా రద్దు చేసే అంశంపై ప్రస్తుతం ఎలాంటి ప్రతిపాదన లేదని స్పష్టం చేసింది. ఈ విషయాన్ని పార్లమెంట్‌కు కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరీ సమాచారం ఇచ్చారు. 2024–25 మదింపు సంవత్సరంలో రూ. 72,249 కోట్లుగా వసూలైన ఎల్‌టీపీజీ ట్యాక్స్.. ఆ తర్వాతి సంవత్సరంలో 78 శాతం ఎగబాకి రూ.1.29 లక్షల కోట్లకు చేరుకున్నది. సాధారణంగా షేర్లు లేదా మ్యూచువల్ ఫండ్స్‌ను దేశీయ, రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి 12 నెలల కంటే ఎక్కువకాలం పాటు హోల్డ్ చేస్తే వాటిని లాంగ్‌టర్మ్ అసెట్స్‌గా పరిగణిస్తారు. వీటిపై 12.5 శాతం ఎల్‌టీసీజీ పన్నును వసూలు చేస్తారు.

## కుప్పకూలిన బ్లూచిప్ షేర్లు.. తీవ్ర అమ్మకాల ఒత్తిడితో 443 పాయింట్లు పతనమైన సెన్సెక్స్



**ముంబై, జూలై 20:** దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాల్లో ముగిశాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 442.93 పాయింట్లు లేదా 0.57 శాతం కోల్పోయి 77,708.52 వద్ద స్థిరపడింది. ఒకానొక దశలో 783.16 పాయింట్లు పడిపోవడం గమనార్హం. కాగా, భారీ సంస్థల షేర్లను మదుపర్లు పెద్ద ఎత్తున అమ్మేశారు. ఈ క్రమంలోనే యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ల షేర్ విలువలు అత్యధికంగా 5.48 శాతం, 5.12 శాతం చొప్పున దిగజారాయి. ఇటీవలి త్రైమాసిక ఆర్థిక ఫలితాలు నిరుత్సాహకరంగా ఉండటమే కారణమని మార్కెట్ విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 95.80 పాయింట్లు లేదా 0.39 శాతం క్షీణించి 24,238.50 వద్ద నిలిచింది.

# అమెరికా, ఇరాన్ ఉద్రిక్తతలు.. క్రూడ్ ఆయిల్ ధరలకు రెక్కలు

అమెరికా–ఇరాన్ మధ్య మళ్లీ ఉద్రిక్తతలు పెరగడంతో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలకు ఒక్కసారిగా రెక్కలు వచ్చాయి. సోమవారం బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 90 డాలర్ల మార్క్‌ను దాటింది. హర్మూజ్ జలసంధి (హార్మూజ్ శీట ఎశీతీఎబఓ) మీదుగా చమురు సరఫరాలకు అంతరాయం కలుగవచ్చనే ఆందోళనతో మార్కెట్లలో కొనుగోళ్లు పెరిగాయి. దాంతో గత రెండు రోజులుగా చమురు ధరలు వరుసగా ఎగబాకుతున్నాయి. సోమవారం బ్రెంట్ క్రూడ్ ధర దాదాపు మూడు శాతం పెరిగి బ్యారెల్‌కు 90 డాలర్‌లు దాటింది. అంతకుముందు ట్రేడింగ్ సెషన్‌లో కూడా ఇదే స్థాయిలో పెరుగుదల నమోదైంది. అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యూటీఐ) క్రూడ్ కూడా 3.5 శాతానికి పైగా పెరిగి బ్యారెల్‌కు 85.39 డాలర్ల వద్ద ట్రేడైంది. దేశీయంగా మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్) లో ఆగస్టు క్రూడ్ ఫ్యూచర్స్ ధరలు కూడా జోరందుకున్నాయి.
ఉదయం ట్రేడింగ్‌లో బ్యారెల్‌కు రూ.210 పెరిగి రూ.8,120 ఇంట్రాడే గరిష్ఠస్థాయికి చేరాయి. అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావమే దేశీయ ధరలపైనా కనిపించింది. వారాంతంలో అమెరికా, ఇరాన్ మధ్య సైనిక చర్యలు మరింత తీవ్రం కావడం మార్కెట్లను కలవరపరిచింది. ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో లేదని టెహ్రాన్ ప్రకటించడం పరిస్థితిని మరింత ఉద్రిక్తం చేసింది. వరుసగా తొమ్మిదో రోజు ఇరాన్‌లోని లక్ష్యాలపై దాడులు నిర్వహించినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. వాణిజ్య నౌకలు, పౌర నౌకలపై దాడులకు తెగబడుతున్న




ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని బలహీనపర్చడమే తమ లక్ష్యమని తెలిపింది. మరోవైపు హర్మూజ్ జలసంధిలో నాలుగు నౌకలను అడ్డుకున్నట్లు ఇరాన్ నౌకాదళం వెల్లడించింది. వాటిలో రెండు ప్రమాదాలకు గురికాగా, మరో రెండు వెనక్కి వెళ్లిపోయినట్లు సమాచారం. ప్రస్తుత పరిస్థితుల్లో ముడిచమురు ధరలు సమీప కాలంలో బలంగానే కొనసాగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలు కొనసాగితే ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు.

## విస్తరణ బాటలో రఘువంశీ.. రూ 400 కోట్లు సమీకరించిన హైదరాబాదీ కంపెనీ

**హైదరాబాద్ :** హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఏరోస్పేస్, డిఫెన్స్ రంగ సంస్థ రఘువంశీ ఏరోస్పేస్ గ్రూప్ (ఆర్‌వీఏజీ) తన విస్తరణ ప్రణాళికలకు ఊతమిస్తూ 40 మిలియన్ డాలర్లు (సుమారు రూ.400 కోట్లు) సమీకరించింది. దీనికి నార్వేస్ట్, స్కగెన్ అసెట్ మేనేజ్‌మెంట్ నేతృత్వం వహించగా.. ఇండస్ బ్రిడ్జి వెంచర్స్, జీజేఎన్ఎక్స్ వెంచర్స్, ప్రముఖ పెట్టుబడిదారు ఆశిష్ కచోలియా పెట్టుబడులు పెట్టారు. ఈ నిధులను భారత్, యూకే, అమెరికాలోని తయారీ కేంద్రాల విస్తరణకు వినియోగించనున్నట్టు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వంశీ వికాస్ వెల్లడించారు. అలాగే హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలోని హార్డ్‌వేర్ పార్‌లో నిర్మిస్తున్న సమగ్ర తయారీ క్యాంపస్, మిషన్ సిస్టమ్స్, డీప్–టెక్ అండ్ అటానమస్ సిస్టమ్స్ వ్యాపారాల అభివృద్ధికి ఈ పెట్టుబడులు ఉపయోగపడనున్నాయని చెప్పారు. దాదాపు రెండు దశాబ్దాలు గా కార్యకలాపాలు నిర్వహిస్తున్న రఘు వంశీ ఏరోస్పేస్ గ్రూప్.. ప్రస్తుతం 3 దేశాల్లో 10కిపైగా తయారీ యూనిట్లు, 1,200 మందికిపైగా ఉద్యోగులతో కార్యకలాపాలు సాగిస్తోంది. ప్రస్తుతం ఈ సంస్థ వద్ద రూ.2,500 కోట్లకు పైగా ఆర్డర్ బుక్ ఉన్నది. హార్డ్‌వేర్ పార్ ప్రాజెక్టును వేగవంతం చేసి, స్వదేశీ మిషన్ సిస్టమ్స్, అటానమస్ సిస్టమ్స్ అభివృద్ధిపై మరింత దృష్టి సారిస్తామని ఎండీ వంశీ వికాస్ తెలిపారు. సంస్థ సీఈవో శివ అరవింద్ మాట్లాడుతూ.. తమ సంస్థ ఐఐటీలు, ట్రిపుల్‌ఐటీలు, ఏఆర్‌సీఐ, డీఆర్‌డీఓ, ఏడీఏ వంటి ప్రముఖ




విద్యా, పరిశోధనా, రక్షణ సంస్థలతో భాగస్వామ్యాలు కొనసాగిస్తూ స్వదేశీ ఏరోస్పేస్ సాంకేతికతల అభివృద్ధికి కృషి చేస్తోందని వెల్లడించారు

# స్పెయిన్‌దే ప్రపంచ కప్.. ఫైనల్లో మెస్సీసేనకు నిరాశ

ప్రపంచ ఫుట్‌బాల్‌లో సరికొత్త అధ్యాయం మొదలైంది. అర్జెంటీనాను మట్టికరిపిస్తూ రెండోసారి ఫిఫా వరల్డ్‌కప్‌లో గెలిచిన స్పెయిన్ సాకర్‌లో అద్వితీయ శక్తిగా మారింది. స్పెయిన్ పేరు చెప్పగానే ఆ దేశంలోని అందమైన ప్రదేశాలతో పాటు శక్తికి, ధైర్యానికి, పోరాటానికి ప్రతీకగా నిలిచే స్పానిష్ బుల్ గుర్తొస్తుంది. ఫిఫా ప్రపంచకప్‌లో స్పెయిన్ జట్టులోని ప్రతీ ఆటగాడు ఒక్కో బుల్‌లా మారారు. ఎదురైన ప్రతీ ప్రత్యర్థిని ఢీకొంటూ, చివరకు ప్రపంచకప్‌ను తమ ఖాతాలో వేసుకున్నారు. ఫైనల్లో ఆ జట్టు లియోనెల్ మెస్సీతో కూడిన అర్జెంటీనాతో తలపడటంతో అందరూ మరోసారి మెస్సీసేననే ఫేవరెట్‌గా భావించారు. కానీ మైదానంలో కనిపించింది మాత్రం భిన్నమైన దృశ్యం. 120 నిమిషాల పాటు అర్జెంటీనా ఒక్కసారి కూడా గోల్‌పోస్ట్‌ను లక్ష్యంగా చేసుకుని షాట్ కొట్టలేకపోయింది. మెస్సీకి బంతి అందిన ప్రతిసారి ముగ్గురు, నలుగురు స్పానిష్ ప్లేయర్లు చుట్టుముట్టారు. ఫైనల్లో రోడ్రి కెప్టెన్సీలోని స్పెయిన్ ఆట చూశాక ఆ జట్టు అందుకున్నది కప్పు మాత్రమే కాదు.. ప్రపంచ ఫుట్‌బాల్‌నే తన గుప్పిట్లోకి తీసుకుందని చెప్పొచ్చు.

**టికి–టాకా టు టోటల్ ఫుట్‌బాల్ దాకా**

దశాబ్ద కాలంగా స్పెయిన్ ఫుట్‌బాల్ అంటే చిన్న పాస్‌లతో బంతిని ఆధీనంలో ఉంచుకునే 'టికి–టాకా' స్టయిల్ మాత్రమే గుర్తుకొచ్చేది. 2010లో ఈ వ్యూహంతోనే ఆ జట్టు ప్రపంచకప్ గెలిచింది. కానీ, ఇప్పుడు స్పెయిన్ టీమ్‌లో మరో కోణం చేరింది. ప్రస్తుత కోచ్ లూయిస్ డి లా ఫ్యూయెంటె సాంప్రదాయ పాసింగ్ గేమ్‌కు వేగం, దూకుడును జోడించాడు. అవకాశం దొరికితే నేరుగా దాడి చేయడం.. బంతి కోల్పోతే వెంటనే తమ కంట్రోల్‌లోకి తెచ్చుకోవడం కొత్త స్పెయిన్ తీరు. వేగం, తెలివి, క్రమశిక్షణ.. ఈ మూడు కలిసి 'లా రోజా' టీమ్‌ను ప్రపంచంలోనే కంప్లీట్ టీమ్‌గా మార్చాయి.
యువ సంచలనం లామిన్ యమాల్ మెరుపు వేగంతో దూసుకెళ్తే... ఇంకో స్ట్రయికర్ నికో విలియమ్స్ ప్రత్యర్థి రక్షణను చీల్చాడు. పెడ్రి, రుయిజ్ ఆటకు అందాన్ని జోడించారు. కెప్టెన్ రోడ్రి వీటన్నింటికీ కేంద్రబిందువుగా నిలిచాడు. ఇక, ప్రత్యర్థి ఆడే విధానాన్ని మార్చేయడమే స్పెయిన్ అసలైన బలం. టెక్నికల్, టాక్టికల్ ప్లానింగ్‌తో ప్రతి క్షణాన్ని తన ఆధీనంలో ఉంచుకున్న రోడ్రిసేన తుదిపోరులో



మెస్సీ నేతృత్వంలోని అర్జెంటీనా ఎటాకింగ్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసింది. దాంతో టోర్నీలో ఆడిన ప్రతి మ్యాచ్‌లోనూ కనీసం రెండేసి గోల్స్ చేసిన మెస్సీసేన.. ఫైనల్లో మాత్రం ఒక్కసారైనా స్పెయిన్ గోల్ పోస్ట్‌పైకి వెళ్లే సాహసం చేయలేకపోయింది.

**నాడి తెలిసిన గురువు**

2022 ప్రపంచకప్ తర్వాత లూయిస్ డి లా ఫ్యుయెంటెను స్పానిష్ టీమ్ హెడ్ కోచ్‌గా నియమించినప్పుడు చాలామంది ఆశ్చర్యపోయారు. ఎందుకంటే ఫ్యుయెంటెకు పెద్ద క్లబ్‌లకు కోచ్‌గా పనిచేసిన అనుభవం లేదు. వరల్డ్ ఫుట్‌బాల్‌లో తనకు పెద్దగా పేరూ లేదు. కానీ స్పెయిన్ ఫుట్‌బాల్ వ్యవస్థపై అతనికి పూర్తి అవగాహన ఉంది. యూత్ జట్లతో పనిచేసిన అనుభవం ఉంది. ప్రస్తుత జాతీయ జట్టులోని ఆటగాళ్లలో చాలామందిని చిన్నప్పటి నుంచే తీర్చిదిద్దాడు. అదే అతడి బలంగా మారింది. 'మన ఆటను మార్చొద్దు... పరిస్థితులు ఎలా ఉన్నా ఆశలు కోల్పోవద్దు' అనే బలమైన సందేశంతో జట్టును ప్రపంచ చాంపియన్‌గా నిలబెట్టాడు.

**ఐదేండ్లలో 16 అంతర్జాతీయ టైటిళ్లు**

ఈ ప్రపంచకప్ విజయం ఒక్కసారిగా రాలేదు. గత కొన్నేళ్లుగా స్పెయిన్ పురుషుల ఆటలోనే కాకుండా. మహిళల ఫుట్‌బాల్‌లోనూ ప్రపంచాన్ని ఏలుతోంది. యూరోలు.. నేషన్స్ లీగ్‌లు.. ఒలింపిక్స్.. యూత్ ప్రపంచకప్‌లు ఇలా అన్నింటా స్పెయిన్ బుల్స్ ఆధిపత్యమే నడుస్తోంది. గత ఐదేండ్లలో అండర్–17 నుంచి సీనియర్ స్థాయి వరకు స్పానిష్ టీమ్ ఏకంగా 16 అంతర్జాతీయ టైటిళ్లను కైవసం చేసుకోవడం విశేషం. పురుషుల జట్టు వరుసగా 38 మ్యాచ్‌ల్లో ఓటమి ఎరుగకుండా దూసుకెళ్తూ ఫుట్‌బాల్ చరిత్రలోనే సుదీర్ఘ అజేయ రికార్డును నెలకొల్పింది.

**జట్టే అసలైన స్టార్**

అర్జెంటీనాకు మెస్సీ.. ఫ్రాన్స్‌కు ఎంబాపె, ఇంగ్లండ్‌కు హ్యారీకేన్, బ్రెజిల్‌కు నెయ్‌మార్, నార్వేకు హాలెండ్.. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతీ జట్టులో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన ఓ సూపర్ స్టార్ ఉన్నాడు. కానీ, స్పెయిన్ టీమ్‌లో మాత్రం అలాంటి ఒకే ఒక్క సూపర్ స్టార్ లేడు. కానీ 11 మంది స్టార్లున్నారు. ఒక్కరు తప్పు చేస్తే ఇంకొకరు కప్పిపుచ్చారు. ఒక్కరు అలసిపోతే మరొకరు పరుగులు తీశారు. ఒక్కరు గోల్ చేస్తే అంతా సంబరపడ్డారు. వ్యక్తుల కంటే జట్టే గొప్పదని స్పెయిన్ ప్రపంచానికి నిరూపించింది.

**ఫైనల్ ముగిశాక ఫైటింగ్**

ఫైనల్లో ఓడి తీవ్ర నిరాశకు గురైన అర్జెంటీనాకు మిడ్‌ఫీల్డర్ లియాండ్రొ పరెడెస్ దుందుడుకు ప్రవర్తన మరింత చెడ్డపేరు తీసుకొచ్చింది. ఆట ముగిసిన వెంటనే అతడు ప్రత్యర్థి ఆటగాళ్లతో గొడవకు దిగడమే ఇందుకు కారణం. ఆట ఆఖరి విజిల్ మోగాక సంబురాలు చేసుకుంటున్న స్పెయిన్ ప్లేయర్ల వద్దకు వెళ్లిన అతడు పలువురు ఆటగాళ్లను లక్ష్యంగా చేసుకుని వారిపై దాడి చేశాడు. ముందు స్పెయిన్ డిఫెండర్ ఎరిక్ గార్సియా వద్దకు వెళ్లి అతడిని తోసేశాడు. అనంతరం గార్సియాకు మద్దతుగా వచ్చిన సహచరుడు గావిని సైతం రెండుసార్లు కిందపడేసి అతడిపై కోపంతో ఊగిపోయాడు. అర్జెంటీనా కోచ్ స్కలోని సహా ఇతర ఆటగాళ్లు పరెడెస్‌ను అడ్డుకున్నా వినకుండా స్పెయిన్ ప్లేయర్లపై మళ్లీ దాడి చేసేందుకు యత్నించాడు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అయింది.

# స్పోర్ట్స్

## ఆ మసాలా ఉంటేనే మజా.. రిటైర్మెంట్ పుకార్లపై రోహిత్ వ్యాఖ్యలు





**లండన్:** ఇంగ్లండ్‌తో రెండు వన్డేల్లో విఫలమైన వేళ తనపై వచ్చిన రిటైర్మెంట్ పుకార్లకు చెక్ పెడుతూ లార్డ్స్‌లో సత్తాచాటిన రోహిత్ శర్మ.. మూడో వన్డే అనంతరం వాటిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'దేశానికి ప్రాతినిథ్యం వహించడం, బ్యాట్‌తో జట్టుకు ఉపయోగపడేలా ఆడటమే నా పని. నా కెరీర్ ఆరంభం నుంచీ అదే చేస్తున్నా. వాటి (రిటైర్మెంట్, ఫామ్ లేమిపై వస్తున్న విమర్శలు) గురించి చాలాకాలంగా వింటున్నా. నేను ఆడుతున్నంత కాలం అవి ఉంటాయి. అవి నా ఆటను ప్రభావితం చేయలేవు. ఫీల్డ్‌లో ఆడి జట్టును గెలిపించడమే నా పని. నా దృష్టి అంతా దానిమీదే ఉంటుంది. అయినా ఇలాంటి మసాలా లేకుంటే ఆటలో మజా ఉండదు' అని హిట్‌మ్యాన్ పేర్కొన్నాడు. లార్డ్స్‌లో సెంచరీ పట్ల సంతోషం వ్యక్తం చేసిన రోహిత్.. జట్టు ఓడిపోవడం నిరాశ కల్గించిందని అన్నాడు.

## ఆల్ ఇంగ్లండ్ జూనియర్ చాంపియన్ సాయి నచికేత్




తెలంగాణ యువ షట్లర్ సాయి నచికేత్ భట్రాజు భారత బ్యాడ్మింటన్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ జూనియర్ చాంపియన్‌షిప్‌లో మెన్స్ అండర్19 టైటిల్ సొంతం చేసుకున్న దేశ తొలి ఆటగాడిగా నిలిచాడు. మెగా టోర్నీలో అద్భుత ప్రదర్శన చేసిన టాప్ సీడ్ నచికేత్ ఫైనల్లో 21–8, 21–15తో వరుస సెట్లలో భారత్‌కే చెందిన సుహాస్‌ను చిత్తు చేసి టైటిల్ గెలిచాడు.




## ప్రభాస్ ఫౌజీ.. రెబల్ స్టార్ పవర్‌ఫుల్ రోల్..!

రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తోన్న పాన్ ఇండియా చిత్రం ఫౌజీ. ఈ మూవీకి హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ మూవీకి సంబంధించిన క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. ఇందులో ప్రభాస్ ఆజాద్ హింద్ ఫౌజ్ సైనికుడిగా కనిపించనున్నారని తెలుస్తోంది. నేతాజీ సుభాశ్ చంద్రబోస్ నాయకత్వంలో భారత స్వాతంత్ర్యం కోసం ఆయన చేసే పోరాటమే ప్రధానంగా తెరకెక్కించనున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో ప్రభాస్ ముందుగా బ్రిటీష్ ఇండియన్ ఆర్మీలో సైనికుడిగా పనిచేసి.. ఆ తర్వాత సుభాశ్ చంద్రబోస్ నేతృత్వంలోని ఆజాద్ హింద్ ఫౌజ్‌లో చేరుతాడని తెలుస్తోంది. ఇది కేవలం నేతాజీ బయోపిక్ మాత్రమే కాదని.. అంతే కాకుండా ఇండియన్ ఫ్రీడమ్ కోసం పోరాడిన సైనికుల కథను చూపించే చిత్రంగా ఉండనుందని టాక్. ఈ మూవీలో ప్రభాస్ పాత్ర ధైర్య సాహసాలు, త్యాగం, దేశభక్తితో నిండి ఉంటుందని సమాచారం. అయితే దీనిపై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటనైతే రాలేదు. ఈ చిత్రాన్ని డిసెంబరు 3న ఫౌజీ విడుదల కానుందని తాజాగా పోస్టర్‌ను పంచుకుంది. ఈ పోస్టర్‌లో ఎప్పుడు చూడని లుక్‌లో ప్రభాస్ కనిపించారు. దీంతో అభిమానుల్లో అంచనాలు పెంచేసింది. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన ఇమాన్వి హీరోయిన్‌గా కనిపించనుంది. ఈ చిత్రంలో మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్, జయప్రద కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ భారీ యాక్షన్ మూవీ డిసెంబర్ 3న థియేటర్లలో సందడి చేయనుంది. కాగా.. ప్రభాస్ ఫౌజీతో పాటు సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో నటిస్తున్నారు. వీరిద్దరి కాంబోలో స్పిరిట్ చిత్రంలో కనిపించనున్నారు. ఈ మూవీలో త్రిప్తి దిమ్రీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఆ తర్వాత సలార్: పార్ట్ 2, కల్కి 2898 ఏడీ: పార్ట్ 2 సినిమాలు చేస్తున్నారు.

# 10 రోజుల్లో అక్కినేని అఖిల్ 'లెనిన్' రికార్డు వసూళ్లు

టాలీవుడ్ యాక్టర్ అక్కినేని అఖిల్ లైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'లెనిన్'. మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వం వహించిన ఈ మూవీలో మిస్టర్ బచ్చన్ ఫేం భాగ్య శ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించింది. జులై 10న గ్రాండ్‌గా విడుదలైన ఈ చిత్రం నిర్మాతలకు కాసుల వర్షం కురిపిస్తూ అఖిల్ కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. లెనిన్ 10 రోజుల సక్సెస్‌ఫుల్ థియాట్రికల్ రన్‌లో వరల్డ్ వైడ్‌గా రూ.88 కోట్లు సాధించింది. ఈ విషయాన్ని మేకర్స్ అఫీషియల్‌గా అనౌన్స్ చేశారు.

ఈ అరుదైన సందర్భాన్ని పురస్కరించుకుని ఇవాళ సాయంత్రం లెనిన్ టీం హైదరాబాద్‌లో సక్సెస్ మీట్ ఏర్పాటు చేయనుంది. ఈవెంట్‌కు అక్కినేని నాగచైతన్య చీఫ్ గెస్ట్‌గా రాబోతున్నాడు. ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన తర్వాత ఈ మూవీని అన్నపూర్ణ స్టూడియోస్‌తోపాటు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై అక్కినేని నాగార్జున, నాగ వంశీ సంయుక్తంగా నిర్మించారు. రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా వచ్చిన ఈ చిత్రంలో శివాజీ, సునీల్ కీ రోల్స్‌లో నటించారు. ఈశ్వరీరావ్, బ్రహ్మాజీ, ప్రమోద్ పంజు కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి ఎస్ థమన్ మ్యూజిక్ అందించాడు. లెనిన్ థియాట్రికల్ రన్ తర్వాత జీ5 ఓటీటీ ప్లాట్‌ఫాంలో ప్రీమియర్ కానుంది. అంతేకాదు జీ తెలుగు, జీ సినిమాలులో టెలివిజన్ ప్రీమియర్ కానుంది






# అర్థం చేసుకోకుండా కామెంట్స్ చేస్తారు..

### నెట్టింట నెగెటివిటీపై రకుల్ ప్రీత్ సింగ్

తెలుగు, తమిళం, హిందీ ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని యాక్టర్ రకుల్ ప్రీత్ సింగ్. పక్కా ప్రొఫెషనల్‌గా ఉండే ఈ భామ అప్పుడప్పుడు నెటిజన్లు, అభిమానులతో తన అభిప్రాయాలను షేర్ చేసుకుంటుంది. తాజాగా సోషల్ మీడియాలో పెరుగుతున్న నెగెటివిటీ గురించి మాట్లాడింది. సోషల్ మీడియా అనేది కొందరు జనాలు ముక్కుమొఖం తెలియని అకౌంట్లతో తరచూ కఠిన వ్యాఖ్యలు చేస్తూ నెగెటివిటీని ప్రచారం చేసే హబ్‌లాంటిది. చాలా మంది వ్యక్తులు అజ్ఞాత ప్రొఫైల్స్‌తో స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తుంటారు. వారు చేస్తున్నకామెంట్ల ప్రభావం ఎలా ఉంటుందో కనీసం అర్థం చేసుకోరని చెప్పింది. అందరినీ మెప్పించడం అసాధ్యమన్న రకుల్ ప్రీత్ సింగ్ సెలబ్రిటీలు ఆన్‌లైన్‌లో వచ్చే అనవసరమైన ట్రోల్స్, విమర్శల వల్ల తమ ఫోకస్ మార్చుకోకూడదు. నెగెటివిటీని ఎదుర్కొనేందుకు వాటిని పట్టించుకోకుండా వ్యక్తిగత, వృత్తి పరమైన లక్ష్యాలపైన దృష్టి పెట్టడమే ఉత్తమ మార్గమనని చెప్పుకొచ్చింది. ఇండియన్ 2 సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకొచ్చిన రకుల్ ప్రీత్ సింగ్.. స్ట్రెయిట్ తెలుగు సినిమా చేయక చాలా కాలమే అవుతుంది. ప్రస్తుతం రణ్ బీర్ కపూర్ నటిస్తోన్న రామాయణలో కీలక పాత్రలో నటిస్తోంది. రకుల్ నటించిన ౹ాఫ్ఱ౹ాఫ్అఱ౼ాబతీ ఔశీష్ట్ర ఐశీ ప్రస్తుతం ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్‌లో ట్రెండింగ్ అవుతోంది. ఈ భామ నెక్ట్స్ ఇండియన్ 3 చేయాల్సి ఉంది. మరి తెలుగు సినిమాలో ఎప్పుడు కనిపిస్తుందో చూడాలి.

# అల్లు అర్జున్ 'రాకా' టీంలోకి మరో భామ.. ఇంతకీ పాత్ర ఏంటో మరి..?

టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబోలో 'రాకా' సినిమా వస్తుందని తెలిసిందే. సైన్స్ ఫిక్షన్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో వస్తోన్న ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ ప్రాజెక్టులో ఇప్పటికే మలయాళ నటి ఫెమినా జార్జ్, పంజాబీ నటి నైలా గ్రేవల్ భాగమైనట్టు క్రేజీ అప్‌డేట్స్ వచ్చాయని తెలిసిందే. తాజాగా మరో ఆసక్తికర నెట్టింట వైరల్ అవుతోంది. తెలుగు నటి సిరి హన్మంతు 'రాకా' చిత్రంలో జాయిన్ అయింది. రీసెంట్‌గా జరిగిన ఓ ఈవెంట్‌లో నిర్మాత ఎస్‌కేఎన్ ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. సిరి హన్మంతు చివరగా సీతాపయనంలో మెరవగా.. త్వరలో విడుదల కానున్న ' చెన్నై లవ్ స్టోరీ' లో కూడా సందడి చేయనుంది. ఈ నేపథ్యంలో ఇంతకీ సిరి హన్మంతు రాకా మూవీలో ఎలాంటి పాత్రలో కనిపించబోతున్నది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ముంబైలో షూటింగ్ కొనసాగుతోంది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ తెరకెక్కిస్తోంది. ఈ మూవీని 2027 చివరలో విడుదల చేయనున్నారు. ఈ చిత్రానికి సాయి అభ్యాంకర్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు.



## 'కొరియన్ కనకరాజు' కొత్త సాంగ్ రిలీజ్

మెగాహీరోల్లో వరుణ్ తేజ్ ఒకడు. ముకుంద, ఫిదా, తొలిప్రేమ, కంచె లాంటి సినిమాలతో కెరీర్ ప్రారంభంలో సమ్‌థింగ్ డిఫరెంట్ అనిపించుకున్నాడు. తర్వాత నుంచి వరసపెట్టి ఫ్లాప్స్ పడ్డాయి. 2019లో వచ్చిన 'గద్దలకొండ గణేశ్' ఓ మాదిరిగా ఆకట్టుకోగా.. తర్వాత వచ్చిన గని, గాండీవదారి అర్జున, ఆపరేషన్ వాలంటైన్, మాట్కా చిత్రాలు ఒకదానిని మించి మరొకటి డిజాస్టర్స్ అయ్యాయి. దీంతో రెండేళ్లు గ్యాప్ తర్వాత వరుణ్ తేజ్ నుంచి వస్తున్న సినిమా 'కొరియన్ కనకరాజు'. వచ్చే నెల 7న థియేటర్లలో రిలీజ్ కానుంది. వారం క్రితం టీజర్ రిలీజ్ చేయగా పర్లేదనిపించుకుంది. ఈ క్రమంలోనే ఇప్పుడు 'రసగుమ్మడి' అంటూ ఓ పాట వదిలారు. విలేజ్ స్టైల్లో సాగే మాస్ బీట్‌తో ఉన్న ఈ గీతం కలర్‌ఫుల్‌గా బాగుంది. తమన్ మ్యూజిక్ వినసొంపుగా ఉంది. ఇకపోతే ఈ చిత్రానికి మేర్లపాక గాంధీ దర్శకుడు. రితికా నాయక్ హీరోయిన్.



# 10 ఏళ్లలో 152 పేపర్ లీక్‌లు.. ఒక్కరికీ శిక్ష లేదు

**న్యూఢిల్లీ:** భారతదేశ విద్యా వ్యవస్థను మోదీ ప్రభుత్వం నాశనం చేస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. విద్యార్థుల డిమాండ్లు పూర్తిగా చట్టబద్ధమైనవని, వాటిపై రాజీ పడటానికి ఆస్కారం లేదని తేల్చిచెప్పారు. విద్యార్థుల పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. నీట్--యూజీలో అవకతవకలు జరిగాయని, దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ ధర్మేంద్ర ప్రధాన్ ఎందుకు రాజీనామా చేయడం లేదని నిలదీశారు. నిరసనకు దిగిన విద్యార్థులు ఉగ్రవాదులు కాదని.. వారు కేవలం నిష్పక్షపాతమైన విద్యా వ్యవస్థ కావాలని కోరుతున్నారని చెప్పారు. పరీక్షల్లో అక్రమాల వల్ల నష్టపోయిన వారికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ క్షమాపణ చెప్పాల్సిందేనని పేర్కొన్నారు. విద్యార్థులపై దాడికి బాధ్యులైన ప్రతి ఒక్కరినీ జవాబుదారీగా చేయాలన్నారు. రాహుల్ గాంధీ బుధవారం ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. దేశంలో విద్యా వ్యవస్థ రిగ్గింగ్‌కు గురైందని, అది సామాన్య ప్రజలకు అందుబాటులో లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం 'చలో సంసద్' నిరసన సందర్భంగా విద్యార్థులపై పోలీసుల దాడికి సంబంధించిన వీడియోను రాహుల్ ప్రదర్శించారు. ప్రభుత్వం, పాలకులు భయాందోళనలో ఉన్నారని, అందుకే విద్యార్థులను, ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారని ధ్వజమెత్తారు. రాహుల్ గాంధీ ఇంకా ఏం మాట్లాడారంటే..



**విద్యార్థుల డిమాండ్లు నెరవేర్చాలి..**

"ప్రధానమంత్రి నివాసం వద్ద మంగళవారం శాంతియుత నిరసనలో పాల్గొన్న నన్ను బలవంతంగా ఈడ్చేశారు. భౌతిక దాడి చేశారు, నిర్బంధించారు. అవన్నీ నేను లెక్కచేయను. అవి చాలా చిన్న విషయాలు. ప్రజల ఆకాంక్షలను వ్యక్తం చేయడమే నా పని. ఇప్పుడున్న విద్యా వ్యవస్థ వల్ల పేదలు ఇబ్బంది పడుతుండగా, ధనవంతులు పేపర్ లీక్‌లతో పరీక్షల్లో ఉత్తీర్ణులవుతున్నారు. ఈ పరిస్థితి కచ్చితంగా మారాలి. విద్యార్థులు లేవనెత్తిన మూడు డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి. విద్యార్థులపై దాడి చేసినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. విద్యార్థులకు ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలి.

**విద్య పేరిట దోచుకుంటున్నారు**

మన విద్యార్థులకు ఇలా ఎందుకు జరుగుతోంది అన్నదే ప్రశ్న. భద్రతా దళాలు వారిపై ఆయుధాలు గురిపెట్టడానికి, దాడి చేయడానికి విద్యార్థులు చేసిన తప్పేంటి? వారు ఈ దేశం తమకు ఇవ్వాల్సిన వాటిని కోరుతూ శాంతియుతంగా నిరసన తెలుపుతున్నారు. న్యాయబద్ధమైన విద్యా వ్యవస్థ కావాలని అంటున్నారు. విద్యా వ్యవస్థలో లోపాల వల్ల పిల్లలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అంతులేని ఒత్తిడికి గురవుతున్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమ విద్యా వ్యవస్థల్లో ఒకటిగా పేరుగాంచిన మన విద్యా వ్యవస్థ నేడు లోపాలమయంగా మారిన సంగతి అందరికీ తెలుసు. గత దశాబ్ద కాలంలో 152 సార్లు ప్రశ్నపత్రాల లీకేజీలు జరిగాయి. కానీ, ఒక్కరికి కూడా శిక్ష పడలేదు. విద్యా వ్యవస్థ వైఫల్యం కారణంగా 7.5 కోట్ల మంది విద్యార్థులు ప్రభావితమయ్యారు. సమాజంలో ఒక వర్గం వ్యక్తులు మన విద్యా వ్యవస్థను, విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తున్నారు. మన దేశంలో కుటుంబాలు విద్య కోసం చేసే వార్షిక వ్యయం రూ.1.32 లక్షల కోట్లు. ఇది రూ.1.4 లక్షల కోట్ల విద్యా బడ్జెట్‌కు దాదాపు సమానం. విద్య పేరిట కుటుంబాలను దోచుకుంటున్నారు. దేశంలో తయారీ రంగం మూతపడింది, పరిశ్రమల్లో అవకాశాలు లేవు, కార్పొరేట్ ఉద్యోగాలు లేవు. ఇక మిగిలిన ఏకైక మార్గం ప్రభుత్వ ఉద్యోగం మాత్రమే. అవి కూడా దక్కకుండా విద్యావ్యవస్థను ధ్వంసం చేశారు" అని రాహుల్ గాంధీ నిప్పులు చెరిగారు.

**జితేంద్ర సింగ్ గురించి చర్చ అనవసరం**

కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తనపై చేసిన వ్యాఖ్యలను రాహుల్ గాంధీ కొట్టిపారేశారు. జితేంద్ర సింగ్‌ను 'అప్రస్తుత వ్యక్తి'గా అభివరి?ణంచారు. నీట్--యూజీపై చర్చకు రాహుల్ తొలుత అంగీకరించి, తర్వాత మాట మార్చారని, ప్రధాని మోదీ రాజీనామా చేయాలంటూ పట్టుబట్టారని జితేంద్ర సింగ్ మంగళవారం ఆరోపించిన సంగతి తెలిసిందే. దీనిపై రాహుల్ బుధవారం స్పందించారు. "జితేంద్ర సింగ్ తనకు నచ్చిన ఎలాంటి విషయాన్నైనా ఊహించుకోవచ్చు. అలా ఊహించుకోవడానికి ఆయనకు పూర్తి స్వేచ్ఛ ఉంది. దాని గురించి నాకు ఎలాంటి అభ్యంతరం లేదు"అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రి ఆరోపణల గురించి ఇప్పుడు మాట్లాడాల్సిన అవసరం లేదన్నారు. ఆయన గురించి చర్చ నిరర్థకమని పేర్కొన్నారు.

**పది రెట్లు దాడి చేసినా ఐ డోంట్ కేర్**

ప్రతి ప్రభుత్వంలోనూ నాయకత్వం మానసికంగా కుప్పకూలిపోయే సమయం వస్తుంది. ఇప్పుడు అదే జరిగింది. పోలీసులు నాతో ఎలా ప్రవర్తించారనేది నాకు అనవసరం. నేను పట్టించుకోను. నాతో ఐదు రెట్లు దారుణంగా ప్రవర్తించినా పట్టించుకోను. విద్యా వ్యవస్థపై, పత్రాల లీకేజీలను అరికట్టడంపై, పిల్లలకు చెల్లించాల్సిన ఖర్చులపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. నా విషయంలో నచ్చింది చేసుకోండి. ఐదు రెట్లు కాదు కదా పది రెట్లు దాడి చేసినా ఐ డోంట్ కేర్. పోలీసులు నాతో ప్రవర్తించిన తీరువల్ల ఎన్నో విషయాలు నేర్చుకుంటాను. దెబ్బలు తినడం నాకు అలవాటే. అది సమస్యేమీ కాదు. ఇప్పుడంతా బాగానే ఉంది. ఒకటి రెండు దెబ్బలు తినడం పెద్ద విషయం కాదు. ఇంకా ఎన్నో దెబ్బలు తినడానికి సిద్ధంగా ఉన్నాను. పోలీసులు నన్ను ఈడ్చుకెళ్లి అక్కడి నుంచి తొలగించారు. అయితే, ఈ ప్రభుత్వాన్ని తొలగించమని నా చెవిలో చెప్పారు. ఆ భావన వారిలో ఉంది. జరిగిన దానిపై పోలీసులు కూడా సంతోషంగా లేరు. విద్యార్థులపై దాడి చేయడం దేశ భవిష్యత్తుకు వ్యతిరేకమైన నేరమని వివేకవంతులైన కొందరు పోలీసు సిబ్బంది భావిస్తున్నారు. నిరసనకారుల్లో తమ పిల్లలను చూసుకుంటున్నారు.

## నీట్‌పై చర్చకు సిద్ధం



నీట్ అంశంపై పార్లమెంట్‌లో చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, పేపర్ లీక్‌తో సంబంధమున్న అన్ని అంశాలపై సమగ్ర చర్చకు సిద్ధంగా ఉన్నామని కేంద్ర మంత్రి జేపీ నడ్డా తెలిపారు. విపక్షాలు అడిగే ప్రశ్నలకు పార్లమెంటులో సమాధానాలు ఇస్తామన్నారు. అయితే, విపక్షాలు చీటికిమాటికి గోల్‌పోస్టు మారుస్తున్నాయని, విద్యార్థుల భవిష్యత్ గురించి తమకు పూర్తి బాధ్యత ఉందని ఆయన స్పష్టం చేశారు.

గతంలో కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో పేపర్లు లీక్ అయ్యాయని, యూపీఏ హయాంలో ఎన్నో రాష్ట్రాల్లో పేపర్లు లీక్ జరిగాయని నడ్డా వ్యాఖ్యానించారు. విద్యార్థుల అంశాన్ని రాజకీయంగా వాడుకోవటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. కొన్ని అంశాలనే టార్గెట్‌గా చేసుకుని రాహుల్‌గాంధీ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. హిమాచల్‌ప్రదేశ్, ఝార్ఖండ్ రాష్ట్రాల్లో పేపర్లు లీక్ జరిగిందని, తెలంగాణలో ఇంటర్ పేపర్, కేరళ, తమిళనాడులో పేపర్లు లీక్ అయ్యాయని తెలిపారు. బంగాల్, కర్ణాటకలోనూ ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయని పేర్కొన్నారు. కానీ, బీజేపీ ప్రభుత్వం మాత్రం బాధ్యయుతంగా వ్యవహరిస్తోందని తెలిపారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ ఘటనపై విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జరుగుతున్న నిరసనల నేపథ్యంలో నడ్డా దిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో మీడియాకు వివరాలు తెలియజేశారు.

**పేపర్ లీక్ ఆందోళనకారులకు రాజ్‌నాథ్ సింగ్ హామీ**

విద్యార్థులకు ఎలాంటి అన్యాయం జరగకుండా ప్రభుత్వం చూసుకుంటుందని నీట్ పేపర్ లీక్ ఆందోళనకారులకు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ హామీ ఇచ్చారు. తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం విద్యార్థులను విపక్షాలు కీలుబొమ్మలుగా చేసుకున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. విద్యార్థులు, యువత ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని వివరించారు.

ం"దిల్లీలో జరుగుతున్న నిరసనలు తీవ్ర ఆందోళన కలిగించే విషయం. కొందరు వ్యక్తులు తమ రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకోవడానికి మన దేశ విద్యార్థులను, యువతను రాజకీయ సాధనాలుగా వాడుకోవడానికి ప్రయత్నించడం అత్యంత దురదృష్టకరం. మోదీ నాయకత్వంలో విద్యార్థులు, యువత ఆకాంక్షలను నెరవేర్చడానికి, అలాగే వారి సంక్షేమం కోసం మా ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంది. విద్యార్థుల ప్రతి ఆందోళనను ఆలకించి, వాటిని పరిష్కరించడం మా బాధ్యత. అటువంటి మోసపూరిత ప్రయత్నాలను భారతదేశపు చైతన్యవంతమైన, తెలివైన యువత పూర్తిగా అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నా. వారు పురోగతి, అభివృద్ధి, దేశ నిర్మాణ మార్గాన్ని ఎంచుకుంటారని నాకు పూర్తి నమ్మకం ఉంది" అని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.

**యువతను తప్పుదోవ పట్టించడానికి విఫల ప్రయత్నాలు**

కొందరు ప్రతిపక్ష నాయకులు విద్యార్థుల్లో కోపావేశాలను సృష్టిస్తున్నారని రాజ్?నాథ్? ఆందోళన వ్యక్తం చేశారు. యువతను తప్పుదోవ పట్టించడానికి విఫల ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. పార్లమెంటులో కాకుండా వీధుల్లో సమస్యలను పరిష్కరించుకోవడానికి ప్రతిపక్షం అనుచితమైన ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ప్రజాస్వామ్య సమస్యలను చర్చించడానికి సరైన వేదిక పార్లమెంట్ భవనమని, అక్కడ ప్రతిపక్షానికి తమ అభిప్రాయాన్ని స్వేచ్ఛగా వెల్లడించే పూర్తి స్వేచ్ఛ ఉందని తెలిపారు. తమ ప్రభుత్వం కూడా యువత భావాలు, ఆందోళనలను వినడానికి సిద్ధంగా ఉందని, ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ప్రతి అంశంపై అర్థవంతమైన చర్చ జరగాలని ప్రభుత్వం కూడా చెప్పిందన్నారు. సభ సజావుగా పనిచేసేందుకు ప్రతిపక్షాలు అనుమతించాలని కోరుతూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు. ఇదిలా ఉండగా, బుధవారం ఉదయం, ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంట్ ప్రాంగణంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నల్ల దుస్తులు ధరించి నిరసన తెలిపారు. ఈ నిరసనలో లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్? యాదవ్, కాంగ్రెస్? ఎంపీ ప్రియాంక గాంధీ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తున్నారు

నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై దేశ రాజధానిలో విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతున్న వేళ కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రతిపక్షాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. విద్యార్థులు, యువతను రాజకీయ ప్రయోజనాల కోసం సాధనంగా ఉపయోగించేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. విద్యార్థులకు ఎలాంటి అన్యాయం జరగకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం విద్యార్థులు, యువత సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉందని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. విద్యార్థుల ప్రతి ఆందోళనను విని పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత అని చెప్పారు. ప్రతిపక్ష నేతలు సృష్టిస్తున్న ఆగ్రహ వాతావరణం ప్రజలను, ముఖ్యంగా యువతను తప్పుదోవ పట్టించే విఫలయత్నమేనని విమర్శించారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ అంశంపై చర్చకు ప్రభుత్వం మొదటి నుంచే సిద్ధంగా ఉందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఇలాంటి అంశాలపై చర్చ జరగాల్సిన వేదిక పార్లమెంటేనని, వీధుల్లో కాకుండా సభలోనే ప్రతిపక్షాలు తమ అభిప్రాయాలను వెల్లడించాలని సూచించారు. పార్లమెంట్ సజావుగా నడిచేలా ప్రతిపక్షాలు సహకరించాలని కోరారు. నీట్-యూజీ ప్రశ్నపత్రం లీక్, విద్యార్థుల ఆందోళనలపై చర్చ చేపట్టాలంటూ ఇండియా కూటమి సభ్యులు పార్లమెంట్ ఉభయ సభల్లో నిరసన వ్యక్తం చేశారు. దీంతో లోక్‌సభ పలుమార్లు వాయిదా పడగా, రాజ్యసభ కూడా అంతరాయానికి గురైంది. అయితే ఈ అంశంపై చర్చకు ప్రభుత్వం పూర్తి సిద్ధంగా ఉందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మరోసారి స్పష్టం చేశారు.

## ఆరు వారాల గరిష్ఠానికి ముడి చమురు



అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు మరోసారి భగ్గుమన్నాయి. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర గత ఆరు వారాల్లో తొలిసారిగా బ్యారెల్‌కు 95 డాలర్ల మార్కును అధిగమించింది. ప్రపంచ ఇంధన మార్కెట్లో నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, సరఫరా సంబంధిత ఆందోళనలు, మారుతున్న డిమాండ్ పరిస్థితులే ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా మధ్యప్రాచ్యంలో నెలకొన్న పరిణామాలు, ప్రధాన చమురు ఉత్పత్తి దేశాలు ఉత్పత్తిలో సర్దుబాట్లు చేయడం వంటివి ధరల పెరుగుదలకు దారితీశాయి. ఇది చమురు మార్కెట్లలో మళ్లీ అస్థిరతను సూచిస్తోందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇరాన్ మిలిటరీ స్థావరాలపై అమెరికా వైమానిక దాడులు కొనసాగిస్తుండటంతో, ప్రతిగా ఇరాన్ కూడా బహ్రెయిన్, కువైట్, జోర్డాన్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై దాడులకు పాల్పడుతోంది. దీనికి తోడు యెమెన్‌కు చెందిన హౌతీ తిరుగుబాటుదారులు సౌదీకి సంబంధించిన నౌకలను దిగ్బంధనం చేస్తామని హెచ్చరించడంతో, ఆయిల్ ట్యాంకర్లు తమ రవాణా మార్గాలను మార్చుకుంటున్నాయి. ముడి చమురు ధరల పెరుగుదల ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం, రవాణా ఖర్చులపై నేరుగా ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇంధనం దిగుమతులపై ఆధారపడిన దేశాల ఆర్థిక వ్యవస్థలకు ఇది సవాలుగా మారనుంది. ఈ నేపథ్యంలో వివిధ దేశాలు ప్రభుత్వాలు, పారిశ్రామిక వర్గాలు మార్కెట్ కదలికలను నిశితంగా గమనిస్తున్నాయి. రానున్న రోజుల్లో ఒపెక్ం దేశాలు తీసుకోబోయే నిర్ణయాలు, అంతర్జాతీయ ఆర్థిక సంకేతాలపై చమురు ధరల గమనం ఆధారపడి ఉంటుందని మార్కెట్ వర్గాలు అంచనా

# సిట్ నివేదిక తర్వాతే సీఈవో నియామకం



అయోధ్య రామమందిర ధార్మిక వ్యవహారాలను పర్యవేక్షించేందుకు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ 9 మందితో కూడిన ఓ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో అయోధ్యకు చెందిన ఐదుగురు సాధువులు, వేరే ప్రాంతాల నుంచి నలుగురు సభ్యులుగా ఉంటారు. ఈ మేరకు అయోధ్య రామాలయం విరాళాల చోరీ వ్యవహారం తర్వాత రెండోసారి సమావేశమైన ట్రస్ట్ సభ్యులు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రామాలయంలో అర్చకత్వం నిర్వహించే పూజారుల కోసం ఓ శాశ్వత శిక్షణ సంస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ట్రస్టు కోశాధికారి గోవింద్ దేవ్ గిరి వెల్లడించారు. ఈ సంస్థలో శిక్షణ పూర్తి చేసుకున్న అర్చకులకు ట్రస్ట్ ద్వారా ధ్రువపత్రాలను అందజేస్తామని తెలిపారు. ట్రస్ట్ సీఈవో పదవికి దేశవ్యాప్తంగా 5 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయని వెల్లడించారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించేందుకు నెల రోజుల సమయం పట్టే అవకాశం ఉందని చెప్పారు. ప్రస్తుత పరిపాలనా అవసరాలను దృష్టిలో ఉంచుకుని తాత్కాలికంగా ఓ అంతర్గత కార్యదర్శిని నియమించాలని సమావేశంలో నిర్ణయించినట్లు స్పష్టం చేశారు. రామాలయ విరాళాల దుర్వినియోగానికి సంబంధించి సిట్ తుది నివేదిక ఇంకా తమకు అందలేదన్న గోవింద్ దేవ్ గిరి సిట్ నివేదిక తర్వాతే సీఈవో నియామకంపై తదుపరి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ధర్మకర్తల మండలి సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

ఈ సమావేశంలోనే, శ్రావణమాసంలో వచ్చే భక్తుల కోసం చేయాల్సిన ఏర్పాట్లు, ఖాళీగా ఉన్న ధర్మకర్తల పదవుల భర్తీ సహా, పలు పరిపాలనా, ఆర్థిక సమస్యలను కూడా సమీక్షించారు. ఈ సమావేశం తర్వాత ట్రస్ట్ తాత్కాలిక ప్రధాన కార్యదర్శి కృష్ణమోహన్?, కోశాధికారి గోవింద్? దేవ్? గిరి విలేకరులతో మాట్లాడారు. "రామ మందిరానికి సంబంధించిన అన్ని మతపరమైన వ్యవహారాలను పర్యవేక్షించడానికి ఒక శాశ్వత మత కమిటీని ఏర్పాటు చేయాలని ట్రస్ట్ నిర్ణయించింది. ఈ కమిటీలో 9 మంది సాధువులు ఉంటారు. వీరిలో ఐదుగురు అయోధ్యకు చెందినవారు కాగా, నలుగురు బయటివారు ఉంటారు" అని గోవింద్ దేవ్ గిరి తెలిపారు.

**వైష్ణవ-రామానంది నిబంధనల అమలు!**

శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు సభ్యుడు, నిర్మోహి అఖాడా అధిపతి దినేంద్ర దాస్ బుధవారం కీలక వ్యాఖ్యలు చేశారు. ఆలయ ట్రస్ట్‌లో ఖాళీగా ఉన్న మూడు స్థానాల్లో ఒక దానికి దివంగత ట్రస్టీ బిమ్లేంద్ర మోహన్ ప్రతాప్? మిశ్రా కుమారుడిని నియమించాలని కోరారు. దీనితోపాటు ఆలయ పూజా విధానాలు, ఆచారాలు కచ్చితంగా వైష్ణవ-రామానంది సంప్రదాయం ప్రకారమే జరగాలని తాను ట్రస్ట్ ముందు ప్రతిపాదించినట్లు తెలిపారు. వైష్ణవ సంప్రదాయంలోని ఈ విధానం ప్రకారం, శ్రీరాముడిని సర్వోన్నత దేవుడిగా పూజిస్తారు. ఈ సంప్రదాయం సంత్ రామానంద కాలం నుంచి వస్తోంది. అయోధ్యలోని మిగిలిన ఆలయాల తరహాలోనే ఈ రామాలయంలో కూడా రోజువారీ పూజలు, ఇతర కార్యక్రమాలు ఈ వైష్ణవ-రామానంది సంప్రదాయం ప్రకారమే జరుగుతాయి. అయితే దక్షిణ భారతదేశంలో అనుసరించే రామానుజాచార్య సంప్రదాయం ఇక్కడకు తీసుకురావడంపై కొన్ని వర్గాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమైనట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.

మరోవైపు మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్‌ను తిరిగి ట్రస్టులోకి తీసుకువచ్చే విషయమై ఏమైనా చర్చ జరిగిందా? అని విలేకరులు ప్రశ్నించగా, ఆ విషయంపై తనకు ఎలాంటి సమాచారం లేదని దినేంద్ర దాస్? చెప్పారు. అయితే ట్రస్ట్ తీసుకున్న ఏ నిర్ణయమైనా అందరికీ ఆమోదయోగ్యమేనని అన్నారు. అలాగే అయోధ్య రామమందిర విరాళా దుర్వినియోగం ఆరోపణల నేపథ్యంలో ప్రారంభించిన శుద్ధీకరణ ప్రక్రియ అనేది ఒక ఆచారమని, ఇది మరో రెండు మూడు రోజులపాటు కొనసాగుతుందని దాస్? చెప్పారు. "ప్రాయశ్చిత్తంగా చేస్తున్న ఈ శుద్ధీకరణ ఆచారం ఇప్పటికే సానుకూల ఫలితాలను ఇస్తోంది. మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి" అని చెప్పారు.

# నీట్‌పై చర్చకు విపక్షాలు పట్టు

నీట్-యూజీ ప్రశ్నపత్రం లీక్ వివాదం, నిరసనకారులపై పోలీసుల చర్య, ప్రతిపక్ష నాయకుల నిర్బంధం పార్లమెంట్ లో మరోసారి తీవ్ర దుమారం రేపింది. ఈ అంశాలపై రాజ్యసభలో రూల్ 267 కింద అన్ని కార్యక్రమాలను నిలిపివేసి తక్షణ చర్చ చేపట్టాలని విపక్షాలు పట్టుబట్టాయి. అయితే ప్రభుత్వం అందుకు అంగీకరించకపోవడంతో సభలో ప్రతిష్టంభన కొనసాగుతోందని కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు జైరాం రమేశ్ ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేశారు. రాజ్యసభలో ప్రతిపక్ష నేత నేతృత్వంలో పలువురు విపక్ష పార్టీల సభ్యులు రూల్ 267 కింద నోటీసు సమర్పించినట్లు జైరాం రమేశ్ తెలిపారు. జులై 20న విద్యార్థుల శాంతియుత నిరసనల సందర్భంగా పోలీసులు అధిక బలప్రయోగానికి పాల్పడ్డారనే ఆరోపణలపై చర్చ జరపాలని వారు కోరినట్లు చెప్పారు. నీట్ అంశంపై రూల్ 267 కింద చర్చ నిర్వహించేందుకు ప్రభుత్వం నిరాకరించడమే రాజ్యసభలో ప్రతిష్టంభనకు ప్రధాన కారణమని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి ఈ అంశంపై మౌనం వీడాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌పై కూడా చర్చ జరగాలని విపక్షం కోరుతోందన్నారు. అయితే రాజ్యసభలో రూల్ 267 ప్రకారం సభలో ముందుగా నిర్ణయించిన కార్యక్రమాలను నిలిపివేసి అత్యవసర ప్రజా ప్రయోజన అంశంపై వెంటనే చర్చ చేపట్టే అవకాశం ఉంటుంది. అయితే రూల్ 176 కింద స్వల్పకాలిక చర్చ మాత్రమే నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో రూల్ 267 కిందే చర్చ జరగాలని విపక్షం పట్టుబడుతుండగా, ప్రభుత్వం మాత్రం సభా నిబంధనలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని చెబుతోంది. లాఠీచార్జ్, టియర్ గ్యాస్, పెల్లెట్ గన్స్, షాక్ బ్యాటన్లు, వాటర్ క్యానన్ల వినియోగంపై సభలో సమగ్ర చర్చ జరగాలని విపక్షం డిమాండ్ చేసింది. అలాగే జులై 21న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు ఇతర విపక్ష నేతలను అదుపులోకి తీసుకున్న ఘటనపైనా వివరణ కోరింది. కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ నీట్-సీబీఎస్ఈ పరీక్షల లీకేజీ అంశంపై వాయిదా తీర్మానం ద్వారా చర్చ జరగాలని అన్ని విపక్ష పార్టీలు ఏకగ్రీవంగా నిర్ణయించాయని తెలిపారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో పాటు భవిష్యత్తులో ప్రశ్నపత్రాల లీకేజీని అరికట్టేందుకు సమగ్ర కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ రామ్ గోపాల్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం చర్చకు దూరంగా పారిపోతోందని విమర్శించారు. సభ పదేపదే వాయిదా పడుతోందని, రాహుల్ గాంధీ నేతృత్వంలో జరిగిన నిరసనలకు తమ పార్టీ పూర్తి మద్దతు ఇచ్చిందని చెప్పారు.

చర్చకు సిద్ధమే: కేంద్రం

మరోవైపు ప్రభుత్వం మాత్రం నీట్? అంశంపై చర్చ నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. గత మూడు రోజులుగా చర్చకు సిద్ధమని అధికారికంగా తెలియజేస్తున్నామని చెప్పారు. అయితే ఏ నిబంధన కింద చర్చ జరపాలన్న అంశాన్ని అన్ని పార్టీల ఫ్లోర్? లీడర్లు కలిసి నిర్ణయించాలని సూచించారు. దేశ యువతకు సంబంధించిన అత్యంత కీలకమైన అంశమైనందున ఫలవంతమైన చర్చ జరగాలని ప్రభుత్వం కోరుకుంటోందన్నారు. ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రజల ముందుకు తీసుకురావడానికి కూడా ఈ చర్చ ఉపయోగపడుతుందని వివరించారు.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137